అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

మంగళవారం 13-2-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 43

Published from Rangareddy, Hyderabad, Khammam, Karimnagar

16 పేజీలు వెల : 6.50

రేషన్ షాపుల్లో మోడీ పోస్టర్లు, బ్యానర్లు పెట్టం



కేరళ సీఎం విజయన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేరళలోని రేషన్ షాపుల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని కేంద్రం జారీ చేసిన ఆదేశాలు సరైనవి కాదని, వీటి అమలు కష్టమని సీఎం పినరయి విజయన్ తెలిపారు. కేరళలో రేషన్ వ్యవస్థ దీర్ఘకాలంగా ఉందని, గతంలో ఎన్నడూ ...15లో

జలదోపిడీని అడ్డుకుంటాం

కేసీఆర్ అసమర్థతతోనే తెలంగాణకు తీరని నష్టం

- కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించేది లేదంటూ అసెంబ్లీలో తీర్మానం

- అధికార,విపక్షాల మధ్య మాటల యుద్ధం
- తప్పు మీదంటే మీదేనని పరస్పర విమర్శలు
- పద్మారావుకు ప్రతిపక్ష బాధ్యతలు ఇవ్వండి:రేవంత్
- సభకు రాకుండా..నల్లగొండకు వెళతారా ?:భట్టి
- ప్రభుత్వ తీర్మానానికి బీఆర్ఎస్ మద్దతు
- నేడు మేడిగడ్డకు సర్కారు

కృష్ణాజలాల వాటా, కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింతపై తెలంగాణ అసెంబ్లీలో మాటల తూటాలు పేలాయి. ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సభ్యుల మధ్య యుద్ధం నడిచింది. అధికార, విపక్షాలు తప్పు మీదంటే మీదేనని వాగ్వివాదానికి దిగాయి. తమ దగ్గర ఉన్న ఫైళ్లు, కాగితాలు, వీడియో క్లిప్పింగ్‌లను సాక్షాల కింద చూపే ప్రయత్నం ఇరుపార్టీలు చేశాయి. మొత్తం వ్యవహారంపై సర్కారు అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజేంటేషన్ ఇచ్చింది. మంత్రులు, ఎమ్మెల్యేల ప్రసంగాలను అడ్డుకునే ప్రయత్నాలు ఇరుపక్షాల నుంచి జరిగింది. మధ్యలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జోక్యం చేసుకుని సభను అదుపుచేసే ప్రయత్నం చేశారు. పదే పదే జోక్యం చేసుకుని సభ్యులు సభకు సహకరించాలనీ, ఎవరైనా చైర్‌ను ఉద్దేశించి మాట్లాడాలని సూచించారు. ఇందుకోసం సభ్యుల సౌకర్యార్థం రెండు స్ర్కీన్లు సైతం సర్కారు ఏర్పాటు చేసింది.



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

అసెంబ్లీలో 'కృష్ణా ప్రాజెక్టులపై వాస్తవాలు..బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలు' పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కారు శ్వేతపత్రం విడుదల చేసింది. చర్చ అనంతరం సభ తీర్మానాన్ని ఆమోదించింది. కేసీఆర్ పదేండ్ల పాలనలో జరిగిన తప్పుడు విధానాలే, ఇప్పుడు తెలంగాణకు శాపాలయ్యాయని పేర్కొంటూ కృష్ణానదీపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించే ప్రసక్తే లేదనీ, రాష్ట్రానికి దక్కాల్సిన వాటా కోసం గట్టి ప్రయత్నం చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇరుపక్షాల ప్రసంగాలను అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయి..

రాష్ట్ర సాగునీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజేంటేషన్(పీపీటీ) ఇచ్చారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో జరిగిన జలదోపిడిని అడ్డుకునేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తామని చెప్పారు. ' తెలంగాణ ఎన్నికల రోజున ఏపీ ప్రభుత్వం నాగార్జునసాగర్‌పై పోలీసులను పంపింది. రోజుకు మూడు టీఎంసీల నీటిని అక్రమంగా తరలించుకుపోయింది.కేసీఆర్ ఓడిబోతోతున్నారనే సాగర్‌పైకి జగన్ పోలీసులను పంపినట్టు అనిపిస్తోంది..ఎలాంటి పరిస్థితుల్లోనూ షరతులకు అంగీకరించకుండా ...15లో



కృష్ణా జలాలపై లాభం కలిగేలా చర్చ ఉండాలి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వివరాలు 3లో

అవన్నీ అవాస్తవాలు : హరీశ్‌రావు

పీపీటీ అనంతరం స్పీకర్ బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావుకు మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. ప్రభుత్వం అబద్ధాలను పీపీటీ ద్వారా చెప్పిందని విమర్శించారు. పీపీటీ అవకాశం తమకూ ఇవ్వాలని కోరినా, ఇవ్వకపోవడం దారుణమన్నారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించబో మని ప్రభుత్వం ప్రకటన చేయడం తెలంగాణ ప్రజలు, బీఆర్ఎస్ విజయమని అన్నారు. నల్లగొండలో సభ పెడుతున్నందునే మంత్రి ఈ ప్రకటన చేశారనీ, తప్పులను సవరించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు వ్యాఖ్యపై కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లాను మోసం చేసినందునే ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించారని చెప్పారు. ఏపీ అసెంబ్లీలో జగన్ ఇచ్చిన స్టేట్‌మెంట్ వినలేదా ? అని ప్రశ్నించారు. ఏపీ సీఎం చెప్పిన తర్వాత కూడా తామే తప్పుచేసినట్టు మాట్లాడితే ఎలా ? అని నిలదీశారు. కేసీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి తమ జిల్లాను మోసం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ పుణ్యమా అని వ్యవసాయం సంగతి అటుంచితే, తాగునీటికి నీళ్లు లేక ట్యాంకర్లు పెడుతున్నామని అన్నారు. జగదీశ్‌రెడ్డికి ముఖం చెల్లకే ఈరోజు సభకు రాలేదని అని విమర్శించారు. కృష్ణాజలాల విషయంలో కేసీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే నల్లగొండ సభకు రావాలని వ్యాఖ్యానించారు.



సీఎం వర్సెస్ హరీశ్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి హరీష్‌రావు మధ్య అసెంబ్లీలో మాటల యుద్ధం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి చర్చలో జోక్యం చేసుకుంటూ తెలంగాణ ఉద్యమం జరిగిందే నీళ్ల కోసమనీ, అలాంటి చర్చ సందర్భంగా ప్రతిపక్ష పార్టీ లీడర్ కేసీఆర్ సభలో లేకుండా ఫామ్‌హౌస్‌లో దాచుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు. కరీంనగర్ ప్రజలు తరిమితే మహబూబ్‌నగర్ ఎంపీగా గెలిపించారని పరోక్షంగా కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దక్షిణ తెలంగాణ కృష్ణాజలాలపై ఆధారపడి ఉందని అన్నారు. సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం గురించి రేవంత్‌రెడ్డి మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించడమే అవుతుందన్నారు. 'మిమ్మల్నీ కొడంగల్ ప్రజలు తరిమితే మల్కాజ్‌గిరికి వచ్చారని భావించాలా' అంటూ హరీశ్ కౌంటర్ ఇచ్చారు.

పానీ పట్టు యుద్ధం..



- అసెంబ్లీలో పై చేయి సాధించేందుకు అధికార, ప్రధాన ప్రతిపక్షం తహతహ
- పవర్ పాయింట్ ప్రజంటేషన్‌పై సందర్భంగా వాగ్బాణాలు
- సభలో తీర్మానించటం మేం సాధించిన విజయమే : హరీశ్‌రావు
- ప్రతిపక్ష నేత సమాజాన్ని అవమానపరుస్తున్నారు : సీఎం రేవంత్

వివరాలు 8లో


రాచకొండ కమిషనర్ ఆకస్మిక బదిలీ

మరో 11 మంది ఐపీఎస్‌లకు స్థాన చలనం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్రంలో 12 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ముఖ్యంగా, రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు ను ఆకస్మికంగా బదిలీ చేయటమే కాక, మరో ఇద్దరు కమిషనర్లకు ఇటీవలన ఇచ్చిన నియామక పత్రాలను రద్దు చేసి వేరే పోస్టుకు మార్చారు. రాచకొండ నూతన కమిషనర్‌గా మల్టీజోన్-2 ఐజీ తరుణ్ జోషిని నియమించి, ఇక్కడున్న కమిషనర్ సుధీర్‌బాబును మల్టీజోన్-2 ఐజీగా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే, మల్టీజోన్-1ను కూడా అదనంగా సుధీర్‌బాబుకు అప్పగించారు.

పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న డీఐజీ ఎం శ్రీనివాసులును రామగుండం కమిషనర్‌గా నియమించి..



ఇటీవలనే ఇక్కడి కమిషనర్‌గా నియమితులైన డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్ పోస్టింగ్‌ను రద్దు చేసి తిరిగి ఆయనను జోగులాంబ గద్వాల్ జోన్-7 డీఐజీగా నియమించారు. గతంలో జోగులాంబ డీఐజీగా పోస్టింగ్ పొందిన జోయెల్ డేవిస్‌ను ఆ పోస్టు నుంచి మార్చి సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఈ పోస్టులో ఉన్న జాయింట్ పోలీస్ కమిషనర్ కె. నారాయణ్ నాయక్‌ను సీఐడీ ఎస్సీఆర్బీగా ట్రాన్స్‌ఫర్ చేశారు. రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ఎస్పీ కె. అపూర్వ రావును టీఎస్ఆర్టీసీ విజిలెన్స్ ఎస్పీగా, టీఎస్ ట్రాన్స్‌కో ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డిని నగర సౌత్ వెస్ట్ జోన్ డీసీపీగా, రాచకొండ ఎస్ఓటీ డీసీపీ ఆర్.గిరిధర్‌ను నగర తూర్పు మండలం డీసీపీగా నియమించారు. పోస్ట్ ...15లో

కార్పొరేట్ శక్తుల కోసమే సాగు నల్ల చట్టాలు

రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సాగర్, వెంకట్రాములు

- 16న గ్రామీణబంద్ కరపత్రాల పంపిణీ

నవతెలంగాణ- యాచారం

ర్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం కావ్యవసాయ నల్ల చట్టాలను తీసుకొచ్చిందని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు అన్నారు. 16న గ్రామీణ భారత్ బంద్‌పై రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మాల్, తమ్మలోనిగూడ గ్రామాల్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు



అప్పజెప్పే ప్రయత్నం చేసిందన్నారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో 12 నెలలపాటు రైతాంగం పెద్దఎత్తున ఉద్యమాలు చేసిందని గుర్తు చేశారు. ఉద్యమంలో 600 మంది చనిపోయారని, దీంతో కేంద్ర ప్రభుత్వం చట్టాలను తాత్కాలికంగా ...15లో

అడుగడుగునా నిర్బంధం

ఎక్కడ చూసినా యుద్ధ వాతావరణం

- పలు రాష్ట్రాల నుండి 'ఢిల్లీ ఛలో'కు అన్నదాతలు
- అరెస్టులతో అడ్డుకుంటున్న పోలీసులు
- సరిహద్దుల మూసివేత
- రాజధానిలో నెల రోజుల పాటు సెక్షన్ 144 విధింపు

న్యూఢిల్లీ : డిమాండ్ల సాధన కోసం అన్నదాతలు చేపట్టిన 'ఢిల్లీ ఛలో' కార్యక్రమానికి అడుగడుగునా ఆంక్షలు ఎదురవుతున్నాయి. ఎక్కడ చూసినా రైతన్నలపై నిర్బంధాలు కొనసాగుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే అనేక ప్రాంతాల్లో యుద్ధ వాతావరణం కన్పిస్తోంది. రైతులను ఎలాగైనా అడ్డుకోవాలన్న ఉద్దేశంతో ఢిల్లీ పోలీసులు రాజధానిలో 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించారు. ప్రదర్శనలు, సమావేశాలను ఏకంగా నెల రోజుల పాటు నిషేధించారు. ఈ ఉత్తర్వులు సోమవారం నుండే అమలులోకి వచ్చాయి. మార్చి 12వ తేదీ వరకూ అమలులో ...15లో





అన్నదాతల్ని దేశ శత్రువులుగా భావించొద్దు

- రైతుల ఆందోళనపై నియంతృత్వ విధానాలను విడనాడాలి : ఎస్కేఎం

15లో..

ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు

14 మంది ఈఎస్‌లకు స్థానచలనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా 14 మంది ఎక్సైజ్ సూపరింటెండెంట్లను (ఈఎస్) ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమేరకు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సునిల్ శర్మ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఇద్దరు ఉప కమిషనర్లు, తొమ్మిది మంది సహాయ కమిషనర్లకు స్థాన చలనం కల్పించారు. మల్టిజోన్-1లో 64 మంది, మల్టి జోన్-2 లో 85 మంది సీఐలను బదిలీ చేశారు. 2024 పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సొంత జిల్లాలో పనిచేస్తున్న వారితో పాటు, ఒకే రెవెన్యూ జిల్లాలో మూడేండ్లుగా విధులు నిర్వహిస్తున్న వారిని ఈసీ మార్గ దర్శకాలకు అనుగుణంగా బదిలీ చేసినట్టు పేర్కొన్నారు.

150 మంది జెడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ, డీపీఓల బదిలీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో అధికారుల బదిలీల పరంపర కొనసాగుతున్నది. తాజాగా పంచాయతీరాజ్ శాఖలోని 105 మంది జెడ్పీ సీఈఓలు, డిప్యూటీ సీఈఓలు, డీపీఓలను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు సోమవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సొంత జిల్లాలతో పాటు మూడేండ్ల నుంచి ఒకే చోట పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ బదిలీలు జరిగాయి. ఇప్పటికే రాష్ట్రంలో 395 మంది ఎంపీడీఓలు బదిలీ అయిన విషయం తెలిసిందే.

గవర్నర్ వాకౌట్

తమిళనాడు అసెంబ్లీ నుంచి అర్థంతరంగా బయటకు..

- కేంద్రాన్ని విమర్శించే ప్రసంగం చదవనంటూ వ్యాఖ్యలు
- రాష్ట్ర ప్రభుత్వంతో క్షీణించిన సంబంధాలు



వివరాలు 3లో..

మోడీ 3.0 వెనుక..?

అయోధ్య పూర్తయినా.. హిందూత్వతోనే రాజకీయం

- రానున్న ఎన్నికల్లో బీజేపీ ఎత్తుగడలు
- కాశీ, మథురపై ఆ పార్టీ నేతల 'కీలక' వ్యాఖ్యలు
- మూడోసారి అధికారంలోకి వస్తామని మోడీ విశ్వాసం
- లోక్‌సభలో 370 సీట్లపై గురి
- ఆరెస్సెస్ సిద్ధాంతాల అమలే లక్ష్యం
- రాజకీయ విశ్లేషకుల అంచనా



న్యూఢిల్లీ : యూపీలోని అయోధ్యలో రామ మందిర నిర్మాణ అంశం బీజేపీకి రాజకీయంగా ఎదుగుదలకు దోహదం చేసింది. దేశంలో 1990వ దశకం వరకు ఆ పార్టీ ఉనికి, బలం అంతగా లేదు. అయితే, రామ మందిర నిర్మాణ డిమాండ్‌తో ఆ పార్టీ అగ్రనేత ఎల్.కె అద్వానీ దేశంలో చేపట్టిన రథయాత్ర ఆ పార్టీని రాజకీయంగా బలంగా తయారు చేసింది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా జరిగిన పలు లోక్‌సభ ఎన్నికల్లో వందకు పైగా స్థానాలు, అనేక రాష్ట్రాల్లో ఆ పార్టీకి అధికారాన్ని సాధించేలా చేసింది. 'హిందూత్వ' అనే భావోద్వేగ సిద్ధాంతాన్ని నమ్ముకున్న ఆ పార్టీ ఆ సెంటిమెంట్‌ను పలు ఎన్నికల్లో ...8లో



బల పరీక్ష నెగ్గిన నితీశ్ సర్కార్



పాట్నా : బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం సోమవారం విశ్వాస పరీక్షలో నెగ్గింది. ప్రతిపక్ష మహాఘట్‌బంధన్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. దీంతో విశ్వాస పరీక్ష సమయంలో ప్రతిపక్షం 'అంకెల గారడీ' కి ప్రయత్నిస్తుందంటూ కొన్ని రోజుల నుంచి వెలువడుతున్న ఊహాగానాలు పటాపంచలయ్యాయి.

మెజారిటీ ఓటుతో ప్రభుత్వం నెగ్గిందని జనతాదళ్ (యునైటెడ్) కి చెందిన డిప్యూటీ స్పీకర్ మహేశ్వర్ హజారి సభలో ప్రకటించారు. 243 మంది సభ్యులు గల సభలో మహాఘట్‌బంధన్ సభ్యులందరూ వాకౌట్ చేయడంతో జేడీయూ-బీజేపీ కూటమికి ...15లో

రేవంత్‌రెడ్డితో షర్మిల భేటీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి దంపతులను ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షులు వైఎస్ షర్మిలారెడ్డి కలిశారు.సోమవారం హైదరాబాద్‌లోని రేవంత్ నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు.కొత్తగా పీసీసీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆమె తొలిసారి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు.ఏపీలో రాజకీయ పరిస్థితులు,రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న నీటి సమస్యలు,వచ్చే పార్లమెంటు ఎన్నికలు తదితరాంశాలపై చర్చించినట్టు తెలిసింది.



అవినీతి కంపును కడిగేందుకు ఫినాయిల్ డబ్బా సరిపోదేమో?

- టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ నేతల అవినీతి, అక్రమాల కంపును ఒక ఫినాయిల్ బాటిల్ సరిపోదని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి తెలిపారు. ధరణి సమస్యలపై అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు ఎంత చెప్పినా చెవిటోడి ముందు శంఖం ఊదినట్టు అయిందన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ధరణి ఎత్తేయాలని సూచించారని గుర్తు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు కోదండరెడ్డి, ప్రీతమ్, మెట్టు సాయి కుమార్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతుల సమస్యలు, ఫార్మా సిటీ భూములపై కాంగ్రెస్ పోరాటం చేసిందన్నారు. ధరణిలో అవకతవకలు అన్నీ బయటకు వస్తాయన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాన్ని బయటకు పో..పో అని నోరు మూశారనీ, కానీ సీఎం రేవంత్ మాత్రం ప్రతిపక్షాన్ని అసెంబ్లీకి రా...రా అనడం మంచి పరిణామన్నారు. అధికారం ఇస్తే సభకు వస్తవు...అధికారం ఇవ్వకపోతే అసెంబ్లీ కి రావా? అని ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను ప్రశ్నించారు.

గవర్నర్ రబ్బరు స్టాంపు కాదు

- ఎమ్మెల్సీల కేసులో వాదనలు

నవతెలంగాణ-హైదరాబాద్

క్యాబినెట్ తీసుకునే ప్రతి నిర్ణయానికి గవర్నర్ కట్టుబడి ఉండాలని రాజ్యాంగంలో ఎక్కడా లేదనీ, గవర్నర్‌కు విచక్షణాధికారాలు ఉంటాయని కోదండరామ్, అమీర్ అలీ ఖాన్‌ల లాయర్ సోమవారం హైకోర్టులో వాదించారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను క్యాబినెట్ సిఫార్సు చేస్తే గవర్నర్ తిరస్కరించడాన్ని వారిద్దరూ సవాల్ చేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ విచారించారు. గతేడాది సెప్టెంబర్ 19న గవర్నర్ తిరస్కరణ ఉత్తర్వులు జారీ చేయడాన్ని దాసోజు, సత్యనారాయణ తప్పుపట్టారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(5) ప్రకారం గవర్నర్‌కు ఉన్న విస్తృత అధికారాల మేరకు తిరస్కరిస్తున్నట్టు ప్రకటించడం అన్యాయమన్నారు. ఈ వాదనను కోదండరామ్, అలీఖాన్‌ల తరపు న్యాయవాది వ్యతిరేకించారు. క్యాబినెట్ తిరస్కరించిన తర్వాత మళ్లీ రెండోసారి క్యాబినెట్ సిఫార్సు చేయలేదనీ, కొత్త ప్రభుత్వం కోదండరామ్, అలీఖాన్‌ల పేర్లను సిఫార్సు చేసిందని చెప్పారు. గవర్నర్ రబ్బరు స్టాంప్ కాదనీ, విచక్షణాధికారాలతో రాజ్యాంగ ప్రకారం నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 ప్రకారం గవర్నర్ తీసుకున్న చర్యను ఎవరూ కోర్టుల్లో సవాల్ చేసేందుకు వీల్లేదన్నారు. పిటిషనర్ల వాదనల నిమిత్తం విచారణ ఈ నెల 14కి వాయిదా పడింది.

ఆరెస్బీ

చెరువు మీద అలిగి..!



తన ప్రియ శిష్యుడైన వెంకటేశం సీరియస్‌గా ఏదో ఆలోచనలో ఉండే సరికి గిరీశానికి ఒకింత ఆశ్చర్యంతో పాటు ఆనందం కూడా కలిగింది. వాడి ఆలోచనకి కారణం ఏమైయుంటుంది చెప్మా అనుకుంటూ...

గిరీశం : "ఏమ్ వాయ్, మైడియర్ షేక్స్‌పియర్ ! " వాక్యం పూర్తి కాకుండానే

వెంకటేశం : " మీరసలు నాతో మాట్లాడకండి! " అని కఠినంగా అనే సరికి

గిరీశం : (మనసులో) వీడి తండ్రి ఏమైనా కఱ్ఱ పట్టుకుని చమ్డా లెక్కగొట్టాడా? అనుకున్నాడు. అయినా ఇప్పుడు పరీక్ష లేమీ లేవు కదా! అపుడెప్పుడో ఫెయిల్ అయిన దాన్ని ఇప్పుడెవరైనా మోసుంటారా? ఆలోచించగా దానికి దాదాపు నో చాన్స్! ముప్పుట్లా దొరుకుతున్న తిండికీ, ఠికాణాకు ఏమైనా ఎసరొస్తుందేమోనని గిరీశం గుండె వేగంగా కొట్టుకుంది. ఆ దాన్తో పాటు మళ్ళీ ఆ పూటకూళ్ళ దాని దగ్గరికి పోవాల్సి వస్తుందేమో నన్న భయమూ పట్టుకుంది. కొంపదీసి వాడక్కకి గాలం వేస్తున్నాన్న సంగతేమైనా పసిగట్టాడా అనే డౌటొచ్చినా వాడికంత నాలెడ్జీ ఎక్కడుందిలే అని తనకి తానే సమాధానం చెప్పుకున్నాడు ఈ లోపు వెంకటేశం ప్రశ్నతో ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు.

వెంకటేశం : " పాజిటీవ్ అభొరెన్స్ " అంటే ఏమిటండీ?

గిరీశం : అదెవరు చెప్పారోయ్ ? సడెన్‌గా ఆ మాటకర్థం అడుగుతున్నావ్? (మనసులో) తాను బుచ్చెమ్మ వంటి యంగ్, ఇన్నోసెంట్, అన్‌ఫార్చ్యునేట్, వర్జిన్, విడోని చూసిన తర్వాత టౌన్ లౌసూ, డాన్సింగ్ గరల్సూ మీదా, చివరికి తనని 'యాస్'ని చేసిన మధురవాణి పై కూడా " పాజిటివ్ అభొరెన్స్" వచ్చిందని అనుకుంటూండగానే వీడొచ్చి ఆ ప్రశ్న అడిగే సరికి) నీకెవరైనా టెలిపతి నేర్పారా? అని అడిగాడు.

వెంకటేశం : టెలిపతీ లేదు! నా పిండాకూడూ లేదూ! ముందు ఆ మాటకర్థం చెప్పండి బాబూ!

గిరీశం : "అసహ్యించుకోవడం. పూర్తి స్థాయిలో అసహ్యించుకోవడం " అన్నాడు.

వెంకటేశం : హమ్మయ్య ! ఇప్పుడింకో వివరణ ఇవ్వండి. కెసిఆర్ దేన్ని బాగా అసహ్యించుకుంటున్నాడు? రేవంత్ రెడ్డినా? శాసన సభనా? ఇప్పటికి జరిగిన రెండు శాసనసభ సమావేశాలకు హాజరు కాకపోయినా,తనకు చిన్న రూము కేటాయించారనా? ఆయన " పాజిటివ్ అభొరెన్స్" దేనిపైనండీ?

గిరీశం : ఏమ్ వాయ్ ! నిన్ను సురేంద్రనాథ్ బెనర్జీ చెయ్యాలనుకుంటే భగత్‌సింగ్‌లా దేవుడి ఉనికినే ప్రశ్నిస్తున్నావ్? అయినా నువ్వడిగావు కాబట్టి చెప్తున్నాను విను. అయినా, ఇంతకు ముందొకసారి చెప్పినట్టున్నా, ఆ చేగోడీల గోల్లో పడి మరిచి పోయినట్టున్నావ్. చాలా కాలం నుండి జనం తెలంగాణ కోసం ఉద్యమించినా, చివర్లో డ్రైవింగ్ సీట్‌లో నుండి మన తాజా మాజీ గారే దిగారు. బండి చక్రం మీద కూచున్న ఈగలా తానే ఆ బండిని నడిపాననుకుంటే ఎలా అనేదే ప్రశ్న. సిద్ధాంతం ఏమీ లేక పోయినా సెంటిమెంటు చుట్టూ పోగేసిన జనంతో నెట్టుకొచ్చాడు పదేళ్ళు. ఆంధ్రజనమందర్నీ కలిపి నానా తిట్లూ తిట్టిన వ్యక్తి ఇపుడు ఆంధ్రాలో భారత రాష్ట్ర సమితి బ్రాంచాఫీసు ఓపెన్ అన్నాడు. ఆంధ్రా నుండి అదానప్రధానాలు ప్రారంభమయ్యాయి. మూడోసారి ముఖ్యమంత్రి అయితే వాడుకునేందుకు ల్యాండ్ క్రూయిజ్ కార్లు కొని విజయవాడ ఆటోనగర్‌లో భద్రపరిచిన సంగతి విని రాష్ట్రం నోరెళ్ల పెట్టింది. అధికారం బెల్లమ్ముక్క. దాని చుట్టూ మూగిన ఈగలు అధికారం అటు మారేసరికీ ఆ ఈగలూ అటుదిక్కుకే పోయాయి. 'సీజన్' మారే సరికి వలస పక్షులూ ఎవరి గూటికి వారు చేరుకుంటున్నారు. కేసీఆర్ పేరు చెబితే తెలంగాణలో గడ్డిపోచైనా గెలిచి తీరుతుందన్న భరోసా కామారెడ్డిలో అధినేతే ఓడిన తర్వాతనైనా వాస్తవ జగత్తులోకి రావాలి కదా! తాను సీయెమ్మ్‌గా, 'రాజు వెడలెరవితేజములలరగ, కుడి ఎడమల డాల్‌కత్తులు మెరవగ' అంటూ వంధిమాగధులు తన భజన చేస్తూండగా, తానొక్కడే తెలంగాణలో సింహాసనానికి అర్హుడన్నట్లు ప్రవర్తిస్తే ఎలా అనేదే ప్రశ్న.



వెంకటేశం : ఇప్పటికి రెండు సెషన్స్ నుండీ సభకే రాని వ్యక్తికి "పాజిటివ్ అభొరెన్స్" దేనిపైనండీ? చిన్న రూమ్ కేటాయించారనా? 'తెల్ల కాగితా'ల్తో కొడ్తున్నారనా? కనీసం లెజిస్లేటివ్ పార్టీ సమావేశం కూడా జరపకుండానే అప్పటికి ఆసుపత్రి బెడ్ మీదున్న అధినేతనే తమ నేతగా "ఎన్నుకుని" పాదుకా పట్టాభిషేకం చేసినా ఇల్లు సర్దుకోలేకపోతున్నాననా? పార్లమెంటు ఎన్నికల ముందు ఇదే ఆఖరి సమావేశమని తెల్సినా సభకి రాకపోవడానికి కారణమేమిటి? ఆయన 'అభొరెన్స్ ' దేనిపైనండీ!?

గిరీశం : చివరాఖరికి నాకు కన్పడే సత్యమేమిటంటే జనం ఆ పార్టీని గెలిపించలేదని!

వెంకటేశం : చెరువు మీద కోపంతో... దేన్నో ఎండబెట్టుకుంటున్నట్టా?

కృష్ణా జలాలపై లాభం కలిగేలా చర్చ ఉండాలి : కడియం శ్రీహరి

కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగేలా కాకుండా లాభం చేకూరేలా అసెంబ్లీలో చర్చ జరగాలని బీఆర్‌ఎస్ సభ్యులు కడియం శ్రీహరి సూచించారు. కృష్ణాజలాలపై చర్చ సందర్భంగా ఆయన సోమవారం అసెంబ్లీలో మాట్లాడారు. తమ నాయకుడు సభకు రాలేదని పదేపదే అనటం సరిగాదన్నారు. తాము మాట్లాడుతున్నదంతా బీఆర్‌ఎస్ పార్టీ తరపుననే అని స్పష్టం చేశారు. 'ఏ ఊకోవయ్యా..ఎందుకొర్లుతున్నవ్..నీవు హోం మినిష్టర్ అయ్యేది లేదు..చచ్చేది లేదు' అంటూ మధ్యలో జోక్యం చేసుకున్న రాజగోపాల్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నామని తెలిపారు. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌పై పలు సూచనలు చేస్తామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టీఎంసీలను రెండు రాష్ట్రాల మధ్య విభజించటానికి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు అప్పగించిన విషయాన్ని గుర్తుచేశారు. త్వరలో మన ప్రభుత్వ వాదనలను వినే అవకాశముందని చెప్పారు. ట్రిబ్యునల్ అవార్డు ఉండగానే రాష్ట్రాలు కొత్తగా ప్రాజెక్టులు కట్టుకుంటాయనీ, నిర్మాణంలో ఉన్న, అనుమతి ఉన్న, అనుమతిలేని ప్రాజెక్టులకు క్లయిమ్ చేసుకునే అవకాశం ఉంటుందని గుర్తుచేశారు. ట్రిబ్యునల్ ముందు మన వాదనలను పెట్టాలనీ, ఎక్కువ వాటా కోసం పట్టుబట్టాలని సూచించారు. రెండు రాష్ట్రాల పంచాయతీని అడ్డం పెట్టుకుని కేంద్రం పెత్తనాన్ని తన గుప్పిట్లోకి తీసుకోవడానికి బోర్డులను ఏర్పాటు చేసిందన్నారు. త్వరగా బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పును ఇవ్వాలనీ, నీళ్ల కేటాయింపులు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

సార్..ఆ రెండ్రోజులు అసెంబ్లీ పెట్టొద్దు : మల్లారెడ్డి

'నాదేం లేదు సార్. ఒకటే నిమిషం సార్. సార్ సార్ ఒకటే సెకండ్. అధ్యక్షునికి విన్నపం చేస్తున్నా. ఈ నెల 14, 15 తేదీల్లో వసంత పంచమి ఉంది. ఆ రోజు 26 వేల పెండ్లీండ్లు ఉన్నాయి. దయచేసి ఆ రెండ్రోజులు అసెంబ్లీ పెట్టొద్దు సార్. ఇంతేసార్' అని బీఆర్‌ఎస్ సభ్యులు చామకూర మల్లారెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు విన్నవించారు.

గవర్నర్ వాకౌట్

చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, గవర్నర్ ఆర్.ఎన్.రవి మధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. సోమవారం అసెంబ్లీ సమావేశాల నుండి గవర్నర్ రవి అర్థంతరంగా లేని వెళ్లిపోయారు. కేంద్రాన్ని విమర్శించేలా తమిళనాడు ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగాన్ని చదివేందుకు ఆయన తిరస్కరించారు. మధ్యలోనే ప్రసంగాన్ని ఆపివేసి, జాతీయ గీతాన్ని ఆలపించేవరకు కూడా వేచి చూడకుండానే సభ నుండి వెళ్ళిపోయారు.

2024 సంవత్సరానికి అసెంబ్లీ సమావేశాల ప్రారంభోత్సవ ప్రసంగం చేయడం తన గౌరవంగా భావిస్తున్నానని తొలుత వ్యాఖ్యానిస్తూ కేవలం నాలుగు నిమిషాల పాటు మాత్రమే ఆయన మాట్లాడారు. తనను చదవమని డీఎంకే ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగంలో కొన్ని పేరాలతో తాను ఏకీభవించలేనని, వాస్తవిక, నైతిక ప్రాతిపదికన వాటితో విభేదిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. అటువంటి ప్రసంగాన్ని తాను చదివినట్లైతే రాజ్యాంగాన్ని అపహాస్యం చేసినట్లవుతుందన్నారు. అందువల్లే ఈ సభా గౌరవాన్ని దృష్టిలో వుంచుకుని తాను ప్రసంగాన్ని ముగిస్తున్నానని చెప్పారు. ప్రజల ప్రయోజనాల కోసం, వారి మంచి కోసం ఈ సభలో ఆరోగ్యకరమైన చర్చ జరగాలని కోరుకుంటున్నా అంటూ ఆయన సెలవు తీసుకున్నారు.

సభా ప్రారంభానికి ముందుగా, తర్వాత జాతీయ గీతాన్ని ఆలపించాలని తాను చేసిన అభ్యర్థనను అసెంబ్లీ పదే పదే నిర్లక్ష్యం చేస్తోందని గవర్నర్ పేర్కొన్నారు. జాతీయ గీతానికి తగిన గౌరవం ఇవ్వాలని కోరారు. తమిళ భాషను ప్రశంసిస్తున్న గీతాన్ని సభా ప్రారంభానికి ముందుగా ఆలపించడం, సమావేశాల ముగింపులో జాతీయ గీతాన్ని ఆలపించడం తమిళనాడులో సంప్రదాయంగా వస్తోంది.

గవర్నర్ వెళ్లిపోవడంతో ఆ తర్వాత ఆ ప్రసంగాన్ని స్పీకర్ ఎం.అప్పవు చదివి వినిపించారు. బీజేపీ ఎంఎల్‌ఎలతో సహా పాలక, ప్రతిపక్ష సభ్యులందరూ సమావేశం ముగిసేవరకు సభలోనే వున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్ల కేంద్రం అనుసరిస్తున్న విధానాలు, చర్యలను విమర్శిస్తూ ఆ ప్రసంగం సాగింది. జీఎస్టీ, చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయకపోవడం వంటి అంశాలను ప్రస్తావించింది.

పైగా తమిళనాడు పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) అమలు చేసేందుకు అనుమతించేది లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. దీనివల్ల భిన్నత్వంలో ఏకత్వం అన్న ఉద్దేశ్యానికే తీవ్రమైన ముప్పు ఏర్పడుతుందని వ్యాఖ్యానించింది. గతేడాది బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో కూడా గవర్నర్ రవి కొన్ని పేరాలను వదిలేసి చదివారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితులు, ద్రవిడ తరహా పాలన, అంబేద్కర్, ద్రవిడ నేతలు గురించి వున్న భాగాలను ఆయన వదిలేశారు. ఈ వైఖరిని ఆనాడు స్టాలిన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది.

కేంద్రంపై విమర్శల హోరు !

48పేజీల ఈ ప్రసంగంలో, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో తమిళనాడు సాధించిన విజయాలతో పాటూ రాష్ట్రం పట్ల కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని కూడా సవివరంగా పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో తమిళనాడులో సంభవించిన తీవ్రమైన వరదల వల్ల కలిగిన నష్టాన్ని ఎదుర్కొనేందుకు మరిన్ని నిధులు అవసరంగా వుందని కూడా ప్రభుత్వం పేర్కొంది.

రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆర్థిక స్వయంప్రతిపత్తిని కూడా వదులుకుని, జీఎస్టీని అమలు చేయడానికి అంగీకరించాయని, రాష్ట్రాలకు తగిన నష్టపరిహారం అందుతుందని, చట్టబద్ధంగా తమకు రావాల్సిన రెవిన్యూ వస్తుందని ఆశించాయని, కానీ అలా జరగలేదని, కేంద్రం 2022 జూన్‌లో నష్టపరిహార నిబంధనలను రద్దు చేసిందని, దాంతో రాష్ట్రం ఏటా రూ.20వేల కోట్ల రెవిన్యూ లోటును ఎదుర్కొంటోందని ఆ ప్రసంగం పేర్కొంది. ఇకపై నష్టపరిహారం ఇచ్చేలా నిబంధనలు తిరిగి కొనసాగించాలని కేంద్రాన్ని కోరుతున్నామని ఆ ప్రసంగం పేర్కొంది.

చెన్నైన మెట్రో రైలు ప్రాజెక్టుకు కూడా సమానంగా ఖర్చు భరిస్తామని తొలుత ఇచ్చిన హామీ నుంచి కేంద్రం వెనక్కి మళ్ళిందని, దాంతో రెండేండ్లకు పైగా ఈ ప్రాజెక్టులో జాప్యం జరుగుతోందని విమర్శించింది. ఇటువంటి ప్రాజెక్టులకు ఇతర రాష్ట్రాల్లో అనుమతులు మంజూరు చేస్తున్నారని ఇక్కడ కూడా పూర్వం అనుకున్న రీతిలో పరిస్థితులను పునరుద్ధరించాలని కోరింది.

రాష్ట్రంలో మత సామరస్యతను పరిరక్షించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని, దానికే కట్టుబడి వున్నామని తమిళనాడు ప్రభుత్వం స్పష్టం చేసింది. సీఏఏను అమలు చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. 2021 నుంచి ఆలస్యమవుతూ వస్తున్న జాతీయ జన గణనతో పాటూ కుల గణన కూడా చేపట్టాల్సిందిగా ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేశారు.

సీపీఎస్‌తో ఇబ్బందులు పడుతున్నారు..

- శాసన మండలిలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీపీఎస్ విధానంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. సోమవారం శాసన మండలిలో ప్రత్యేక ప్రస్తావన సమయంలో ఈ విషయాన్ని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఉద్యోగుల జీతాలు కూడా సకాలంలో అందరికీ వచ్చేలా చూడాలన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పది జిల్లాలను 33 జిల్లాలు చేయటంతో ఉద్యోగుల, ఉపాధ్యాయుల బదిలీల సమస్య అపరిష్కృతంగా ఉందని తెలిపారు. ఎక్కువ జిల్లాల్లో భార్యాభర్తల బదిలీలు సర్దుబాటు కాలేదని చెప్పారు. వీటిపై మంత్రి దామోదర రాజనర్సింహ సమాధానమిస్తూ సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని సమాధానమిచ్చారు.

పోరుసభకు పోతందుకు కాలునొప్పి లేదా?

- బీఆర్‌ఎస్‌ఎల్పీ నేత కేసీఆర్‌కు కాంగ్రెస్ సభ్యులు రాజగోపాల్‌రెడ్డి ప్రశ్న

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నల్లగొండలో మంగళవారం జరిగే పోరుసభకు పోతందుకు కాలునొప్పి లేదా? ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించే అసెంబ్లీకి రావడానికి మాత్రం కాలునొప్పి వచ్చిందా? అని బీఆర్‌ఎస్‌ఎల్పీ నేత కేసీఆర్‌ను కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. కృష్ణా జలాలు, కేఆర్‌ఎంబీ అంశాలపై సోమవారం అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఎంతసేపు ముఖ్య మంత్రి సీటే కావాలా? అధికారం లేకుంటే సభకు రారా? ఇటువైపున్న సీటులో కూర్చోరా? ప్రజాస్వామ్యయుతంగా ప్రజలు అప్పగించిన ప్రతిపక్ష పార్టీ బాధ్యతను ఎందుకు నెరవేర్చడం లేదు? ప్రజాసమస్యలపై చర్చించడానికి తీరికలేకపోతే ఆ పదవి ఎందుకు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. కారు షెడ్డుకుకాదు..గ్యారేజీకి పోయిందని ఎద్దేవా చేశారు. తాము చెప్పే మాటలనుమ బీఆర్‌ఎస్ సభ్యులు వింటే ప్రజలు క్షమిస్తారనీ, లేకుంటే ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వరని హెచ్చరించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చాలా కష్టపడుతారనీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ఇరిగేషన్ మంత్రిగా ఉన్నా.. ఆయన మామ కేసీఆర్ నిర్ణయాలకు తలొగ్గి పనిచేశారని అన్నారు. ఇప్పటికే కేసీఆర్‌ను నమ్ముకుని తెలంగాణ ఆగమైందనీ, ఆయన్ను నమ్ముకున్న హరీశ్‌రావు కండ్లు తెరిచి తమ ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. నల్లగొండ పోరు బహిరంగ సభకు వెళ్లొద్దని ఆయన్ను కోరారు. తమ ప్రభుత్వం తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టులకు తొలిప్రాధాన్యం ఇస్తోందనీ, ప్రజాధనం దుర్వినియోగం చేయబోమని స్పష్టం చేశారు. ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రాన్ని ఇప్పుడు గాడిన పెట్టాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. పదేండ్లలో తీసుకురాలేని సీడబ్ల్యూసీ అనుమతులను తాము ఆరు నెలల్లో తీసుకొచ్చి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తామని నొక్కిచెప్పారు. పదేండ్ల కాలంలో 10 కిలోమీటర్ల శ్రీశైలం సొరంగ మార్గానికి రూ.2 వేల కోట్లు కేటాయిస్తే 5 లక్షల ఎకరాల భూమి సాగయ్యేదన్నారు. ఉదయసముద్రం పూర్తి చేస్తే మరో లక్ష ఎకరాలు సాగయ్యేదని తెలిపారు. వీటిపై గొంతుపోయేదాకా అరిచినా గత ప్రభుత్వం చెవికెక్కలేదని విమర్శించారు.

ఏపీ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ కడుతుంటే...

- పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు కట్టలేదు? : మంత్రి జూపల్లి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అనుమతుల్లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా నదిపై రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు కడుతుంటే..బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇక్కడ పాలమూరు రంగారెడ్డి పథకాన్ని ఎందుకు కట్టలేదని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. కృష్ణా జలాలు, కేఆర్‌ఎంబీ అంశాలపై సోమవారం అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ఎంత హక్కుందో తెలంగాణకూ అంతే హక్కు ఉంటుందనీ, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ప్రకారం నీటికి ఎందుకు వాడుకోలేకపోయామో చెప్పాలని నిలదీశారు. నీటి వాటాపై గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏపీ సర్కార్‌తో ఎందుకు రాజీ పడిందో చెప్పాలన్నారు. హరీశ్‌రావు మాట్లాడిన తీరు 'ఆపరేషన్ సక్సెస్ పేషెంట్ డెడ్' అన్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు.

హుక్కా పార్లర్లపై ఉక్కుపాదం

- శాసనసభ, శాసన మండలిలో నిషేదిస్తూ బిల్లు
- ఏకగ్రీవంగా ఆమోదించిన ఉభయ సభలు

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో హుక్కా పార్లర్లపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపా దం మోపనుంది.ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల సవరణ బిల్లు -2024 ను శాసనసభ, శాసనమండలిలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తరపున శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఉభయ సభల్లో ఈ బిల్లును ప్రవేశ పెట్టారు. ఉభయ సభలు ఆ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. . ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాట్లాడుతూ సిగిరెట్ కంటే హుక్కా పొగ మరింత హానికరమని ఆందోళన వ్యక్తం చేశారు. దీని తయారీలో బొగ్గును ఉపయోగించటం వల్ల కార్బన్‌మోనాక్సైడ్ విడుదలవుతుంద ని తెలిపారు. హుక్కాను సేవించే వారి వల్ల చుట్టుపక్కల వారికి కూడా ప్రమాదం ఏర్పడుతుందని వివరించారు. విద్యార్థులు, యువత దీని బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సిగరెట్‌తో పోలిస్తే ఇది వంద రెట్లు ప్రమాదకరమని చెప్పారు. ఈ బిల్లుపై సభ్యులు వాణిదేవి, మహేశ్‌కుమార్‌గౌడ్, అలుగుబెల్లి నర్సిరెడ్డి, కల్వకుంట్ల కవిత, జీవన్‌రెడ్డి, భానుప్రకాశ్, తాతా మధు మాట్లాడుతూ యువతను పెడదారి పట్టిస్తున్న ఈ మహమ్మారి పట్ల కఠినంగా ఉండాలని సూచించారు. బిల్లు తేవటంతోనే సరిపెట్టొద్దనీ, దాని అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. కిరాణ షాపుల్లో నిత్యావసర సరుకులతోపా టు మత్తుపదార్థాలు కూడా దొరుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై తగిన విధంగా నిఘా పెట్టాలని కోరారు. పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలనీ, ప్రకటనల ద్వారా ప్రచారం నిర్వహించాలని సూచించారు. బిల్లు తీసుకొచ్చినందుకు ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. శాసనసభ, శాసన మండలి దీనికి ఏకగ్రీవ ఆమోదం తెలిపాయి.

ప్రజలను మోసం చేసి..మొఖం చాటేశారు

- కేసీఆర్ నల్లగొండలో సభ పెట్టడం సిగ్గుచేటు
- ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల దోపిడీ
- అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ప్రజలను తొమ్మిదేండ్లు మోసం చేసి, చేతగాని దద్దమ్మ మాదిరి అసెంబ్లీకి రాకుండా మొఖం చాటేసిన నీవు.. నేడు నల్లగొండలో సభ పెట్టడం సిగ్గుచేటు అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాజీ సీఎం కేసీఆర్‌నుద్దేశించి విమర్శించారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కాంగ్రెస్ పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు బీఆర్‌ఎస్ సాగునీటి విషయంలో మోసం చేసిందని, పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేయలేదన్నారు. రావాల్సిన నీళ్ల రాకుండా చేశారని, అందుకే వికారాబాద్ జిల్లాలో నాలుగు సీట్లలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు మాట్లాడుతూ.. గ్రావిటీతో



వెళ్ళే నీటిని ఉల్టా చేసి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని, మురళీధర్‌రావును అడ్డం పెట్టుకొని కోట్లు దండుకున్నారని ఆరోపించారు. డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ మాట్లాడుతూ.. రాజకీయ ప్రయోజనాల కోసం కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెట్టారని, కేసీఆర్‌కు ధైర్యముంటే చట్టసభకు వచ్చి మాట్లాడాలని అన్నారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అప్పుల గుదిబండగా మార్చిన ప్రాజెక్టు కాళేశ్వరం అన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీకి రాకుండా కేసీఆర్ మొఖం చాటేసి.. వారి పార్టీ ఎమ్మెల్యేలతో మాట్లాడిస్తున్నారని విమర్శించారు. ఏడు లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసి.. ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితికి రాష్ట్రాన్ని తెచ్చారన్నారు. నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలను ఎడారి చేసిన కేసీఆర్.. ముందు ముక్కు నేలకు రాసి నల్లగొండ సభకు బయలుదేరాలన్నారు. మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, ఏ.లక్ష్మణ్ కుమార్, సంజీవ రెడ్డి, రాందాస్ నాయక్ ఉన్నారు.

'మాజీ'ల మృతికి శాసనసభ, మండలి సంతాపం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఇటీవల మరణించిన మాజీ ఎమ్మెల్యేలకు శాసనసభ, శాసనమండలి తీవ్ర సంతాపం ప్రకటించాయి. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూ తి తెలిపాయి. సోమవారం శాసనసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలిలో చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వారి మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఉమ్మడి హైదరాబాద్ జిల్లా కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే బి మచ్చీందర్‌రావు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ మాజీ ఎమ్మెల్యే పి. నర్సారెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ సందర్భంగా వారి సేవలను గుర్తు చేసుకున్న సభ్యులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించి,సంతాపాన్ని తెలిపారు.

దేశంలో ఉద్యోగాలు లేవు

ప్రజల జేబులు కొల్లగొడుతున్నారు : కేంద్రంపై రాహుల్ మండిపాటు



కార్బా (ఛత్తీస్‌గఢ్) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. దేశంలోని యువతకు ఉద్యోగాలు లేవని, ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా ఆయన సోమవారం ఛత్తీస్‌గఢ్‌లోని కార్బాలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించి వారి జేబులు కొల్లగొడుతోందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ కుటిల యత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

దేశ జనాభాలో వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనులు 74% మేర ఉన్నారని అంటూ భారత్‌లో అగ్రస్థానంలో ఉన్న 200 కంపెనీల్లో ఏ ఒక్కటీ వారి యాజమాన్యం కింద లేదని రాహుల్ గుర్తు చేశారు. కానీ దేశంలోని సొమ్మునంతటినీ ఆ కంపెనీలకే ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. దేశాన్ని హిందూ రాష్ట్రమని బీజేపీ పిలుస్తోందని, అయితే జనాభాలో 74% మందికి మాత్రం ఏమీ దక్కడం లేదని చెప్పారు. వారు కేవలం స్టీలు ప్లేట్లు కడగడానికి, గంట కొట్టడానికి, మొబైల్ ఫోన్లు చూపించడానికి, ఆకలితో అలమటించి చనిపోవడానికి మాత్రమే పరిమితమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితికి కేంద్రమే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'నాకు చెప్పండి. గత నెలలో జరిగిన రామమందిర ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో మీరు పేదలు, కార్మికులు, నిరుద్యోగులు లేదా చిన్న చిన్న వ్యాపారులను చూశారా? నేను అదానీ, అంబానీ, అమితాబ్ బచ్చన్, ఐశ్వర్యారాయ్, బడా వ్యాపారవేత్తలను మాత్రమే చూశాను. అదానీ, అంబానీ, వారి కుటుంబాలు పెద్ద పెద్ద ప్రకటనలు ఇస్తున్నారు' అని రాహుల్ ఎద్దేవా చేశారు. ప్రజలు ఉపాధి లేక ద్రవ్యోల్బణంలో విలవిలలాడుతుంటే అదానీ, అంబానీ చైనా వస్తువులను అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. దీనిని 'ఆర్థిక అన్యాయం'గా రాహుల్ అభివర్ణించారు.

కాగా ఉత్తరప్రదేశ్‌లో జోడో యాత్రను కుదించాలని రాహుల్ నిర్ణయించారు. ముందుగా అనుకున్న ప్రకారం ఆయన పశ్చిమ ప్రాంతంలో పర్యటించడం లేదు. 10, 12 తరగతుల విద్యార్థులకు బోర్డు పరీక్షల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని కాంగ్రెస్ నేత ఒకరు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 16 రాహుల్ యాత్ర ఉత్తరప్రదేశ్‌లో ప్రవేశించి, 26వ తేదీ వరకూ కొనసాగాల్సి ఉంది. ఆ తర్వాత యాత్ర రాజస్థాన్‌లో ప్రవేశిస్తుంది. అయితే తాజా నిర్ణయంతో ఐదు రోజుల ముందుగానే అంటే 21వ తేదీతో రాహుల్ యూపీలో తన యాత్రను ముగించుకొని మధ్యప్రదేశ్‌లో అడుగు పెడతారు.

ఎన్నికల బాండ్లపై సుప్రీం తీర్పు ఎప్పుడో...!?

నవంబర్ 2న రిజర్వ్ చేసిన కోర్టు

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు కోసం దేశ ప్రజలందరూ ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఎన్నికల బాండ్ల పథకం-2018లోని క్లాజ్ 8 ప్రకారం బాండ్లను జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో విడుదల చేయవచ్చు. ఇవి నిర్దేశిత బ్యాంక్ ఎస్‌బీఐ వద్ద పది రోజుల పాటు అందుబాటులో ఉంటాయి. ఒకవేళ సార్వత్రిక ఎన్నికలు వస్తే అదనంగా 30 రోజుల సమయం ఇవ్వవచ్చు. ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వం ఈ అదనపు సమయాన్ని ఉపయోగించుకునే అవకాశం ఉంది. అయితే ఎన్నికల బాండ్లను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించాల్సి ఉంది. గత సంవత్సరం నవంబర్ 2న న్యాయస్థానం విచారణను పూర్తి చేసి తీర్పును రిజర్వ్ చేసింది.

గత సంవత్సరం సెప్టెంబర్ 30వ తేదీ తర్వాత ఎన్నికల బాండ్లను 35 రోజుల పాటు విక్రయించారు. అక్టోబరులో 10 రోజులు, నవంబరులో 15 రోజులు, ఈ ఏడాది జనవరిలో 10 రోజులు వీటిని అమ్మారు. 2018 మార్చి నుండి గత సంవత్సరం సెప్టెంబరు వరకూ 30 దశలుగా ఎన్నికల బాండ్ల విక్రయం జరిగింది. కోటి రూపాయల విలువ కలిగిన బాండ్లనే ఎక్కువగా విక్రయించారు. ఎన్నికల బాండ్లను రాజకీయ పార్టీలకు విరాళాలు అందించడానికి కొనుగోలు చేస్తారు. అయితే బాగా సంపన్నులు లేదా కార్పొరేట్ సంస్థలే వీటిని కొనుగోలు చేస్తున్నాయి. బాండ్లలో కేవలం 0.0001% మాత్రమే వెయ్యి రూపాయల విలువ కలిగినవి. అమ్ముడైన బాండ్లలో 57% అధికారంలో ఉన్న పార్టీకే సొంతమయ్యాయి. అంటే ఇవి పాలక పక్షానికే ఎక్కువ ఉపయోగపడతాయని అర్థమవుతోంది.

ఈ నెల 5న కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ ఎస్‌బీఐ నుండి రూ.16,518 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేశారని తెలిపారు. ప్రభుత్వం రూ.8.57 కోట్లను ఎస్‌బీఐకి కమిషన్‌గా చెల్లించిందని చెప్పారు. బాండ్ల ముద్రణ



కోసం సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్‌కు రూ.1.90 కోట్లు చెల్లించారు. ఈ ఖర్చును దేశ పౌరులే భరించాల్సి ఉంటుంది. అంతేకాక బాండ్లపై 18% జీఎస్టీ విధించారు. అయితే దీనిని ఎస్‌బీఐకి ప్రభుత్వం రియంబర్స్ చేసింది. అంటే ఈ భారం కూడా పౌరుల పైనే పడింది.

ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు త్వరితగతిన తీర్పు ఇవ్వని పక్షంలో కేంద్ర ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలకు ముందు మరోసారి దశలవారీగా బాండ్ల జారీని ప్రకటించే అవకాశం ఉంది.

సంపాదకీయం

"వ్యూహ రత్నాలు"



దేశం కోసం వివిధ రంగాల్లో విశేష సేవలందించిన విశిష్ట వ్యక్తుల గౌరవార్థం ఇచ్చే సర్వోన్నత పురస్కారం "భారతరత్న" సైతం రాజకీయాధికారానికి సోపానాలుగా మారిపోతుండటం అవాంఛనీయం. ఈసారి "భారత రత్న"ల ప్రకటనలో ఎక్కువగా ఆ వాసనలే ఉండటం ఆక్షేపణీయం. వీటిలోకి రాజకీయాలు చొరబడి చాలాకాలమే అయింది. కాకపోతే "కమలాలు" అధికారంలోకొచ్చాక "రత్నాలు" వన్నె మరింత తగ్గుతోంది.

ఈ ఏడాది ఒకేసారి అయిదుగురికి భారతరత్న ప్రకటించడంలో మోడీ ఓ పద్ధతిని కూడా అనుసరించారు. అందరి కన్నా ముందు ఇతర వెనుకబడిన కులాల వారికి 26 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన కర్పూరీ ఠాకూర్‌పేరును ప్రకటించారు. తద్వారా బీసీల, జాట్ల ఓట్లు దండుకునే ప్రయోజనాన్ని ఆశించారు. ఇది బీజేపీ 'మండల్' రాజకీయాలలో భాగమే. ఆ తర్వాత బీజేపీ అగ్రనేత, రామమందిర ఉద్యమం, రథయాత్ర ద్వారా బీజేపీ క్రమంగా అధికారంలోకి రావడానికి బాటలు వేసిన అద్వానీకి ప్రకటించారు. 'భూమి పూజకో, ప్రాణప్రతిష్ఠకో పనికిరాని 'పెద్ద మనిషిని' రత్నంతో సరిపుచ్చారు. వారం గడవక ముందే మాజీ ప్రధాన మంత్రులు పీవీ.నరసింహారావు, చౌదరి చరణ్‌సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్‌లకు కూడా భారత రత్న ప్రకటించారు. తెలంగాణ బిడ్డ పీవీకి గౌరవం ఇచ్చిన పేరుతో తెలుగువారందరినీ, హరితవిప్లవ పితామహుడు స్వామినాథన్, చరణ్‌సింగ్‌ల పేరుతో రైతుల ఓట్లను కొల్లగొట్టడానికే అనేది స్పష్టం.

ప్రతిదీ రాజకీయ కోణంలోనే చూడకూడదన్నది నిజమే గానీ, ఇందులో రాజకీయాలు తప్ప మరో కోణమే కనిపించడంలేదన్నది అంతకన్నా నిజం...! అసలు వీటి ప్రకటనలోనే విచిత్రమైన రాజకీయ పరిణామాలకు దారితీసిన సందర్భాలూ ఉన్నాయి. కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇచ్చిన వెంటనే దాదాపు అదే భావధారకు చెందిన బీహార్ సీఎం నితీశ్ ఆర్జేడీ చేయి వదిలి మరోసారి ఎన్డీఏ గూటికి చేరారు. చౌదరీ చరణ్‌సింగ్ రైతు పక్షపాతి కనక ఈ సత్కారం అందజేస్తున్నామని మోడీ చెబుతున్న మాటల వెనుక ఆంతర్యం మాత్రం ఆర్ఎల్‌డీని ఎన్డీఏలోకి లాగేందుకే అనేది స్పష్టం. ఇంతకాలం అఖిలేశ్ యాదవ్‌తో జత కట్టిన జయంత్‌సింగ్ తాతకు భారతరత్న దక్కడమే మహదానందం అన్నట్టు మోడీకి 'జీ హుజూర్' అనేందుకు సిద్ధమనే సంకేతాలిచ్చారు. పీవీకి భారతరత్న ఇవ్వడం ద్వారా అటు తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను, పీవీ శతజయంతిని అధికారికంగా చేసి, ఆయన విగ్రహం పెట్టి, ఆయన బిడ్డను ఎమ్మెల్సీని చేసి రాజకీయ లబ్ధిపొందిన కేసీఆర్ (బీఆర్ఎస్)ను ఇరుకున పెట్టడానికే. సార్వత్రిక ఎన్నికల ముందు ప్రజానీకాన్ని ప్రభావితం చేయడానికి ఉపకరిస్తుంది.

ఎవరికి ఎందుకు భారతరత్న ఇచ్చారో అన్న విషయంలో మోడీ ఎన్ని కబుర్లు చెప్పినా సార్వత్రిక ఎన్నికలలో ఓటమి భయమో లేక "అబ్కీ బార్ 400 పార్" అన్న నినాదం సఫలం కాదనే కించిత్తు అనుమానమో కానీ, టోకున ఇచ్చిన ఈ పురస్కారాల వెనుక ఆయన రాజకీయ ప్రయోజనాలు, ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న లక్ష్యమూ అడుగడుగునా కనిపిస్తున్నాయి. ఏ అంశాన్ని అయినా ఎన్నికల దృష్టిలో చూడగలిగిన చక్షువులు మోడీకి ఉన్నాయి. పనిచేసి జనం మద్దతు సంపాదించడం కన్నా జనాన్ని ఆశ్చర్యచకితుల్ని చేసి ప్రయోజనం పొందడంలో వీరిని మించినవారు ఎవరుంటారు గనక!

రాజకీయ దృక్కోణంతో చూస్తేనే కొన్ని విషయాలు బోధపడతాయి. గతంలోనూ కాంగ్రెస్ అసమ్మతి గ్రూప్ నాయకుడైన గులాంనబీ ఆజాద్‌కు పద్మభూషణ్ ఇచ్చి కాశ్మీర్‌లో కాషాయ ప్రయోజనాలకు అతడినో పావుగా మార్చిన సంగతి తెలిసిందే. బాబ్రీ విధ్వంసానికి కారకుల్లో ఒకరైన కళ్యాణ్‌సింగ్‌కు పద్మవిభూషణ్ ప్రకటించడం.. ఇప్పుడు దానికి కొనసాగింపే ఈ భారతరత్నాలు అన్న అభిప్రాయాలు సర్వత్రా వెల్లువెత్తడంలో ఆశ్చర్యమేముంటుంది? అప్పుడు ప్రణబ్‌ముఖర్జీ, ఇప్పుడు పీవీలకు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్‌ను దెబ్బతీయాలన్నది బీజేపీ కుచిత రాజకీయం. పీవీ హయాంలోనే బాబ్రీ మసీదు కూల్చివేత జరగడం, రామమందిర నిర్మాణంతో ఆ వివాదం ముగియడం కూడా ప్రధాని మనసులో ఉంటుంది. కానీ, ఒక ప్రభుత్వాధినేతగా దేశభద్రతను గాలికొదిలి, తన రాజకీయ ప్రయోజనాల కోసం పోలీసుల చేతులు కట్టేసి, కరసేవకుల మసీదు కూల్చివేతకు పరోక్షంగా అవకాశం కల్పించినవాడికి ఇంతటి సర్వోన్నత పురస్కారమివ్వడమేమిటి? అన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఎవరికి ఎందుకు భారతరత్న ఇచ్చారో అన్న విషయంలో మోడీ ఎన్ని కబుర్లు చెప్పినా సార్వత్రిక ఎన్నికలలో ఓటమి భయమో లేక "అబ్కీ బార్ 400 పార్" అన్న నినాదం సఫలం కాదనే కించిత్తు అనుమానమో కానీ, టోకున ఇచ్చిన ఈ పురస్కారాల వెనుక ఆయన రాజకీయ ప్రయోజనాలు, ఎన్నికల్లో లబ్ధిపొందాలన్న లక్ష్యమూ అడుగడుగునా కనిపిస్తున్నాయి. ఏ అంశాన్ని అయినా ఎన్నికల దృష్టిలో చూడగలిగిన చక్షువులు మోడీకి ఉన్నాయి. పనిచేసి జనం మద్దతు సంపాదించడం కన్నా జనాన్ని ఆశ్చర్యచకితుల్ని చేసి ప్రయోజనం పొందడంలో వీరిని మించినవారు ఎవరుంటారు గనక! రాజస్థాన్, పశ్చిమ ఉత్తర ప్రదేశ్, హర్యానాలలో రైతుల్లో మోడీ ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోంది. కనకే చరణ్ సింగ్, వ్యవసాయ శాస్త్రజ్ఞుడైన స్వామినాథన్‌లకు ఈ సత్కారం దక్కింది. మొత్తంగా మోడీ భారత రత్న సత్కారాన్నే తాయిలంగా మార్చేశారు. మాజీ ఉపరాష్ట్రపతి "ఎం.వెంకయ్య నాయుడు", ప్రముఖ సినీనటుడు "చిరంజీవి"లను పద్మాలంకృతలను చేయడం కూడా మోడీ విరచిత 'స్కీం'లో భాగమే! ముందే చెప్పుకున్నట్టు పురస్కారాల్లో రాజకీయాలు ఈ దేశానికి కొత్తేమీకాదు గానీ, వీటిని సైతం ఎన్నికల ప్రయోజనాలకు వాడుకోవడం మోడీ ఏలుబడిలో పరిపాటిగా మారింది. ఈ ఎంపికలో బీజేపీ మార్క్ రాజకీయాలు స్పష్టంగా కనిపిస్తుండటం కాదనలేని సత్యం.



మొక్క-నిరీక్షణ!

మొన్నటి వానకిది
కొత్త చిగుళ్ళతో మారాకు వేసింది
నిన్నటి చిరు మొగ్గలు
పూలై నవ్వుతున్నాయి.

దీని ఆకులన్నీ
కండ్లలా నన్నే చూస్తాయి
నా రాక కోసం
నిలువెత్తు పచ్చదనాన్ని నింపుకొని
ఆరుబయటే
అమ్మలా నిరీక్షిస్తుంటాయి

కాసిన్ని నీళ్లు చిలకరిస్తానా
చాక్లెట్ ఇచ్చినప్పటి
మా బుజ్జి మనవడి లాగే కేరింతలు
కొడుతుంది

రాత్రి నిశ్శబ్దంగా నిద్రిస్తూనే..
తెల్లారే లోగా పువ్వులనే కాదు
నాకు నవ్వులనూ ప్రసాదిస్తుంది

ఈ మొక్క భాష నేను బాగా
ఎరుగుదును..
బయట పడదు గానీ,
నాలాగే దీనికీ
లోలోన బలీయమైన ఉద్వేగాలు
మిట్ట మధ్యాన్నం చూడాలి
మాట్లాడేందుకు నేనుండనని
చిన్నగా కునుకు తీస్తూంటుంది

ఈ కుసుమ కోమల
హరిత సుందరి మా ఇంటికి వచ్చాకే
మా కుటీరమ్
వెన్నెల పూలూ వెలుగు ముచ్చట్లతో
నిండిపోయింది.!

అన్నట్టిది..
నిరుటి నా పుట్టినరోజున
నన్నూ నా మనసును చదివిన
ఓ జిగిరీ దోస్త్
ఏరి కోరి నాకు బహుకరించింది..!
ఇప్పుడది నన్నే ప్రేమిస్తూ
నాతో భాషిస్తూ
నా నిండా నిండిపోయింది.!

- నాంపల్లి సుజాత, 9848059893

కేంద్ర బడ్జెట్ - తిరగబడిన తర్కం



ప్రభాత్ పట్నాయక్



మోడీ ఏం చెప్తే అదే సత్యం అన్నది బీజేపీ విధానం. ఒకవేళ మోడీ చెప్పినది తప్పు అని నిర్ధారించే ఆధారాలు ఏమైనా ఉంటే అటువంటివి తప్పుడు ఆధారాలై వుండాలి. కనుక వాటిని కప్పిపుచ్చాలి. తన పదేండ్ల పాలనలో ఉన్నంత గొప్పగా భారత దేశం గతంలో ఏనాడూ లేదని మోడీ చెప్తున్నారు. కాని అధికారిక గణాంకాలు దానికి భిన్నంగా ఉన్నాయి. కాబట్టి ఆ గణాంకాలు తప్పు అని, అసలు గణాంకాలను సేకరించే విధానాన్నే మార్చాలని బీజేపీ అంటోంది. మూడవ ప్రపంచ దేశాల్లోకెల్లా పేరు గాంచిన గణాంక వ్యవస్థ మనది. పి.సి. మహలనోబిస్ రూపొందిన జాతీయ శాంపిల్ సర్వే విధానం మనకుంది. ఎంతో కృషి చేసి శ్రద్ధతో రూపొందించిన గణాంక వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం ధ్వంసం చేస్తోంది. 2011-12తో పోల్చినప్పుడు 2017 - 18లో గ్రామీణ ప్రజల తలసరి వినియోగం అన్ని విధాలా తీవ్రంగా పడిపోయిందని శాంపిల్ సర్వే వెల్లడించింది. అందుకు ఏకంగా ఆ సర్వే ఫలితాలను తొక్కిపెట్టారు. మనకి స్వాతంత్ర్యం రాకముందు నుంచీ దేశంలో జనాభా లెక్కల సేకరణ ప్రతీ పదేళ్ళకోమారు జరుగుతోంది. మోడీ చెప్పేవన్నీ వట్టి డాబులేనని ఆ జనాభా లెక్కలు ఎక్కడ బయట పెట్టేస్తాయో అన్న భయంతో ఆ జనాభా లెక్కల ప్రక్రియనే నిలిపివేశారు. నిరుద్యోగాన్ని లెక్కించేటప్పుడు వేతనం లేని పనిని కూడా నిరుద్యోగంగానే పరి గణించాలని ఐఎల్‌వో ప్రకటించింది. దానిని అనుసరిస్తే దేశంలో నిరుద్యోగం ఎంత తీవ్ర స్థాయిలో ఉందో బయట పడుతుంది. అందుచేత ఐఎల్‌వో విధానాన్ని పక్కన పెట్టేశారు.

మోడీ ప్రవచించిన "సత్యం" కారణంగా ఈ బడ్జెట్ ఎందుకూ కొరగాకుండా పోయింది. అలాగాక, ఏ దేశమైనా ప్రజల వాస్తవ పరిస్థితులను గనుక బడ్జెట్ పరిగణనలోకి తీసుకుని వున్నట్లైతే అది ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి చర్యలు తీసుకుని వుండేది. నేరుగా ప్రజలకు నగదు బదిలీ చేయడం కాని, కనీస వేతనాల స్థాయిని పెంచి చట్టబద్ధంగా అమలు చేయడం కాని ప్రతిపాదించి వుండేది. ఈ రెండింటిలో రెండూ కాని, ఏ ఒక్కటి కాని చేసినా ప్రజలకు నేరుగా ప్రయోజనాలు లభి స్తాయి. అంతేగాక దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక ఊపు వచ్చి వుండేది. మార్కెట్ బలపడి, ప్రయివేటు పెట్టుబడులు పెరిగి, ఉపాధి అవకాశాలు కూడా పెరిగివుండేవి.

వాస్తవానికి వేతనం లేని పని మాత్రమే కాదు. వేతనం చెల్లించే పనుల్లో కూడా అన్ని రకాల పనులనూ ఉపాధిగా లెక్కించకూడదు. 1930 దశకంలో మహా మాంద్యం నెలకొన్న కాలంలో బ్రిటన్‌లో చాలామంది నిరుద్యోగులు రోడ్ల పక్కన బూట్లు పాలిష్ చేయడానికి తయారయ్యారు. వారేమీ ఆ పనిని ఉచితంగా చేయలేదు. కాని అలాంటి వారినందరినీ ఉద్యో గులుగా లెక్కిస్తే నిరుద్యోగం అంత సంక్షోభ కాలంలో కూడా చాలా తక్కువ స్థాయిలో ఉన్నట్టే నిర్ధారణ వస్తుంది. ఇటువంటి తరహాను "ప్రచ్ఛన్న నిరుద్యోగులు"గా పరిగణించారు. అయితే ఆనాటి సమాజం సంక్షోభాన్ని తీవ్రమైన విషయంగా పరిగణిం చింది. బాధాకరమైనది ఏమంటే ప్రస్తుతం దేశంలో పాలకులు సంక్షోభాన్ని కూడా తీవ్రమైన విషయంగా పరిగణించడంలేదు.

ఒకవేళ మోడీ కొట్టుకునే సెల్ఫ్ డబ్బాయే వాస్తవం అయితే బడ్జెట్ గతంలో చెప్పినదాన్నే మళ్ళీ చెప్పడం అన్నది ఆశ్చ ర్యం కలిగించదు. ఈ బడ్జెట్ నిరుద్యోగాన్ని మరింత పెంచుతుంది. శ్రామిక ప్రజలను మరింత దారిద్ర్యంలోకి నెడుతుంది. సమా జంలో ఇప్పటికే వికృత రూపం దాల్చుతున్న ఆర్థిక అసమానతలను మరింత పెంచుతుంది. కాని ఈ వాస్తవాలను ప్రభుత్వం ఒప్పుకోదు. మీడియాలో ఉన్న భజంత్రీలూ ఒప్పుకోరు. ఎందుకంటే, వారి నాయకుడు అటువంటి సమస్యలేవీ లేనేలేవని ప్రకటించారు కదా! ఫిబ్రవరి 1న పార్లమెంటులో ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ఈ సంగతిని స్పష్టం చేసింది. ఆర్థిక మంత్రి ప్రసంగాన్ని చూద్దాం. సగటు నిజ ఆదాయాలు 50 శాతం పెరిగాయని ఆమె ప్రకటించారు. బహుశా గత దశా బ్దంతో పోల్చి ఆమె చెప్పి వుండాలి. కాని ఆమె చెప్పినది తలసరి ఆదాయం గురించి. అంతే తప్ప దేశంలో అత్యధిక సంఖ్యాకుల ఆదాయాల గురించి మాత్రం కాదు. జాతీయ సగటు ఆదాయం పెరిగింది కాబట్టి దేశంలో అందరి ఆదాయాలూ పెరిగినట్టే అని, దేశ ఆర్థిక పరిస్థితి చాలా బాగుందని ఆమె చెప్పుకోవడంలో మేధోపరమైన నిజాయితీ లోపించింది.

2011-12, 2017-18ఏండ్ల మధ్యకాలంలో దేశంలో పౌష్టికాహార లేమి పెరిగింది. ముఖ్యంగా గ్రామీణ భారతంలో రోజుకు కనీసం 2200 కేలరీల శక్తినిచ్చే ఆహారాన్ని పొందలేని జనాభా (గ్రామీణ ప్రాంతంలో పేదరికాన్ని నిర్ధారిం చేందుకు ప్రణాళికా సంఘం నిర్ధారించిన ప్రమాణాల ప్రకారం) 68 శాతం నుండి 80 శాతానికి పెరిగింది. మరి ఈ కాలంలో దేశంలో అత్యధికుల ఆదాయాలు మెరుగుపడ్డాయని ఏ ప్రాతిపదికన చెప్తున్నారు? ఈ కాలంలో దేశంలో ఏం జరిగిందనేది ఇక్కడ పరిశీలించడం ముఖ్యం. ప్రజలు చేసే వినిమయాన్ని అంచనా వేయడానికి గతంలో జాతీయ శాంపిల్ సర్వే ఐదేళ్ళకోమారు గణాంకాలు సేకరించేది. ఇప్పుడు దానికి స్వస్తి చెప్పారు. కాని కొన్ని ఇతర గణాంకాల ఆధారంగా మనం కొన్ని నిర్ధారణలకు రావచ్చు. వాటిలో ఒకటి గ్రామీణ ప్రాంతాల్లో వాస్తవ ఆదాయాలకు సంబంధించి గత ఐదేండ్ల డేటా. వ్యవసాయ పనుల్లో గాని, వ్యవసాయేతర పనుల్లో గాని ఉన్నవారి నిజ ఆదాయాలు గత ఐదేండ్లలోనూ పడిపోయాయి. పట్టణ ప్రాంతాల్లో సైతం అదే పరిస్థితి ఉండే అవకాశాలున్నాయి. ఆయా నిర్దీత వ్యవధుల్లో నిర్వహించే శ్రామిక సర్వే (పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే) తాజా వివరాల ప్రకారం దేశం మొత్తం మీద, అటు పట్టణాల్లో గాని, ఇటు గ్రామాల్లోగాని సగటు నెలవారీ ఆదాయాలు 2017-18కి, 2022-23కి మధ్య 20 శాతానికి పైగా పడిపోయాయి! అంటే 2017-18 తర్వాత నిజ ఆదాయాలు పడిపోతున్నాయనేది నిస్సందేహం.

స్వాతంత్ర్యం వచ్చినది మొదలు ఎన్నడూ లేనంత తీవ్ర స్థాయిలో నేడు నిరుద్యోగం ఉంది. సిఎంఐఇ (సెంటర్ ఫర్ మోనిటరింగ్ ది ఇండియన్ ఎకానమీ) ప్రకారం దేశంలో ఉన్న ఉద్యోగాల సంఖ్యలో గత ఐదేండ్లలో నికరమైన పెరుగుదల ఏమీ లేదు. ఒకపక్క నిజ వేతనాలు పడిపోతూ, మరొక పక్క ఉద్యోగాల సంఖ్యలో పెరుగుదల లేకపోవడం చూస్తే శ్రామికులుగా పనిచేస్తున్న వారి తలసరి నిజ ఆదాయాలు పడిపోతున్నట్టు స్పష్టమవుతోంది. శ్రామికుల ఆదాయాలు తరిగిపోతున్నప్పుడు రైతుల, కూలీల ఆదాయాలు వేరే దిశలో ఎలా ఉంటాయి? రైతుల ఆదాయాలు పెరిగితేనే డిమాండ్ పెరుగుతుంది. అప్పుడు అదనంగా కార్మికులు అవసరమౌతారు. దాని వలన ఉపాధి అవకాశాలు బాగా పెరుగుతాయి. పైగా కార్మికుల నిజ వేతనాలు కూడా పెరుగుతాయి. ఇప్పుడు కార్మికుల నిజ వేతనాలు పడిపోతున్నాయంటే దానిని బట్టి రైతుల, కూలీల ఆదాయాలు కూడా పడిపోతు న్నాయని - అంటే మొత్తం శ్రామిక ప్రజలందరి ఆదాయాలూ (వ్యవసాయ, వ్యవసాయేతర కూలీలు, రైతులు, చిన్న ఉత్పత్తి దారులు) గత ఐదేండ్లలో పడిపోయాయని నిర్ధారణ అవుతోంది. దేశ జనాభాలో ఈ శ్రామిక ప్రజలే అత్యధిక భాగం. అంటే దేశ జనాభాలో అత్యధిక భాగం గత ఐదేండ్ల కాలంలో దిగజారిన జీవన పరిస్థితులను అనుభవిస్తున్నారన్నది తిరుగులేని సత్యం. 2011-12 నుంచి 2017-18 మధ్య కాలంలో వీరి వినిమయం బాగా పడిపోయిందని ధృవపరిచే గణాంకాలను కూడా దీనికి తోడు చేస్తే శ్రామిక ప్రజల దుర్భర జీవితాలు మనకి దర్శనమిస్తాయి.

ఈ కారణంగానే మోడీ హయాంలో ప్రయివేటు పెట్టుబడులు ఎదుగుదల లేకుండా స్తంభించిపోయాయి. బడా పెట్టుబడిదారులకు, అందునా ఎంపిక చేసిన కొద్దిమంది క్రోనీ పెట్టుబడిదారులకు బీజేపీ ప్రభుత్వం ఎంత కొమ్ముగాసినా, ఇదే పరి స్థితి. ఇక ప్రయివేటు చిన్న పెట్టుబడిదారుల పెట్టుబడులూ స్తంభించిపోయాయి. లేదా తరిగిపోయాయి. పెద్ద నోట్ల రద్దు, జిఎస్ టి అమలు, నిరంకుశమైన లాక్‌డౌన్‌లతో ఈ రంగం నడుము విరిగిపోయింది. కార్పొరేట్ సంస్థల లాభాలలో పెరుగుదల ఉన్నా, వారి పెట్టుబడులలో మాత్రం స్తంభనే కొనసాగుతోంది. తనకు వచ్చిన లాభాలను బట్టి కాకుండా, మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి పెట్టుబడులు పెట్టడం జరుగుతుందన్నది వాస్తవం.

అయితే పెట్టుబడుల వ్యయం ఏటికేడూ పెరుగుతోందని ప్రభుత్వం వాదించవచ్చు. తన బడ్జెట్ ప్రసంగంలోనూ ఆర్థిక మంత్రి ఇదే వాదన చేశారు. ఇలా పెరగడం వలన ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రయివేటు పెట్టుబడిదారులకు కావలసిన మార్కెట్ విస్తరణ జరుగుతుందని, అప్పుడు వారినుండి పెట్టుబడులు కూడా పెరుగుతాయని ఆ వాదన అంటుంది. అయితే ఇక్కడ జరిగిందేమంటే ప్రభుత్వం వైపు నుండి పెరిగిన పెట్టుబడుల వ్యయం ప్రభావం దేశీయ మార్కెట్‌లో కన్నా అంతర్జాతీయ మార్కెట్‌లో ఎక్కువగా వ్యక్తమవుతోంది. అందుచేత దేశీయ మార్కెట్‌లో పెట్టుబడుల పెరుగుదల లేదు. ఇక ప్రభుత్వం అను సరిస్తున్న వ్యూహంలోని మరో భాగం ప్రభుత్వరంగ బ్యాంకుల ద్వారా ప్రయివేటు పెట్టుబడిదారులకు భారీగా రుణాలివ్వడం. ఇలా రుణాలు పొందినవారిలో క్రోనీ పెట్టుబడిదారులు కూడా ఉన్నారు. "మౌలిక వసతుల కల్పన రంగం" లో పెట్టుబడులు పెట్టడానికి గాను వారికి ఈ రుణాలు ఇస్తున్నట్టు ప్రభుత్వం చెప్తోంది. దీని పర్యవసానంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల దగ్గర పాత బకాయిలు పెద్ద మొత్తాల్లో పేరుకుపోయాయి. అంటే ప్రయివేటు పెట్టుబడిదారులు తీసుకోవలసిన రిస్క్‌ను ప్రభుత్వ రంగ బ్యాంకులు తీసుకోవలసి వస్తోందన్నమాట. ఇలా రిస్క్ తీసుకున్నా, ఆ పెట్టుబడులలో అధిక భాగం విదేశీ మార్కెట్‌లోని డిమాండ్‌ను పెంచడానికే దోహదపడుతోంది.


మోడీ ప్రవచించిన "సత్యం" కారణంగా ఈ బడ్జెట్ ఎందుకూ కొరగాకుండా పోయింది. అలాగాక, ఏ దేశమైనా ప్రజల వాస్తవ పరిస్థితులను గనుక బడ్జెట్ పరిగణనలోకి తీసుకుని వున్నట్టైతే అది ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి చర్యలు తీసుకుని వుండేది. నేరుగా ప్రజలకు నగదు బదిలీ చేయడం కాని, కనీస వేతనాల స్థాయిని పెంచి చట్టబద్ధంగా అమలు చేయడం కాని ప్రతిపాదించి వుండేది. ఈ రెండింటిలో రెండూ కాని, ఏ ఒక్కటి కాని చేసినా ప్రజలకు నేరుగా ప్రయోజనాలు లభి స్తాయి. అంతేగాక దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక ఊపు వచ్చి వుండేది. మార్కెట్ బలపడి, ప్రయివేటు పెట్టుబడులు పెరిగి, ఉపాధి అవకాశాలు కూడా పెరిగి వుండేవి.

మోడీ హయాంలో ప్రయివేటు పెట్టుబడులు ఎదుగుదల లేకుండా స్తంభించిపోయాయి. బడా పెట్టు బడిదారులకు, అందునా ఎంపిక చేసిన కొద్దిమంది క్రోనీ పెట్టుబడిదారులకు బీజేపీ ప్రభుత్వం ఎంత కొమ్ముగాసినా, ఇదే పరి స్థితి. ఇక ప్రయివేటు చిన్న పెట్టుబడిదారుల పెట్టుబడులూ స్తంభించిపోయాయి. లేదా తరిగిపోయాయి. పెద్ద నోట్ల రద్దు, జిఎస్ టి అమలు, నిరంకుశమైన లాక్‌డౌన్‌లతో ఈ రంగం నడుము విరిగిపోయింది. కార్పొరేట్ సంస్థల లాభాలలో పెరుగుదల ఉన్నా, వారి పెట్టుబడులలో మాత్రం స్తంభనే కొనసాగుతోంది. తనకు వచ్చిన లాభాలను బట్టి కాకుండా, మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి పెట్టుబడులు పెట్టడం జరుగుతుందన్నది వాస్తవం.

కాని మన పాలకులకు అటువంటి విధానాలు నిషిద్ధం. నిజానికి దానికి పూర్తి వ్యతిరేక దిశలో నడుస్తున్నారు. ఆహారం, ఎరువులు, ఇంధనం మీద ఇచ్చే సబ్సిడీని రూ.4.13 లక్షల కోట్ల నుండి రూ.3.81 లక్షల కోట్లకు తగ్గించారు. ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు ఏ మాత్రం పెంచలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మాదిరిగానే రూ.86,000 కోట్లకే పరి మితం చేశారు. ఈ విధంగా చేయడం "ఆర్థిక విజ్ఞత"ను సూచిస్తోందని భజంత్రీ మీడియా మెచ్చుకుంది. ఇటువంటి "ఆర్థిక విజ్ఞత"ను ప్రదర్శించినందువలన విదేశీ పెట్టుబడులు బాగా తరలి వస్తాయని ప్రభుత్వం కూడా చెప్పుకుంటోంది. అందువలన మన వృద్ధిరేటు ఇంకా పెరుగుతుందని కూడా చెప్తోంది. మన "ఆర్థిక విజ్ఞత" ఎంత గొప్పగా ఉన్నా మన క్రెడిట్ రేటింగ్ (ఆర్థిక స్తోమతను అంచనా వేసే రేటింగ్) మాత్రం చాలా హీనంగానే కొనసాగుతోంది. ఇండోనేషియా కన్నా ఒక మెట్టు దిగువన, థాయ్ లాండ్ కన్నా రెండు మెట్లు దిగువన మనం ఉన్నాం. జంక్ బాండ్లు (దివాలా ఎత్తిపోయిన కంపెనీల వాటాలకు సంబంధించినవి) కన్నా ఒక్క మెట్టు మాత్రమే మనం పైన ఉన్నాం. అంటే అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడికి మన "ఆర్థిక విజ్ఞత" అంతగా రుచించలేదన్న మాటేగా!

(స్వేచ్ఛానుసరణ)

చైనా యాప్‌లపై.. అదానీ కోసం..!



సంగిరెడ్డి హనుమంతరెడ్డి
9490204545

మన పాలకులు అమెరికా ఉచ్చులో పడి అమెరికాకు నచ్చని దేశాలతో తగవులు పెట్టుకుంటున్నారు. వాణిజ్య చట్టాలను, మార్కెట్ నిబంధనలను ఇష్టానుసారం, అపారదర్శకంగా అమలు చేస్తున్నారు. విదేశీ, ప్రత్యేకించి చైనా వ్యాపారాలపై కక్షకట్టారు. అంతర్జాతీయ వ్యాపార నిబంధనలను,చట్టాలను పక్షపాత ధోరణితో చూస్తున్నారు. ఉదాహరణకు మనీలాండరింగ్ ఆరోపణలపై చైనా స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ వివో ఇండియా శాఖలో ఇద్దరు వరిష్ఠ ఉద్యోగులను భారత నేర నిరోధక సంస్థ 23డిసెంబర్2023న అరెస్టు చేసింది. అదాని కుంభకోణాన్ని వదిలేసింది. ఏ షరతులు విధించకుండా, పార్లమెంటులో చర్చించకుండా మనం ఆమోదించిన ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనల ప్రకారం దాని సభ్య దేశ వాణిజ్య సంస్థలను మరొక సభ్య దేశం ఆమోదించి తీరాలి. కమ్యూనిస్టు వ్యతిరేకులైన నేటి మన పాలకులు కమ్యూనిస్టులు పాలిస్తున్న చైనా వాణిజ్య సంస్థలను దొడ్డిదారిన అడ్డుకుంటున్నారు. తానే పట్టుపట్టి స్థాపించిన ప్రపంచ వాణిజ్య సంస్థను అమెరికా నిరుత్సాహపరుస్తోంది. ఈ సంస్థ ద్వారా అమెరికా ప్రయోజనాలు తగ్గడం, ఆ సంస్థపై చైనా పట్టు సాధించడం దీనికి కారణాలు. ఈ పేలవ వ్యాపార వాతావరణంతో విశ్వవిపణిలో ఇండియా అపఖ్యాతి పాలయింది.

వివో భారతీయ నేర నిరోధక సంస్థ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. "భారత అధికారుల ప్రస్తుత చర్యతో మేము తీవ్రంగా ఆందోళన చెందుతున్నాము. ఇటీవలి అరెస్టులు నిరంతర వేధింపులకు నిదర్శనలు." అని వివో ప్రతినిధి అన్నారు. ఇండియాలో వివో ఇలాంటి చట్టపర సవాళ్లను ఎదుర్కోవడం ఇదే మొదటిసారి కాదు. నాలుగునెల్ల క్రితమే వివోఇండియాశాఖకు చెందిన ఒక చైనా దేశీయునితో సహా నలుగురు కార్యనిర్వాహక అధికారులను ఇలాంటి అవాస్తవ ఆరోపణలపై భారత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టుచేసింది. మన ప్రధాని చైనాకు వ్యతిరేకంగా అమెరికా అనుకూల సంస్థల్లో భాగస్వామి అయ్యారు. పెట్టుబడులు పెట్టారు.ఆ సంస్థలు చైనా సాంకేతిక, వాణిజ్య అభివృద్ధిని ఇండొపసిఫిక్ దేశాల్లో అడ్డుకోవడానికేనని అమెరికా బహిరంగంగానే ప్రకటిం చింది. అలాంటి లక్ష్యాలతోనే స్థాపించిన 13 దేశాల ఇండొపసిఫిక్ అభివృద్ధి ప్రణాళికలో కూడా మన దేశాన్ని చేర్చారు.

ఈ ఇండియా దుశ్చర్యలకు చైనా వేరే దారిలో స్పందించింది. 2020జూన్‌లో ఘోర సరిహద్దు సంఘర్షణ జరిగింది. ఇరువైపులా సైనికులు చనిపోయారు. ఈ సంఘటన తర్వాత ఇండియాచైనాతో దౌత్య చర్చలు జరుపలేదు. చైనా చర్యలకు విరుద్ధంగా అంతర్జాతీయ వేదికలనువినియోగించలేదు. తన సరిహద్దు వివాదాన్ని వ్యాపార రంగానికి విస్తరించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. బహిరంగంగానే చైనా వ్యాపారాలు, పెట్టుబడులను లక్ష్యంగా చేసుకుంది. భారతదేశ భద్రత, పౌర శాంతికి ముప్పు కలిగిస్తాయన్న అవాస్తవ కారణాలతో టిక్‌టాక్, డజన్ల కొద్దీ ఇతర చైనా యాప్‌లను నిషేధించింది. ఈ అసమంజస కారణాలతోనే ఇండియాలో పని చేస్తున్న ప్రధాన చైనా కంపెనీలపై దాడులు చేయించింది. టెలి కమ్యూనికేషన్స్ పరికరాల దిగ్గజం హువాయిపై పన్ను ఎగవేత పేరుతో దర్యాప్తు, చట్టవిరుద్ధ విదేశీ మారక ద్రవ్య బదిలీల సాకుతో స్మార్ట్‌ఫోన్ కంపెనీ జియావొమి నుండి 72.5 లక్షలడాలర్ల సొమ్ము స్వాధీనంపీటిలో ముఖ్యమయినవి. ఈ రెండు సంఘటనలు 2022లో జరిగాయి. ఇవి ఇండియా పాలకుల ఉద్దేశాలలో ఒక భాగమే. తమకు ఇష్టంలేని విదేశీ కంపెనీల స్థానంలో,ప్రభుత్వరంగ సంస్థ బి.ఎస్.ఎన్.ఎల్.ను హత్యచేసి ప్రధాని శ్రేయో ఆశ్రిత సంస్థలు అదాని కమ్యూనికేషన్స్, అంబానీ జియో సంస్థలను ప్రోత్సహించడం ఇందులో ప్రధాన ఉద్దేశం.

జనాధరణ పెరుగుదలపై, మత ఓటర్ల సమీకరణపై స్వారీ చేస్తున్న వైదిక పాలకుల దుర్మార్గపు ఇష్టాయిష్టాలకు చైనా కంపెనీలే బాధితులు కాదు. అమెరికన్ బహుళరంగ సాంకేతిక సంస్థలు గూగుల్, అమెజాన్, ఫిన్లాండ్ టెలికమ్యూనికేషన్స్, సమాచార సాంకేతిక సంస్థ నోకియా, దక్షిణ కొరియా ఉత్పత్తి సంస్థ శాంసంగ్ వగైరా బహుళజాతి సంస్థలు ఇటీవల ఇండియాలో లక్షల రూపాయల జరిమానా చెల్లించాయి. ఏదో సందర్భంలో ఆ దేశాలలో ఎవరో ఒకరు చేసిన తమ పాలనా విధానాల విమర్శలకు ఇవి ప్రతిఫలాలు. మనపాలకులు కల్పిత ఆరోపణలతో విదేశీ వ్యాపార సంస్థలను బెదిరించడం రెట్టించారు. దీనితో మన ప్రధాని మేక్ ఇన్ ఇండియా (మా దేశ చౌకవనరులను వాడుకొని ఇక్కడ వస్తువులను ఉత్పత్తి చేసి ఏ దేశంలోనయినా అమ్ముకోండి.) పథకం కూడా ప్రమాదంలో పడింది. విదేశీ కంపెనీలకు భారతం"శ్మశానవాటిక"గా పేరు తెచ్చుకోవడంలో ఆశ్చర్యం లేదు.

జనాధరణ పెరుగుదలపై, మత ఓటర్ల సమీకరణపై స్వారీచేస్తున్న వైదిక పాలకుల దుర్మార్గపు ఇష్టాయిష్టాలకు చైనా కంపెనీలే బాధితులు కాదు. అమెరికన్ బహుళరంగ సాంకేతిక సంస్థలు గూగుల్, అమెజాన్, ఫిన్లాండ్ టెలికమ్యూనికేషన్స్, సమాచార సాంకేతిక సంస్థ నోకియా, దక్షిణ కొరియా ఉత్పత్తి సంస్థ శాంసంగ్ వగైరా బహుళజాతి సంస్థలు ఇటీవల ఇండియాలో లక్షల రూపాయల జరిమానా చెల్లించాయి. ఏదో సందర్భంలో ఆ దేశాలలో ఎవరో ఒకరు చేసిన తమ పాలనా విధానాల విమర్శలకు ఇవి ప్రతిఫలాలు. మనపాలకులు కల్పిత ఆరోపణలతో విదేశీ వ్యాపార సంస్థలను బెదిరించడం రెట్టించారు. దీనితో మన ప్రధాని మేక్ ఇన్ ఇండియా (మా దేశ చౌకవనరులను వాడుకొని ఇక్కడ వస్తువులను ఉత్పత్తి చేసి ఏ దేశంలోనయినా అమ్ముకోండి.) పథకం కూడా ప్రమాదంలో పడింది. విదేశీ కంపెనీలకు భారతం"శ్మశానవాటిక"గా పేరు తెచ్చుకోవడంలో ఆశ్చర్యం లేదు.



2014 నుండి 2021 వరకు, ఇండియాలో నమోదుచేసుకున్న 2,800 పైగా విదేశీ కంపెనీలు తమ కార్యాలయాలను మూసి వేసాయి. మన ప్రభుత్వ అధికార సమాచారం ప్రకారం ఈ మూసి వేసిన కంపెనీల సంఖ్య దేశంలోని మొత్తం బహుళజాతి కంపెనీలలో ఆరో వంతు. ప్రపంచబ్యాంకు తన గ్లోబల్ డూయింగ్ బిజినెస్ నివేదికలో భారత్‌ను వ్యాపారం ప్రారంభించేందుకు ప్రపంచంలోని చెత్త దేశాల్లో ఒకటిగా పేర్కొంది. ప్రపంచ ఆహార కార్యక్రమం ప్రకారం, ప్రపంచంలో పోషకాహార లోపమున్న జనాభాలో 25 శాతం ఇండియాలో నివసిస్తున్నారు.సాంకేతికత, మూలధనం, ఉద్యోగ అవకాశాలను తెచ్చే అవకాశాలున్న,అత్యవసర రంగాలలోనే విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం ద్వారా ఆర్థిక అభివృద్ధిని కొనసాగించడం, స్థిరీకరించడం ఇండియా తక్షణ కర్తవ్యం. బీమా లాంటి రంగాలలో పెట్టుబడులే అక్కరలేదు.రాజకీయ లబ్ధికోసం నచ్చని విదేశీ స్వదేశీ వ్యాపారాలను నాశనం చేయరాదు. మన పనులను చేయలేకపోడమే గాక తన పనుల్ని కూడా చేసుకోలేని బొమ్మ దేవుని సేవలు మాని స్వదేశీ పారిశ్రామికాభివృద్ధిపై దృష్టి పెట్టడంలో భారత ప్రగతి ఇమిడి ఉంది.

మెయిల్ @ నవతెలంగాణ

కొత్త బస్సులు కొనుగోలు చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద కల్పిస్తున్న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం చాలా ఊరటనిచ్చిన మాట వాస్తవం. అయితే ఉచితం వల్ల ప్రయాణికుల తాకిడి కూ డా బాగా పెరిగింది. పెండ్లిళ్లు, జాతరలు, పండగల సందర్భంగా చాలామంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. సరిపడా బస్సులు లేక చాలా మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారు వెళ్లాల్సిన గమ్యస్థానాలకు సరైన సమయానికి వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా మహిళలు కూడా బస్సుల్లో కిక్కిరిసిపోవడం, వారు కూడా గంటలకొద్దీ నిలబడటం వల్ల నిరాశను వ్యక్తపరుస్తున్నారు. పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సకాలంలో చేరుకోలేక చదువులు నష్టపోతున్నారు. ఇప్పటికే బస్సుల్లో మహిళలు సీట్ల కోసం ఘర్షణ పడుతున్న సందర్భాలు చూస్తున్నాము. పరిమితికి మించి ప్రయాణికుల ఎక్కడంతో బస్సులు అదుపు తప్పి ప్రమాదాలు జరిగిన ఘటనలు కూడా అనేకం. ఇప్పటికే కాలం చెల్లిన బస్సులు కూడా ఉన్నాయి. అన్నింటికీ తక్షణ పరిష్కారం అదనపు బస్సులు కేటాయించడం. అలా చేయాలంటే ప్రభుత్వం కొత్త బస్సులు కొనుగోలు చేయడం. ఎందుకంటే ప్రయాణికుల రద్దీని బట్టే బస్సులు నడుపుతారు. పథకం ప్రవేశపెట్టినప్పుడే ఎన్ని బస్సులు కొత్తవి కావాలో అంచనాకు వచ్చినట్టు వార్తలు. కొత్త ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల పాలన పూర్తయ్యేలోగా కొత్త బస్సులను కొనుగోలు చేసి ప్రయాణికుల సమస్యను తీర్చాలి.

- ఎం.సురేష్, నాగర్‌కర్నూల్

పార్లమెంట్ సమావేశాల రోజులు తగ్గినయ్

- 17వ లోక్‌సభలో ఏడాదికి సగటున 55 రోజులే
- మొదటి లోక్‌సభలో ఇది 135 రోజులు
- పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ అధ్యయనం

న్యూఢిల్లీ : భారత్‌లో సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 17వ లోక్‌సభ రద్దు కావటానికి సమయం దగ్గరపడుతున్నది. 17వ లోక్‌సభ సమావేశాలు శుక్రవారం నాటికి ముగిశాయి. అయితే, మోడీ ప్రధానిగా ఉన్న కాలం నాటి ఈ పార్లమెంటు సమావేశాలు వివిధ అంశాలపై చర్చించటానికి ఏడాదికి సగటున 55 రోజుల మాత్రమే వెచ్చించటం గమనార్హం. ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సభా నాయకుడిగా ఉన్న మొదటి లోక్‌సభ సగటు వార్షిక సమావేశాలు 135 రోజులు జరగటం గమనార్హం. పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ ద్వారా జూన్, 2019 నుంచి ఫిబ్రవరి, 2024 మధ్య పార్లమెంటు గణాంక అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది.

అతి తక్కువ సమావేశాలకు సంబంధించిన వివరణలలో ఒకటి కోవిడ్-19 మహమ్మారి. ఒక్కో సెషన్ ముందుగానే రద్దు కావటానికి వేర్వేరు కారణాలున్నాయి. ఐదేండ్లలో, పార్లమెంటు 2020లో అత్యల్ప రోజులు (మొత్తం 33) సమావేశమైంది. 17వ లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ లేకుండా తొలిసారిగా పని చేసింది. ఇది రాజ్యాంగబద్ధంగా ఉండాల్సిన స్థానం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 ప్రకారం వీలైనంత త్వరగా లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లను ఎన్నుకోవాలి. కానీ, అలా జరగకపోవటం గమనార్హం.

మోడీ ప్రభుత్వం ఎలాంటి చర్చా లేకుండానే చాలాసార్లు హడావుడిగా బిల్లులు ఆమోదింపజేసుకుంటున్నదని ప్రతిపక్షాలు తరచూ విమర్శిస్తున్నాయి. గణాంకాలు సైతం ప్రతిపక్షాల వాదనకు మద్దతుగా కనిపిస్తున్నాయి. 58 శాతం బిల్లులు ప్రవేశపెట్టిన రెండు వారాల్లోనే ఆమోదించబడ్డాయి. జమ్మూకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు, 2019, మహిళా రిజర్వేషన్ బిల్లు, 2023 ప్రవేశపెట్టిన రెండు రోజుల్లోనే ఆమోదించబడ్డాయి. లోక్‌సభలో గంట కంటే తక్కువ చర్చతో 35 శాతం బిల్లులు ఆమోదం పొందాయి.

రాజ్యసభలో ఇది 34 శాతంగా ఉన్నది. 16 శాతం బిల్లులు మాత్రమే పరిశీలన కోసం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలకు పంపబడ్డాయి. ఇది మునుపటి మూడు లోక్‌సభలకు సంబంధించిన గణాంకాల కంటే తక్కువ కావటం గమనార్హం.

17వ లోక్‌సభలో 729 ప్రయివేటు బిల్లులు (పీఎంబీ) ప్రవేశపెట్టబడ్డాయి. ఇది 16వ లోక్‌సభ మినహా మునుపటి అన్ని లోక్‌సభల కంటే ఎక్కువ. అయితే వాటిలో రెండు మాత్రమే చర్చకు వచ్చాయి. రాజ్యసభలో 705 పీఎంబీలు ప్రవేశపెట్టబడ్డాయి. ఇందులో 14 చర్చకు వచ్చాయి

సామరస్యంతోనే పరిష్కారం..ఘర్షణతో నష్టం

- కృష్ణా జలాల హక్కులపై సీపీఐ సభ్యులు కూనంనేని

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

నీటికి సంబంధించిన సమస్యలను సామరస్య పద్ధతుల్లో, సహృద్భావ వాతావరణంలో చర్చల ద్వారా పరిష్కరించుకోవడమే కీలకమనీ, ఒక రాష్ట్రం మరో రాష్ట్రంతో ఘర్షణకు దిగితే మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని సీపీఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. కేఆర్ఎంబీకి కృష్ణానది ప్రాజెక్టుల అప్పగింతపై సోమవారం అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంతో సఖ్యత కూడా అవసరమేనన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు సభ్యులుగా కేంద్ర జలవనరుల మంత్రి చైర్మన్ ఉన్న అపెక్స్ కౌన్సిల్ ఉభయ రాష్ట్రాల మధ్య నీటి సమస్యను పరిష్కారం చేయాలనే ఆలోచన ఉంటే ఈ పాటికి సమస్య పరిష్కారం అయ్యేదని, ఒకవేళ వాళ్ళ నుండి చొరవ ఉండి, మన దగ్గర లేక మనమే చెడగొట్టుకుంటే ఏమీ చేయలేమన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ తర్వాత దాన్ని మర్చిపోయిందని విమర్శించారు. గతంలో వై.ఎస్.రాజశేఖర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే పోతిరెడ్డి పాడు సామర్థ్యాన్ని 11వేల క్యూసెక్కు 44వేలకు పెంచిన సందర్భంలోనే నీటి తరలింపునకు బీజం పడిందన్నారు.

ఆ సమయంలో టీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసే ఉన్నాయని గుర్తుచేశారు. పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచినప్పుడు కూడా వారంతా కలిసే ఉన్నారనీ, తొలుత ఆటంకం చెప్పినా ఆ తర్వాత అంగీకరించారని చెప్పారు. రాయలసీమకు పోతిరెడ్డిపాడు నీళ్ల తరలింపునకు సంబంధించి గొడవ మొదలైందని గుర్తుచేశారు. ఇంత కాలం మౌనంగా ఉండి, తామే అభ్యంతరం వ్యక్తం చేశామనీ, లేఖలు రాశామని చెబుతున్నారని, అవన్నీ కూడా అంతర్గత అవగాహన మాత్రమేనని చెప్పారు.

ఆనాడు 44వేల క్యూసెక్కుల కోసం ఎంతో హడావుడి చేశామని, తరువాత ఏకంగా 94వేల క్యూసెక్కుల నీటిని తీసుకెళ్ళినప్పుడు ఏమైనా ఆందోళన జరిగిందా అని నిలదీశారు. ఇద్దరు సీఎంల మధ్య సాన్నిహిత్య సంబంధం ఉందనీ, ఈ విషయంలో ఎప్పుడైనా కచ్చితంగా ప్రశ్నించారా? అని అడిగారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా రోజుకు మూడు టీఎంసీలను తీసుకెళ్తుంటే ఏమి చేశారని అడిగారు.

ఏపీతో ఐక్యంగా కొట్లాడాల్సిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఇక్కడ సభలో కొట్లాడుకుం టున్నాయన్నారు. కేఆర్ఎంబీ కోసం గత ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించిందనీ, అంటే బోర్డును అంగీకరించడమేనని చెప్పారు. పదేండ్ల నుంచి నీళ్ళు తరలించుకుపోతుంటే ఎందుకు ప్రజాందోళన చేయలేదని ప్రశ్నించారు. కృష్ణానదిలో 50 :50 నిష్పత్తిలో నీటి వాటాను ఎందుకు వదులుకున్నారని నిలదీశారు. ప్రస్తుతం పోతిరెడ్డి పాడు, ముచ్చుమర్రి, రాయలసీమ ఎత్తిపోతల ద్వారా కృష్ణా నీటి తరలింపు కొనసాగితే రోజుకు 9.5 టిఎంసిల నీరు గ్రావిటీ ద్వారా తరలిపోతాయనీ, 17-18 రోజుల్లోనే శ్రీశైలం ఖాళీ అయ్యి మనకేమి మిగల బోవని హెచ్చరించారు. దీనివల్ల మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలు పూర్తిగా ఎండిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా గోదావరి జలాల్లో తెలంగాణకు జరుగుతున్న నష్టంపై శాసనసభలో ప్రత్యేక చర్చ జరగాలన్నారు.

ఆమోదం లభించడం చారిత్రాత్మకం

పొగాకు వాణిజ్య ప్రకటనల నిషేధంపై మాచన రఘునందన్ హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సిగరెట్, పొగాకు సంబంధిత ఉత్పత్తులు, వినియోగానికి సంబంధించి వాణిజ్య ప్రకటనలను రాష్ట్రంలో నిషేధిస్తూ చట్టం చేయడం పట్ల పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత మాచన రఘునందన్ హర్షం వ్యక్తం చేశారు.

ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీలో ఈ బిల్లుకు ఆమోదం లభించడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకున్నదని ధన్యవాదాలు తెలిపారు. హుక్కాపై కూడా నిషేదం విధిస్తూ బిల్లును ఆమోదించడం. శుభపరిణామని అభివర్ణించారు. ఈ చర్య దేశంలోని ఇతర రాష్ట్రాలు ప్రజల ఆరోగ్య గురించి ఆలోచింపజేసేదిగా ఉందని తెలిపారు.

కృష్ణా జలాల కోసం కాదు...

- బీఆర్ఎస్ పరిరక్షణ కోసమే : టీడీపీ విమర్శ

నవతెలంగాణ -హైదరాబాద్

సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి తెలంగాణలో బీఆర్ఎస్, ఆంధ్రలో జగన్ రాజకీయలబ్ది పొందేందుకు కేసీఆర్ కృష్ణా జలాలపై డ్రామా నడిపిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్ విమర్శించారు. మంగళవారం నల్లగొండలో కేసీఆర్ నిర్వహించే సభ కృష్ణా జలాల పరిరక్షణ కోసం కాదనీ, తన పార్టీ బీఆర్ఎస్ పరిరక్షణ కోసమమేనని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ఛీత్కారనికి గురైన కేసీఆర్, తన పార్టీ ఎమ్మెల్యేలు, క్యాడర్‌ను కాపాడుకోవడం కోసమే కృష్ణా జలాల పేరుతో సభ నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. అంతే కాకుండా మొన్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ఒకరోజు ముందు నాగార్జునసాగర్ ప్రాజెక్టును ఏపీ సీఎం జగన్ ఏపీ పోలీసుల చేత ఆక్రమించుకొని సెంటిమెంట్‌ని రెచ్చగొట్టి బీఆర్ఎస్‌కు లబ్దిచేయాలని చూశారన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కష్ణా జలాల పరిరక్షణను విస్మరించి, ఇప్పుడు రాజకీయాలు చేయడం సరైంది కాదన్నారు. ప్రాజెక్టులకు పూర్తి చేయకుండా నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



విద్యార్థినుల మరణాలపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరపాలి

- వైష్ణవి కుటుంబానికి న్యాయం చేయాలి :కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, స్కైలాబ్ బాబు

నవతెలంగాణ-సూర్యాపేట

రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలో జరుగుతున్న విద్యార్థినుల మరణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, స్కైలాబ్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూర్యాపేటలోని ఇమాంపేట గురుకుల కళాశాలలో మృతిచెందిన వైష్ణవి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలోని వైష్ణవి కుటుంబాన్ని కేవీపీఎస్ రాష్ట్ర బృందం పరామర్శించింది. విద్యార్థిని మృతికి సంబంధించిన వివరాలను తల్లిదండ్రులతో మాట్లాడి తెలుసుకుంది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురుకుల కళాశాలలో వైష్ణవి మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఉరేసుకుందని పాఠశాల ప్రిన్సిపాల్, హాస్టల్ సిబ్బంది చెబుతున్నారు కానీ.. విద్యార్థిని శరీరంపై గాయాలు ఎలా అయ్యాయని ప్రశ్నించారు. కలెక్టర్, ఎస్పీ చొరవ తీసుకొని విద్యార్థిని గదిని, గురుకుల కళాశాలను సందర్శించేందుకు తల్లిదండ్రులకు, సామాజిక సంఘాల నాయకులకు అవకాశం కల్పించాలని కోరారు. వైష్ణవి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. స్పష్టమైన ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సూర్యాపేటలో గురుకుల విద్యార్థిని, భువనగిరిలో సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థినుల మరణాలపై సమగ్ర వివరాలు తెలియాలంటే సిట్టింగ్ జడ్జిచే సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఎస్పీ, కలెక్టర్ ఇప్పటివరకు వైష్ణవి కుటుంబాన్ని పరామర్శించకపోవడం సరికాదన్నారు. విద్యార్థినుల ఆత్మహత్యలపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ బృందంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతివేల మాణిక్, జిల్లా కార్యదర్శి కోట గోపి, అధ్యక్షులు మర్రి నాగేశ్వరరావు, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్గూరి గోవింద్, రాష్ట్ర నాయకులు బొట్ల శేఖర్, పల్లెర్ల లలిత, దేవదానం, అశోక్, సుభాష్, కొతారి నర్సింహులు, నాయకులు నందిగామ సైదులు, టేకుల సుధాకర్, వెంకటరమణ, భాగ్యమ్మ దుర్గయ్య తదితరులు ఉన్నారు.

కృష్ణా జలాల వివాదం కేసు మార్చి 13కు వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా జలాల వివాదం కేసు విచారణను సుప్రీంకోర్టు మార్చి 13కు వాయిదా వేసింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కృష్ణా ట్రిబ్యునల్-2 టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్) కృష్ణా ట్రిబ్యునల్ -2 కు సంబంధించిన టీఓఆర్‌పై స్టే విధించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గత విచారణ సందర్భంగా కేంద్రం, తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఏపీ దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. మరోసారి ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కెవి విశ్వనాధన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఏపీ ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినిపిస్తూ... కేసుకు సంబంధించి ప్లీడింగ్స్ పూర్తయ్యాయని, వాదనలకు కొంత సమయం కావాలని కోరారు. ఇందుకు అంగీకారం తెలిపిన ధర్మాసనం విచారణను మార్చి 13కు వాయిదా వేస్తున్నట్టు వెల్లడించింది.

డిప్యూటీ సీఎంల నియామకం రాజ్యాంగ విరుద్ధం కాదు : సుప్రీంకోర్టు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో


ఒక రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రిని నియమించడం రాజ్యాంగ విరుద్ధం కాదని అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పునిచ్చింది. ఇలా చేయడం వల్ల రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించినట్లు కాదని స్పష్టం చేసింది. అధికార పార్టీలోని సీనియర్ నాయకులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడానికి దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఉప ముఖ్యమంత్రిని నియమించే పద్ధతిని అవలంబిస్తున్నారని పేర్కొంది. ఉప ముఖ్యమంత్రి నియామకాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీకి చెందిన పబ్లిక్ పొలిటికల్ పార్టీ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వాజ్యాన్ని సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారిం చింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి నియామకం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాజ్యాంగ విలువ ప్రకారం డిప్యూటీ సీఎంల నియామకం జరుగుతుందని ధర్మాసనం తెలిపింది. సీఎం పరిధిలో ఉండే మంత్రిమండలిలో డిప్యూటీ సీఎంలు భాగమని కోర్టు పేర్కొన్నది. "ఉప ముఖ్యమంత్రి పదవి ప్రభుత్వంలో మొదటిది మాత్రమే కాకుండా అత్యంత ముఖ్యమైనది. ఇది రాజ్యాంగాన్ని ఉల్లంఘించదు. ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు)ను ఉప ముఖ్యమంత్రి పదవి ఉల్లంఘిస్తోందని పేర్కొ న్న పిటిషన్‌లో వాస్తవం లేదు. ముఖ్యమంత్రికి సహాయం చేయడానికి, సీని యర్ నాయకులను మంత్రివర్గంలో ఉంచేందుకు ఉప ముఖ్యమంత్రులను నియమిస్తారు. పేరుకు డిప్యూటీ సీఎం అని పిలిచినప్పటికీ ఆయన కూడా మంత్రివర్గంలో ఒక మంత్రే" అని ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ అన్నారు.

పలు కొలువులకు వయోపరిమితి 46 ఏండ్లకు పెంపు

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. వారి వయోపరిమితిని రెండేండ్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో సర్వీస్ కమిషన్, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రభుత్వ ఉద్యోగాల గరిష్ట వయోపరిమితి 44 ఏండ్ల నుంచి 46 ఏండ్లకు పెరగనుంది. నిరుద్యోగులు, యువకుల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. అయితే ఈ సడలింపు పోలీస్, ఎక్సైజ్, ఫైర్, అటవీ, జైళ్ల తదితర యునిఫాం సర్వీసులకు వర్తించబోదని తెలిపింది.





మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనమివ్వాలి

తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు

నవతెలంగాణ-ఆమనగల్

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలోని విద్యావనరుల కేంద్రంలో సోమవారం మధ్యాహ్న భోజన కార్మికుల ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో అందరూ



భాగస్వాములై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేట్ స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం-2022 చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించి, వంటకు సరిపోయే సిలిండర్లు, సరుకుల కొనుగోలుకు సబ్సిడీ రుణాలు అందజేయా లన్నారు. రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు అరికట్టాలన్నారు. వంట షెడ్లు, వంట పాత్రలు, కాటన్ దుస్తులు, సామాజిక భద్రతతో పాటు ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు స్వప్న, రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, ప్రజాసంఘాల నాయకులు కాస్గుల వెంకటయ్య, పిప్పళ్ల శివశంకర్, మండల అధ్యక్షులు పద్మ, గోజీ, లక్ష్మమ్మ, అలివేలు, ఆమనగల్, కడ్తాల్ మండలాల మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమను ఆదుకోవాలి : ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వ్యవసాయానికి అనుబంధ రంగంగా ఉన్న పాడి పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలని మండలిలో ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.సోమవారం శాసన మండలిలో ప్రత్యేక ప్రస్తావన సందర్భంలో ఆయన ఈ అంశంపై మాట్లాడారు.గత ప్రభుత్వం లీటరుకు రూ. 4 చొప్పున రైతులకు ఇవ్వాల్సిన ప్రోత్సాహాన్ని చెల్లించలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల పాడి రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఆ పరిశ్రమకు ఉచిత విద్యుత్ సౌకర్యం కూడా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

విమానాశ్రయంలో ప్రొటోకాల్ సమస్య..: తాతా మధు

ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్సీలకు ప్రొటోకాల్ అమలు కావటం లేదని బీఆర్ఎస్ సభ్యుడు తాతా మధు సభ దృష్టికి తీసుకొచ్చారు. జీఎంఆర్‌వారే ఆ ప్రొటోకాల్ ఇచ్చేటట్టుగా ఆదేశించాలని కోరారు. అలాగే పాలేరు రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గిందనీ, దీంతో తాగు, సాగునీటికి సమస్య వాటిల్లే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

బీసీ ప్రస్తావన ఏది? : ఎగ్గె మల్లేశ్

బీసీ బంధు, బీసీలకు ఆర్థిక సాయం తదితర అంశాలపై బడ్జెట్‌లో లేదనీ, వాటిని ఇప్పుడిస్తున్నారా? లేదా? స్పష్టం చేయాలని ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశ్ ప్రభుత్వాన్ని కోరారు. గొర్రెల పంపిణీ, కుల గణనపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. వీటిపై మంత్రి దామోదర రాజనర్సింహా సమాధానమిస్తూ సభ్యులడిగిన విషయాలను సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు.

హరీశ్ కాంగ్రెస్‌లోకి వస్తే దేవాదాయశాఖ ఇస్తాం

- కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు 25 మంది ఎమ్మెల్యేలతో కాంగ్రెస్‌పార్టీలోకి వస్తే, ఆయన్ని దేవాదాయశాఖకు మంత్రిని చేస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'రైట్ పర్సన్ ఇన్ రాంగ్ పార్టీ' అని హరీశ్‌రావును ఉద్దేశించి అన్నారు. బీఆర్ఎస్‌లో ఉంటే హరీశ్‌రావుకు ఎలాంటి ప్రయోజనం లేదనీ, ఆయన కాంగ్రెస్‌లోకి వస్తే తీసుకుంటామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన పాపాలు కడుక్కోవడానికి

ఆయనకీ మంత్రి పదవి ఉపయోగపడుతుందని అన్నారు. తాము బీఆర్ఎస్‌కు చెందిన హరీశ్‌రావు, కడియం శ్రీహరిలా జీ హుజూర్ బ్యాచ్ కాదనీ, పదవుల కోసం పాకులాడబోమన్నారు. తామెప్పుడూ ప్రజల కోసం, ప్రజల మధ్యే ఉండేవాళ్లమనీ, తెలంగాణ ఉద్యమ సమయంలో పదవులను వదులుకున్నామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ దిగజారిన రాజకీయాలు మానుకోవాలనీ, వారు కాంగ్రెస్ పార్టీలో చీలిక తీసుకురావాలని చూస్తున్నారని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా లేకుండా చేసి, అప్పటి సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని నాశనం చేశారని విమర్శించారు. తెలంగాణను పునర్నిర్మించుకొనే బాధ్యత ఇప్పుడు కాంగ్రెస్ భుజస్కంధాలపై ఉందన్నారు. నల్గొండలో బీఆర్ఎస్ సభకు జనం వచ్చే అవకాశమే లేదని, అది అట్టర్ ఫ్లాప్ అవుతుందని జోస్యం చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు దమ్ముంటే పార్టీని నడపాలని సవాలు విసిరారు.

అసెంబ్లీలో చర్చించాక జీవో 46 రద్దుపై నిర్ణయం :సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీలో చర్చించిన తర్వాతే జీవో నెం.46 రద్దుపై నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. సాధ్యాసాధ్యాలపై సోమవారం హైదరాబాద్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తయిన పోస్టులతో పాటు, కొత్త పోస్టుల నోటిఫికేషన్‌పై ముందుకెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలపై సీఎంకు అధికారులు పలు సూచనలు చేశారు. గత ప్రభుత్వం 2022 మార్చిలో పోలీసు నియామకాలకు నోటిఫికేషన్ చేసింది. ఈ నోటిఫికేషన్ కు సంబంధించి 15,750 పోస్టులకు 2023 అక్టోబర్ 4న ఎంపిక ప్రక్రియ పూర్తయింది. కోర్టు కేసుతో నియామకాలు పెండింగ్‌లో ఉండగా, ఇటీవల ఎంపిక ప్రక్రియ పూర్తయిన పోస్టులకు నియామక పత్రాలు అందించవచ్చని హైకోర్టు తీర్పు నిచ్చిం ది. ఈ నేపథ్యంలో ఎంపిక ప్రక్రియ పూర్తయిన 15,750 పోస్టులకు నియామక పత్రాలు అందించడం తప్ప వేరే మార్గం లేదని అడ్వకేట్ జనరల్, అధికారులు. సీఎంకు సూచించారు. కొత్త నోటిఫికేషన్లకు జీవో 46 వర్తింపజేయకుండా సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని వారు సీఎంకు సూచించారు.

ఇండ్లను కూల్చివేయడం ఫ్యాషన్‌గా మారింది !

- స్థానిక సంస్థల అధికారులపై కోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : బుల్డోజర్లతో అక్రమంగా ఇళ్లను కూల్చివేయడం ఈ మధ్య ఫ్యాషన్‌గా మారిందంటూ మధ్యప్రదేశ్ హైకోర్టు వ్యాఖ్యానించింది. అక్రమ ఇళ్ల కూల్చివేతకు సంబంధించిన కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేస్తూ సంబంధిత మున్సిపల్ అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించింది. పిటిషనర్‌కు నష్టపరిహారంగా లక్షరూపాయిలు చెల్లించాలని తీర్పు ఇచ్చింది. ఉజ్జయిని మున్సిపల్ కార్పొరేషన్ (యుఎంసి) అనుసరించాల్సిన విధి విధానాలను సక్రమంగా అనుసరించకుండానే తన ఇళ్లను కూల్చివేసిందని, ఇందుకు తనకు నష్టపరిహారం ఇప్పించాలంటూ పిటిషనర్ రాధా లాంగ్రీ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన జస్టిస్ వివేక్ రూయిసా తీర్పునిస్తూ, చట్టప్రకారం ఇళ్లకూల్చివేతకు అనుసరించాల్సిన పద్ధతులేవీ చేపట్టకుండానే ఇళ్లను కూల్చివేయడమనేది స్థానిక యంత్రాంగానికి, స్థానిక సంస్థలకు ఒక ఫ్యాషన్‌గా మారిందని వ్యాఖ్యానించింది. ఈ విషయం అనేకసార్లు కోర్టు దృష్టికి వచ్చిందని చెప్పారు.

తెలంగాణ యువత పొట్టగొట్టొద్దు.. : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారికి ఉద్యోగాలిచ్చి తెలంగాణ యువత పొట్టగొట్టొద్దని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కారుణ్య నియామకం కింద ఆంధ్రాకు చెందిన వ్యక్తిని మున్సిపల్ శాఖలో నియమించటాన్ని ఆమె సోమవారం శాసనమండలిలో తప్పుబట్టారు. ఈ మేరకు సభలో వాయిదా తీర్మానమిచ్చారు. దీంతోపాటు గంజాయి అక్రమ రవాణా అంశంపై కూడా కవిత మండలిలో మాట్లాడారు.

భారీ ఎత్తున అదనపు ఎస్పీలు, డీఎస్పీల బదిలీలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి -హైదరాబాద్

రాష్ట్రంలో భారీ ఎత్తున అదనపు ఎస్పీలు, డీఎస్పీలను బదిలీ చేస్తూ సోమవారం అర్ధరాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 39మంది అదనపు ఎస్పీలు, 110 మంది డీఎస్పీలు బదిలీ అయినవారిలో ఉన్నారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ బదిలీల పరంపర కొనసాగుతున్నట్టు తెలిసింది. ఈ విధంగానే ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐల బదిలీలను కూడా త్వరలో చేయబోతున్నట్టు సమాచారం.

పారిశ్రామిక గ్రామీణ బంద్‌కు మద్దతు : ఐద్వా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద, ప్రజావ్యతిరేక కార్పొరేట్ విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరగనున్న పారిశ్రామిక, గ్రామీణ బంద్‌కు అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మద్దతు ప్రకటిస్తున్నదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వ రంగసంస్థలను కారుచౌకగా ప్రయివేటుపరం చేస్తున్నదని పేర్కొన్నారు. ఎల్ఐసీ, జీఐసీ, బ్యాంకులు, సింగరేణి, రైల్వేలన్నింటిని అమ్ముతున్నదని విమర్శించారు. పెట్రోల్ ఉత్పత్తులపైన 34శాతం పన్నులు పెంచటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పని ప్రదేశాల్లో మహిళల రక్షణకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రభుత్వం విస్మరిస్తున్నదని పేర్కొన్నారు.

సేవాలాల్ జయంతోత్సవాల పోస్టర్ అవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బంజారాల ఆరాధ్యుడు, గొప్ప సంఘసంస్కర్త, పోరాటయోధుడు సేవాలాల్ జయంతోత్సవాలను గురువారం నుంచి ఈనెల 20 వరకు నిర్వహించనున్నామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంబంధిత పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు కళ్యాణ్ నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు ఆర్ పాండు నాయక్, ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరాం నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండు నెల్లు గడుస్తున్నా ఇంతవరకు గిరిజన శాఖ మంత్రిని నియమించకుండా కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. ఏడాది కాలంగా గిరిజన సంక్షేమ శాఖలో అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని చెప్పారు. ఆ శాఖ మంత్రి లేకుండా ఇప్పటివరకు సేవాలాల్ జయంతి జరగలేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తండాలు, గిరిజన కాలేజీలు, హాస్టళ్లలో ఆయన జయంతోత్సవాలు జరగనున్నాయనీ, ప్రభుత్వం ఆ రోజును సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రస్థాయిలో సేవాలాల్ ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. వాటి నిర్వహణకు రూ.20 కోట్లు విడుదల చేస్తూ తక్షణం జీవో జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వమే అధికారికంగా బంజారా భవన్‌లో జయంతోత్సవాలను నిర్వహించాలని డిమాండ్ చేశారు.

మురళీధర్ రాజీనామాకు ఆమోదం

- కొత్త ప్రతిపాదనకు ఆదేశం ..
- సర్కారు జీవో జారీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర సాగునీరు ఆయకట్టు అభివృద్ధి శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి. మురళీధర్‌రావు చేసిన రాజీనామాను సర్కారు ఆమోదించింది. ఈమేరకు సోమవారం ఆ శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీచేశారు. అలాగే ఈఎన్సీ జనరల్ పోస్టు నియామకానికి కొత్త ప్రతిపాదన పంపాలని ఈఎన్సీ(పరిపాలన) అనిల్‌కుమార్ కు జీవో ద్వారా ఆదేశాలు ఇచ్చారు. వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఈఎన్సీ జనరల్ పోస్టు భర్తీకి మరింత సమయం పట్టే అవకాశముందని ఆ శాఖ అధికారవర్గాలు చెప్పాయి.

ఏపీ, కర్ణాటక నీటి చౌర్యాన్ని సమిష్టిగా అడ్డుకుందాం

- అనుమతి లేకుండా నిర్మిస్తున్న ప్రాజెక్టులపై వాస్తవాలు చెప్పాలి : ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కృష్ణా బేసిన్లో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నీటి చౌర్యాన్ని అడ్డుకునేందుకు అన్ని పార్టీలు కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరముందని ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్(కేఆర్ఎంబీ) పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులపై సోమవారం అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఏపీ నిర్మిస్తున్న రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్, కర్ణాటక తుంగభద్రమీద కడుతున్న ప్రాజెక్టులను అడ్డుకోకుంటే తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసిన సమయాల్లోనే నీటి పంచాయతీలు జరుగుతున్నాయనీ, వర్షాభావ పరిస్థితుల్లో తెలంగాణకు చుక్క నీరు రాదని వాపోయారు.గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యూనల్ (కేడబ్ల్యూడీటీ)లో బలమైన వాదనలు వినిపించి రెండు రాష్ట్రాలు అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టులను అడ్డుకోవడంతో పాటు రాష్ట్రానికి రావాల్సిన వాటాను దక్కించుకోవాలని సూచించారు. సాగునీటి విస్తీర్ణం, జనాభా, పరివాహక ప్రాంతం తదితర అంశాల ప్రకారం పంపకాలు జరగాలన్నారు. కృష్ణా బేసిన్లో 16, గోదావరి బేసిన్లో 10 అనుమతులు, నీటి కేటాయింపులు లేకుండా నిర్మిస్తున్న ప్రాజెక్ట్‌లకు సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) అభ్యంతరం చెప్పిందని గుర్తు చేశారు.

'గురుకుల' ఆత్మహత్యలపై అసెంబ్లీలో చర్చించాలి

- వరుస ఘటనలపై సీఎం స్పందించాలి: డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్ వద్ద ధర్నా



నవతెలంగాణ-బంజారాహిల్స్

వసతి గృహాల్లో విద్యార్థినుల వరుస ఆత్మహత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాల ని, అసెంబ్లీలో చర్చించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ డిమాం డ్ చేశారు. హైదరాబాద్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్ వద్ద సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగానే విద్యాసంస్థ ల్లో చదువుతున్న 60 లక్షల మంది పేద విద్యా ర్థులు బాల్యంలోనే సమాధులయ్యే పరిస్థితి ఏర్ప డిందన్నారు. విద్యార్థినుల వరుస ఆత్మహత్యల పై సీఎం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిం చారు. మృతుల తల్లిదండ్రులు రోడ్డుపై బైటా యించి ధర్నా చేస్తున్నా ప్రభుత్వ స్పందించక పోవడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు మంత్రులను నియమించి, విద్యార్థినుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషి యా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమండ్ చేశారు. ఆధిపత్య వర్గాల పిల్లలు చదివే అంత ర్జాతీయ స్థాయి పాఠశాలల్లో వందమంది విద్యా ర్థులకు ఒక సైకాలజిస్టు ఉంటారని.. పేద విద్యార్థులు చదివే విద్యాలయాల్లో కౌన్సెలర్లను ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించారు. గురుకులాలు జైలుకన్నా దారుణంగా తయార య్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభు త్వ హయాంలో విద్యార్థులకు మెస్‌చార్జీలు పెం చుతామన్న హామీ ప్రకటనలకే పరిమితమైంద ని.. కొత్త ప్రభుత్వమూ అలాగే మోసం చేస్తోంద న్నారు. గురుకులాల ఉద్యోగులకు వేతనాలు రాక పోవడం శోచనీయమన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖలకు మంత్రులను ఎం దుకు కేటాయించలేదని ప్రశ్నించారు. డబ్బున్న శాఖలకే మంత్రులను కేటాయిస్తారా అని నిలదీ శారు.ప్రభుత్వం ఆరు గ్యారంటీల హామీల కంటే సంక్షేమ గురుకులాల్లో చదివే పేద బిడ్డల ప్రాణాలకు గ్యారంటీ ఇవ్వాలని కోరారు. రాష్ట్రం లో విద్యార్థినుల వరుస ఆత్మహత్యలపై ప్రభు త్వం సమగ్ర విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎంవీఎఫ్ జాతీయ కన్వీనర్ ఆర్. వెంకట్‌రెడ్డి మాట్లాడు తూ..విద్యార్థినుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హతలుగానే భావించాలన్నారు. సంక్షేమ గురు కులాలు, వసతి గృహాలపై ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న బడ్జెట్, ఖర్చు చేస్తున్న నిధులపై సోషల్ ఆడిట్ జరపాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ ఆర్య, నాయకులు రుద్రవరం సునీల్, చరణ్ దాస్, లింగం, ప్రవీణ్ పాల్గొన్నారు.

అలరించిన కల్చరల్ ఫెస్టివల్ ..

హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో రవీంధ్రభారతిలో నిర్వహణ

నవతెలంగాణ-హైదరాబాద్



హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి మెయిన్ హాల్లో కల్చరల్ ఫెస్ట్ 2024 ప్రేక్షకులను అలరించింది. ఈ కల్చరల్ ఫెస్ట్ లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ హైదరాబాదు సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించేలా హైదరాబాద్ జిందాబాద్ నిర్వహించిన ఈ కల్చరల్ ఫెస్ట్ అభినందనీయమన్నారు. గత ఐదు సంవత్సరాలుగా హైదరాబాద్ జిందాబాద్ ప్రతి సంవత్సరం కల్చరల్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నదని అదే ఒరవడిలో ఈ సంవత్సరం హైదరాబాద్ సంస్కృతిపై నిర్వహించటం సంతోషకరమని అన్నారు. ఈ కల్చరల్ ఫెస్ట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించామని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కళా రూపాల ప్రదర్శనకు మా సహకారం తప్పకుండా ఉంటుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం సాంస్కృతీ రంగ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉన్నదని అన్నారు. ఈ కల్చరల్ ఫెస్టివల్ లో ఖవ్వాలి, గజల్స్, దేశభక్తి, మత మతసామరస్యం ప్రబోధించే కళారూపాల తో పాటు కేరళ సాంప్రదాయ నృత్యం, పేరడీ గురుస్వామి, మెజీషియన్ చొక్కాపు వెంకటరమణ, మిమిక్రీ కళాకారుడు మల్లం రమేష్ లాంటి ప్రముఖ కళాకారుల కళారూపాలు ప్రదర్శించటం అభినందనీయమని అన్నారు.

హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి వీరయ్య మాట్లాడుతూ హైదరాబాద్ జిందాబాద్ పర్యావరణ సమస్యలపై ప్రముఖ పర్యావరణవేత్తలతో కలిసి గత 8 సంవత్సరాలుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని అన్నారు. పర్యావరణం పై అవగాహన కల్పించేలా విజ్ఞానదాయకమైన ఎగ్జిబిషన్ ను రూపొందించి, అనేక విద్యాసంస్థలలో, కాలనీలలో ప్రచారాన్ని నిర్వహిస్తున్నదని చెప్పరు. పేదలకు వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో హైదరాబాద్ జిందాబాద్ బాధ్యతగా నగరంలో వివిధ ప్రాంతాల్లో మెగా మెడికల్ క్యాంపులను నిర్వహించి, ఉచిత వైద్య సేవలందిస్తున్నని అన్నారు. హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో ఉచిత బిపి - షుగర్ వైద్య శిబిరాన్ని గత 88 నెలలుగా నిరంత రాయంగా నిర్వహిస్తున్నదని అన్నారు.



కల్చరల్ ఫెస్టివల్‌కు గౌరవ అతి థులుగా సీనియర్ మూవీ నటులు ఘర్షణ శ్రీనివాస్, టిఎస్ఆర్టిసి డివిజనల్ మేనేజర్ కిరణ్ రెడ్డి, ఎల్ఐసి ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. కల్చరల్ ఫెస్ట్ కు వ్యాఖ్యాత, సమన్వయకర్తగా కళా రత్న మల్లం రమేష్, ఆర్. సైదులు వ్యవహరించారు. ఈ కల్చరల్ ఫెస్టివల్ లో 16 రకాల కళా ప్రదర్శనలు, 170 మంది కళాకారులు ప్రదర్శించారు.

బిజినెస్

పేటియంపై చర్యలను వెనక్కి తీసుకోలేం..!

- వారంలోనే తదుపరి నిర్ణయాలు : స్పష్టం చేసిన ఆర్‌బీఐ గవర్నర్



ముంబయి : పేటియం పేమెంట్ బ్యాంక్‌పై చర్యలు కొనసాగుతాయని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. పేటియంపై ఆర్‌బీఐ నియంత్రణ చర్యల్ని సమీక్షించేది లేదని తెలిపారు. ఫిబ్రవరి 29 నుంచి పేటియం పేమెంట్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్) డిపాజిట్లు సేకరించకూడదని, రుణాలు జారీ చేయరాదని ఆర్‌బీఐ ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. వినియోగదారుల ఖాతాలు, ప్రీ పెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్‌లు, వాలెట్‌లు, ఫాస్టాట్యాగ్‌లు, నేషనల్ కామన్ మొబిలిటీ (ఎన్‌సీఎంసీ) కార్డులు తదితరాల్లో క్రెడిట్ లావాదేవీలు లేదా టాప్‌అప్‌లు చేయకూడాదని స్పష్టం చేసింది. ఈ దెబ్బతో పేటియం షేర్లు పాతాలానికి పడిపోతున్నాయి. మరోవైపు పేటియం ఖాతాదారులు సగానికి పైగా జారి పోయారు. ఇతర చెల్లింపు వేదికలను ఆశ్రయిస్తున్నారు.

పీపీబీఎల్‌పై ఆంక్షల నేపథ్యంలో శనివారం రిజర్వ్ బ్యాంక్ సెంట్రల్ బోర్డు 606వ సమావేశంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. దీనికి శక్తికాంత దాస్ హాజరయ్యారు. భేటీ వివరాలను శక్తికాంత దాస్ మీడియాకు వెల్లడించారు. పిన్‌టెక్ సంస్థలపై క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఆర్‌బిఐ చర్యలకు దిగుతుందని అన్నారు. తమ రెగ్యులేటరీ సంస్థ ఫిన్‌టెక్ సంస్థలకు మద్దతునిస్తూనే.. ఖాతాదారుల ప్రయోజనాలకు కూడా పెద్దపీట వేస్తుందన్నారు. పేటియం విషయంలో తీసుకున్న నిర్ణయాలు, చర్యలను ఎప్పటికప్పుడూ వెల్లడిస్తామని శక్తికాంత తెలిపారు. ఈ వారంలో ఎఫ్ఎక్యు (తరుచుగా ఎదురయ్యే ప్రశ్నల)లపై వివరణలు జారీ చేస్తామన్నారు. అప్పటి వరకు అందరూ వేచి చూడాలని సూచించారు. పేటియం తీవ్ర నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిందని.. అనేక సార్లు సమయం ఇచ్చామని ఇది వరకు ఆర్‌బీఐ గవర్నర్ పేర్కొన్న విషయం తెలిసిందే. సరిదిద్దుకోవడానికి అవకాశాలు ఇచ్చిన ఉపయోగించుకోలేదన్నారు. పేటియం కెవైసి లేకున్నా అనేక ఖాతాలు ఇచ్చిందని.. ఒకే పాన్ కార్డ్‌పై వందలాది ఖాతాలను తెరిచిందని.. మనీలాండరింగ్ కూడా జరిగిందని ఆర్‌బిఐ వర్గాలు ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. "రిజర్వ్ బ్యాంక్ సంస్థలపై చర్యలు తీసుకునే ముందు చేసిన తప్పుల్ని సరిదిద్దుకునేందుకు తగినంత సమయం ఇస్తుంది. కొన్నిసార్లు ఇది తగినంత సమయం కంటే ఎక్కువగా ఉంటుంది. సంస్థల పట్ల మేం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాం. ఆర్‌బిఐ ఆదేశాల్ని తప్పకుండా పాటిస్తే ఆయా సంస్థలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉండదు." శక్తికాంత దాస్ పేర్కొన్నారు.

డైరెక్టర్ మంజూ గుడ్‌బై..

పేటియం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్‌కు స్వతంత్ర డైరెక్టర్ మంజూ అగర్వాల్ రాజీనామా చేశారు. దీన్ని ఆ సంస్థ ధృవీకరించింది. ఇంతక్రితం ఆమె వైదొలిగినట్టు వార్తలు వచ్చాయి. సోమవారం పేటియం సూచీ 0.73 శాతం పతనమై.. రూ.416.80కి పడిపోగా.. గడిచిన నెల రోజుల్లో ఏకంగా 41.64 శాతం లేదా రూ.297 పతనమైంది. దీంతో ఇన్వెస్టర్లు లబోదిబో మంటున్నారు.

సైస్‌జెట్‌లో 15శాతం మంది ఉద్యోగులపై వేటు..!



న్యూఢిల్లీ : పొదుపు చర్యల్లో భాగంగా విమానయాన సంస్థ స్పైస్‌జెట్ భారీగా ఉద్యోగులను తొలగించడానికి కసరత్తు చేస్తోంది. గత కొద్ది నెలలుగా ఉద్యోగులకు వేతనాల చెల్లింపుల్లో జాప్యం, ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో నిర్వహణ వ్యయాలను తగ్గించుకోవాలని భావిస్తోన్నట్లు రిపోర్టులు వస్తున్నాయి. స్పైస్‌జెట్‌లో ప్రస్తుతం దాదాపు 9000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. 30 విమానాలను నిర్వహిస్తుంది. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా ఉద్యోగులను తొలగించక తప్పడం లేదని స్పైస్‌జెట్ వర్గాలు తెలిపాయి. ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన నేపథ్యంలో దాదాపు 1,350 మందిని తీసివేయనుంది. ఇది మొత్తం సిబ్బందిలో 15 శాతానికి సమానం. జనవరి నెల వేతనం ఇప్పటికీ కొంతమందికి చెల్లించలేదని తెలుస్తోంది. ఇటీవల అమెజాన్, అల్ఫాబెట్, మైక్రోసాఫ్ట్, స్నాప్‌చాట్, ఈబే తదితర సంస్థలు భారీగా ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే.

సిస్కోలోనూ ఉద్వాసన

అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం సిస్కో భారీగా కొలువుల కోతకు సిద్ధం అయ్యింది. వచ్చే వారం నుంచి వేలాది మంది ఉద్యోగులపై సిస్కో వేటు వేయనుందని సమాచారం. ఫిబ్రవరి 14న పూర్తి వివరాలు వెల్లడించే అవకాశాలున్నాయి. సిస్కోలో ప్రపంచ వ్యాప్తంగా 84,900 మంది పని చేస్తున్నారు. 2022 నవంబర్‌లో దాదాపు 5 శాతం ఉద్యోగులను తొలగించింది. కాగా.. ఈ ఏడాది ఎంత మందికి ఉద్వాసన పలకనుందో వేచి చూడాలి.

తగ్గిన ద్రవ్యోల్బణం సూచీ

న్యూఢిల్లీ : ప్రస్తుతేడాది జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ (సీపీఐ) 5.10 శాతానికి తగ్గిందని నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీసు (ఎన్ఎస్ఓ) తెలిపింది. ఇది మూడు నెలల కనిష్ఠ స్థాయి అని పేర్కొంది. ఇంతక్రితం డిసెంబర్‌లో సీపీఐ 5.7 శాతంగా చోటు చేసుకుంది. జనవరిలో గ్రామీణ ప్రాంతాల్లో సీపీఐ 5.34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 4.92 శాతంగా నమోదయ్యింది.

అమెజాన్‌లో జెఫ్ బెజోస్ రూ.17వేల కోట్ల షేర్ల విక్రయం..!

న్యూయార్క్ : దాదాపు 8.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.70,000 కోట్ల)కు పైగా విలువైన 5 కోట్ల అమెజాన్ షేర్లను విక్రయించాలని అమెజాన్ సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మెన్ జెఫ్ బెజోస్ యోచిస్తున్నారని సమాచారం. అమెజాన్ వ్యవస్థాపకులైన బెజోస్ ఆ సంస్థ సీఈఓ పదవి నుంచి 2021లో తప్పుకుని ఇతర ప్రాజెక్టులు పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల 7,9 తేదిల్లో జెఫ్ బెజోస్ 1.2 కోట్ల అమెజాన్ షేర్లను విక్రయించారు. వీటి విలువ దాదాపు 2.04 బిలియన్ డాలర్లు(సుమారు రూ.17వేలకోట్లు)గా అంచనా వేశారు.

సాగునీటిశాఖలో ఈ ఏడాది
56 మంది ఉద్యోగ విరమణ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర సాగునీరు,అభివృద్ధి, ఆయకట్టు శాఖలో 2024 సంవత్సరంలో 56 మంది ఇంజినీర్లు ఉద్యోగ విరమణ చేయనున్నారు. వీరంతా ఆయా హోదాల్లో పనిచేస్తున్నవారే కావడం గమనార్హం. ఈ మేరకు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా సోమవారం జీవో నెంబరు 15 జారీ చేశారు. ఉద్యోగ విరమణ చేస్తున్నవారిలో ఈఎన్సీ ఒకరు కాగా, సీఈలు నలుగురు, ఎస్ఈలు 22 మంది, ఈఈలు 19 మంది, డీఈలు 10 మంది ఉన్నారు. నిబంధనల ప్రకారం ప్రతియేటా ఆయా శాఖల నుంచి ఉద్యోగవిరమణ చేసే వారి వివరాలను ప్రకటించాల్సి ఉంది. ఈమేరకు సర్కారు ఆదేశాలిచ్చింది. ఈఎన్సీ(జనరల్) పోస్టు కోసం ప్రయత్నం చేస్తున్న బి.నాగేందర్ రావు సైతం ఈ సంవత్సరం మే 31న ఉద్యోగవిరమణ చేస్తున్న విషయం విదితమే.

ఆదినారాయణకు పలువురి నివాళులు



నవతెలంగాణ-ఓయూ

జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ప్రొ.ఆదినారాయణ ఆదివారం కన్నుమూసిన సంగతి తెలిసిందే. సోమవారం హైదరాబాద్ తార్నాక కిమితి కాలనీలో ఆదినారాయణ నివాసంలో ఆయన మృతదేహానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు, హైదరాబాద్ సెంట్రల్ సిటీ సెక్రటరీ ఎం.శ్రీనివాస్ నివాళ్లర్పించారు. నిమ్స్ మాజీ డైరెక్టర్ డా.ప్రసాద రావు, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డా.కోయ వెంకటేశ్వరరావు, రాష్ట్ర ట్రెజరర్ రావుల వరప్రసాద్, రాష్ట్ర నేత బి.జగన్మోహన్‌రావు, చెకుముఖి కన్వీనర్ రాజా, జేవీవీ హైదరాబాద్ సిటీ కమిటీ జనరల్ సెక్రటరీ ఎస్‌పి.లింగస్వామి కూడా నివాళులర్పించారు.

ముఖం లేకనే కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు

- పీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డితో చేసుకున్న లోపాయికారి ఒప్పందంతోనే కృష్ణా జలాలను ఏపీకి మళ్లించారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ ఆరోపించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో బహిర్గతం చేస్తుందన్న ఆవేదనతో ముఖం లేకనే సభకు రావడం లేదని సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ సాక్షాత్తు ఏపీ అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేశారు. జగన్ చెప్పినా, కేసీఆర్, హరీశ్‌రావుకు బుద్ధి రావడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల భూగర్భ జలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానానికి హరీశ్‌రావు ఆమోదం తెలపకుండా సీఎం రేవంత్‌పై విమర్శలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

సీఎం, మంత్రులను హరీశ్
ఒంటి చేత్తో ఎదుర్కొన్నారు

- ఎక్స్ వేదికగా కేటీఆర్ పొగడ్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ మంత్రి హరీశ్ రావుపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రశంశల వర్షం కురిపించారు. తెలంగాణ అసెంబ్లీలో కృష్ణా, కేఆర్ఎంబీ అంశాలపై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులను ఒంటి చేత్తో ఎదుర్కొన్నారని చెప్పారు. కృష్ణా జలాలు, కేఆర్ఎంబీకి సంబంధించి కాంగ్రెస్ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తన అద్భుత ప్రసంగంతో తిప్పికొట్టారని పేర్కొన్నారు. మంగళవారం జరగనున్న చలో నల్లగొండ సభకు సరైన గొంతును సెట్ చేశారన్నారు. కృష్ణా జలాలపై వాస్తవాలను కేసీఆర్ తనదైన శైలిలో ఎండగడుతారని చెప్పారు.

మారుతి సుజుకి ఎగిరే కార్ వస్తోంది..!



న్యూఢిల్లీ : మారుతి సుజుకి కొత్తగా ఎగిరే కార్లను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది. జపాన్‌కు చెందిన మాతృసంస్థ సుజుకితో కలిసి 'ఎలక్ట్రిక్ ఎయిర్ కాప్టర్లు' డెవలప్ చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పేర్కొంది. దీనిలో పైలట్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చని సమాచారం. డ్రోన్ల కంటే పెద్దగా, సంప్రదాయ హెలికాప్టర్ల కంటే చిన్నగా ఉండే ఈ చాప్టర్లకు మారుతి సుజుకి స్కై డ్రైవ్ పేరును పెట్టనుంది. 1.4 టన్నుల తేలికపాటి బరువు ఉండటంతో ఇళ్లపైనా కూడా వీటిని ల్యాండింగ్, టేకాఫ్ చేయవచ్చని తెలిపింది. రోడ్డు మార్గంలో ఉబెర్, ఓలా క్యాబ్ సర్వీసుల మాదిరిగానే మారుతి సుజుకి ఈ చాప్టర్లను ఎయిర్ టాక్సీలుగా వినియోగించాలని భావిస్తోన్నామని సుజుకి మోటార్ గ్లోబల్ ఆటోమొబైల్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ మేనేజర్ కెంటో ఒగురా పేర్కొన్నారు. ఈ ప్రక్రియ విజయవంతమైతే ప్రజా రవాణాలో విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు. భారత్‌లో వినియోగానికి గల అవకాశాలు, వాస్తవిక పరిస్థితులను అధ్యయనం చేసేందుకు అనుమతించాలని కోరుతూ విమానయాన రంగ నియంత్రణ సంస్థ డిజిసిఎతో సంప్రదింపులు చేస్తున్నామని ఒగురా తెలిపారు.

మోడీ 3.0 వెనుక..?

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగిస్తూ వచ్చింది. 2014, 2019 ఎన్నికల్లో రామ మందిర అంశాన్ని ఆ పార్టీ లేవనెత్తింది. అయోధ్యలో రామ మందిర నిర్మాణం పూర్తి కావటంతో బీజేపీ హిందూత్వ సిద్ధాంతం కాస్త బీటలు వారొచ్చనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమైంది. అయితే, బీజేపీలోని కీలక నాయకులు మాత్రం.. అయోధ్య పూర్తయినా కాశీ, మధురాలు ఇంకా మిగిలే ఉన్నాయని అంటున్నారు. దీంతో ఏ రకంగానైనా హిందూత్వ అజెండాతోనే రాజకీయాలు చేయాలనీ, రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ దీనిని వాడాలని ఆ పార్టీ యోచిస్తున్నట్టు కాషాయపార్టీ నేతల మాటలను చూస్తే అర్థమవుతున్నది.

ఇటు 17వ లోక్‌సభ శనివారంతో ముగిసింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించటంపై అధికార బీజేపీ విశ్వాసం వ్యక్తం చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ మెరుగైన మెజారిటీతో విజయం సాధిస్తుందని ప్రధాని మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు. 370 సీట్లను సాధిస్తుందని పరోక్షంగా చెప్పారు. "మా మూడో దఫా చాలా పెద్ద నిర్ణయాలకు సాక్ష్యంగా ఉంటుంది. రాబోయే 1,000 సంవత్సరాలకు బలమైన పునాది వేస్తుంది" అని మోడీ సభలో చెప్పారు.

'హిందూత్వ', యూసీసీ వంటి పలు సున్నితమైన, వివాదాస్పద, భావోద్వేగ అంశాలను ఆధారంగా చేసుకొనే ఆయన ఇలాంటి కీలక వ్యాఖ్యలు చేశారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇలాంటి అంశాలను వాడుకొని అధికారంలోకి రావటం ఆ పార్టీకి అలవాటనీ చెప్తున్నారు. 2019లో సార్వత్రిక ఎన్నికలకు ముందు 'పుల్వామా దాడి' ఘటన ఆ పార్టీకి రాజకీయంగా చాలా లబ్దిని చేకూర్చిందనీ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 300కు పైగా స్థానాలు దక్కేలా చేసిందని అంటున్నారు. ఈ సారి కూడా హిందూత్వ, జాతీయవాదం వంటి అంశాలను ఆ పార్టీ మళ్లీ ఉపయోగించినా ఆశ్చర్యపోవాల్సినవసరం లేదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

హిందూత్వ సిద్ధాంతాన్ని బలంగా వినిపించే బీజేపీ నాయకుల్లో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఒకరు. ఆయన ఇటీవల ఆ రాష్ట్ర అసెంబ్లీలో 'అయోధ్య పూర్తయిందని, కాశీ, మథుర లు ఎదురు చూస్తున్నాయని' సర్వగర్వ వ్యాఖ్యలు చేశారు. కేంద్ర మంత్రుల స్థాయిలో ఉన్న పలువురు బీజేపీ నాయకులూ ఇవే వ్యాఖ్యలు చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

బీజేపీ కొన్ని సైద్ధాంతిక ప్రాజెక్టులు ఇప్పటికే కీలక దశకు చేరుకున్నాయి. 17వ లోక్‌సభలో తన సభ్యుల బలంతో ఆ పార్టీ పలు కీలక బిల్లులను ఆమోదింపజేసుకున్నది. ఇందులో ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్‌ను నేరంగా ప్రకటించటం, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వంటివి ఉన్నాయి. న్యాయస్థానం తీర్పుతో అయోధ్యలో రామ మందిర నిర్మాణం సాధ్యమైంది. ఇక లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను కల్పించే బిల్లు, వలస కాలం నాటి క్రిమినల్ చట్టాల స్థానంలో కొత్తవి తీసుకురావటం వంటివి చేసింది.

370 సీట్లతో తిరిగి అధికారంలోకి వచ్చి పెద్ద నిర్ణయాలు తీసుకుంటామని పార్లమెంటులో మోడీ చెప్పారు. అయితే, ఈ లోక్‌సభ ఎన్నికల్లో భావోద్వేగ అంశాలను వాడుకొని, ప్రజల్లో సెంటిమెంట్‌ను రగల్చే ప్రణాళికను బీజేపీ ఇప్పటికే సిద్ధం చేసుకున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కాశీ, మథుర సెంటిమెంట్, యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ), మత మార్పిడి నిరోధక చట్టం, జనాభా నియంత్రణ చట్టం వంటి వాటిని ఆ పార్టీ ఆయుధాలుగా వాడుకొనే అవకాశం ఉన్నదని అంచనా వేస్తున్నారు. ఒకవేళ ఆ పార్టీ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినా.. ఆరెస్సెస్ సిద్ధాంతాలను అమలు చేసే పనిలోనే ఉంటుందని చెప్తున్నారు.

డాక్టర్లపై సస్పెన్షన్ ఎత్తివేస్తామని మంత్రి హామీ..

- తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

కామారెడ్డి మెడికల్ కాలేజీలో డాక్టర్ల సస్పెన్షన్‌ను విచారణ నివేదిక రాగానే రద్దు చేస్తామని హామీ ఇవ్వడంపై తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ బొంగు రమేష్ , డాక్టర్ అజ్మీరా రంగ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రఘు, డాక్టర్ అబ్బయ్య హర్షం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి విన్నవించారు. అనంతరం కోఠిలోని డీఎంఈ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. ఎలుకలు, పిల్లుల నుంచి రోగులకు ఇబ్బంది రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత హౌసింగ్ కీపింగ్ వారిదని తెలిపారు. డాక్టర్లు వైద్యం మాత్రమే అందిస్తారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం సరైన మౌలిక సదుపాయాలు లేకుండా మెడికల్ కాలేజీలు ప్రారంభించిందనీ, ఇప్పటికీ కామారెడ్డి మెడికల్ కాలేజీలో నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ వసంత్ కుమార్ మాట్లాడుతూ తన సస్పెన్షన్ ఎత్తివేస్తామని మంత్రి హామీ ఇవ్వడం పట్ల మంత్రికి, తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎలుకలను వెతికే పని మాది కాదు

- తెలంగాణ కాంట్రాక్ట్ డాక్టర్స్ అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రోగులు డిశ్చార్జి అయ్యేంత వరకు చికిత్స అందించడమే తమ పని అని తెలంగాణ కాంట్రాక్ట్ డాక్టర్స్ అసోసియేషన్ తెలిపింది. ఈ మేరకు సోమవారం అసోసియేషన్ నాయకులు ఒక ప్రకటన విడుదల చేశారు. రోగులను కరవకుండా వార్డుల్లో ఎలుకలను వెతికే పని తమది కాదని తేల్చిచెప్పారు. ఐసీయూలో రోగిని ఎలుక కరిచిన ఘటనలో కామారెడ్డి ప్రభుత్వాస్పత్రి మెడికల్ ఆఫీసర్ ను సస్పెండ్ చేయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఐసీయూ ఉన్నదే రోగులను కాపాడటానికే తప్ప ఎలుకల మీద నిఘా పెట్టడానికి కాదని గుర్తుచేశారు.

జీతాలు రాక రాజీనామాలు

టీవీవీపీ ఐసీయూ కాంట్రాక్ట్ డాక్టర్లకు 10 నెలల నుంచి జీతాలు రాలేదని ఆ నాయకులు తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఇప్పటికే పలువురు రాజీనామా చేసినట్టు చెప్పారు. డీఎంఈ వైద్యులు, టీవీవీపీ వైద్యుల మధ్య మెరుగైన సమన్వయం అవసరమని సూచించారు. టీవీవీపీ ఐసీయూ డాక్టర్ల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

నెల రోజుల్లో గ్రీన్ ఛానల్ ద్వారా ఉపకారవేతనాలు

- టీ–జూడా ప్రతినిధులకు మంత్రి దామోదర హామీ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

నెల రోజుల్లో ఉపకార వేతనాల పంపిణీ ప్రక్రియను గ్రీన్ ఛానల్ ద్వారా ప్రారంభించనున్నట్టు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో మంత్రి దామోదరను కలిసిన టీ–జూడా ప్రతినిధులు ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెండింగ్ ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆర్థికశాఖ కార్యదర్శిని కోరారు. డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రాంకు సంబంధించి పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఎదుర్కొంటున్న హాస్టల్ సౌకర్యాలు తదితర విషయాలపై సమగ్ర నివేదకను రెండు రోజుల్లో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే ఉస్మానియా జనరల్ ఆస్పత్రి నూతన భవన నిర్మాణం కోసం శంకుస్థాపన చేయనున్నట్టు మంత్రి తెలిపారు.

పాలస్తీనా రచయితలకు అండగా నిలవండి

న్యూఢిల్లీ : పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సైనికులు సాగిస్తున్న మారణహోమంపై స్పందించాలని 600 మందికి పైగా రచయితలు, కవులు 'పెన్ అమెరికా' సంస్థను కోరారు. సాహితీవేత్తల భావ ప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించేందుకు ఈ సంస్థ కృషి చేస్తోంది. పాలస్తీనాలోని రచయితల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయని, వారికి స్వేచ్ఛ లేకుండా పోయిందని కవులు, సాహితీవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాలో పుస్తకాలను నిషేధించడంలో చూపిన తెగువ, ధైర్యాన్ని పాలస్తీనా ప్రజల విషయంలో కూడా చూపాలని వారు పెన్ అమెరికా సంస్థకు సూచించారు. పెన్ అమెరికా ఇకనైనా మౌనాన్ని వీడాలని, తనను తాను అభినందించుకునే వైఖరిని విడనాడాలని, జరుగుతున్న మారణహోమంపై వాస్తవ వైఖరిని ప్రదర్శించాలని వారు కోరారు. పాలస్తీనా రచయితలపై గత సంవత్సరం అక్టోబర్ 7వ తేదీ నుండి ఆంక్షలు కొనసాగుతున్నాయని, వారి కలాలకు కళ్లెం వేశారని తెలిపారు. వేధింపులకు గురవుతున్న రచయితలకు ఓ వేదికను కల్పించి, వారికి రక్షణగా నిలవలేని పక్షంలో పెన్ అమెరికాను రద్దు చేయాలని హితవు పలికారు.

పోలీసుల అణచివేత

- వారి తీరు భయభ్రాంతులకు గురి చేస్తున్నది
- అదుపులోకి తీసుకున్న తమవారిని విడుదల చేయాలి
- హల్ద్వానీలో ముస్లింల ఆందోళన

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో పోలీసుల వ్యవహార శైలిపై స్థానిక ముస్లింలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల అణచివేత తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నదని చెప్తున్నారు. ఈ నెల 8న హల్ద్వానీలో స్థానిక అధికార యంత్రాంగం ఒక మసీదు, మదర్సా కూల్చివేసిన ఘటన.. అక్కడ హింసాత్మక పరిస్థితులకు కారణమైన విషయం విదితమే. ఈ ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత పోలీసులు వ్యవహరించిన తీరు తమను ఆందోళనకు గురి చేసిందని ముస్లింలు చెప్తున్నారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆదేశాల మేరకే ఇదంతా జరుగుతున్నదని కొందరు ఆరోపిస్తున్నారు.కూల్చివేత తర్వాత ఫిబ్రవరి 8న స్థానిక ప్రజలు, పోలీసులు ఘర్షణ పడిన బన్‌భూల్‌పురా నివాసితులు మాట్లాడుతూ.. పోలీసు అధికారులు తమ ఇండ్లలోకి చొరబడి, మహిళలతో సహా కుటుంబ సభ్యులపై దాడి చేశారని ఆరోపించారు. ఆస్తులను ధ్వంసం చేసి, అనేక మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. "పోలీసు అధికారులు మా ఇంట్లోకి చొరబడ్డారు. వారు మా వస్తువులను చిందరవందర చేశారు. నా భర్తపై దాడి చేశారు. మమ్మల్ని కూడా నెట్టారు. వారు అతనిని తీసుకెళ్లారు. అతను ఎక్కడ ఉన్నాడో ఎలా ఉన్నాడో మాకు తెలియదు" అని స్థానిక పాఠశాలలో వంట చేసే షామా (38) అన్నారు. షామా భర్త నయీమ్(45) హల్ద్వానీలోని నిర్మాణ స్థలాలకు ఇసుకను రవాణా చేసే రోజువారీ కూలీ.

"నేను నా భర్తను కలవాలనుకుంటున్నాను. పోలీసు అధికారులు నా భర్తను తీసుకెళ్లారు. ఆయన లేకుంటే నేను చనిపోతాను" అని 22 ఏండ్ల మెహ్రీన్ చెప్పింది. ఆమె భర్త ఆరిఫ్(25)ను నలుగురు పోలీసు అధికారులు తీసుకెళ్లారని తెలిపింది. మెహ్రీన్, ఆరిఫ్‌లకు ఏడు నెలల క్రితమే వివాహమైంది.

అయితే, సాక్ష్యాధారాలు లేకుండా ఎవరిపైనా ఇలా ప్రవర్తించే ఉద్దేశం మాకు లేదని ఉత్తరాఖండ్ డీజీపీ అభినవ్ కుమార్ అన్నారు.పర్వీన్(30) అనే మహిళ మాట్లాడుతూ.. " నా భర్త ముకీమ్ రోజువారీ కూలీ. ఆయనను పోలీసు అధికారులు తీసుకెళ్లారు" అని చెప్పారు. షాహిద్(35) అనే కూరగాయల విక్రేతను కూడా పోలీసులు పట్టుకున్నారని ఆయన తల్లి వాపోయారు. ఫిబ్రవరి 8న పర్వీన్ బట్టలు ఆరేయటానికి వెళ్లాడనీ, ఆ సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. అదుపులోకి తీసుకున్న తమవారిని పోలీసులు.. వారిపై దాడులకు దిగారని పలువురు మహిళలు విలపించారు. పని చేసుకుంటే కానీ పూట గడవని తమ ఇండ్లలో.. మగవారే జీవనాధారమనీ, అలాంటి వారిని పోలీసులు ఉద్దేశపూర్వకంగానే అదుపులోకి తీసుకున్నారని స్థానిక ముస్లిం మహిళలు ఆరోపిస్తున్నారు. తమవారిని విడిచి పెట్టాలని కోరారు.కాగా, పోలీసు చర్య హల్ద్వానీ నుంచి ముస్లింల వలసలను ప్రేరేపించినట్టు కనిపిస్తున్నది. ఫిబ్రవరి 11 ఉదయం, వందలాది మంది ప్రజలు, చేతిలో సామానుతో పొరుగున ఉన్న పట్టణాలు, యూపీలోని నగరాలకు బస్సులు ఎక్కారు. పోలీసుల ఒత్తిడి లేని సురక్షితమైన ప్రదేశాల కోసం వారు వెతుకుతున్నారు.

మరో 25 మంది అరెస్టు

- ఉత్తరాఖండ్ పోలీసులు వెల్లడి

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ హింసలో మరో 25 మంది అరెస్టయ్యారు. మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ విషయాన్ని రాష్ట్ర పోలీసులు తెలిపారు. ఈనెల 8న హల్ద్వానీలో స్థానిక అధికార యంత్రాంగం ఒక మసీదు, మదర్సాను కూల్చివేసిన తరువాత హింస చెలరేగిన విషయం విదితమే. అరెస్టయినవారిలో 12 మంది పోలీస్ స్టేషన్‌పై దాడికి పాల్పడ్డారనీ, ఆరుగురు పోలీస్ స్టేషన్ వెలుపల కార్లను తగులబెట్టారనీ, ఏడుగురు కూల్చివేత సమయంలో హింసలో పాల్గొన్నారని పోలీసులు ఆరోపించారు. హింసాకాండకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం 30 మందిని అరెస్టు చేసినట్టు నైనిటాల్ సీనియర్ పోలీసు సూపరింటెండెంట్ ప్రహ్లాద్ నారాయణ్ మీనా తెలిపారు. ఈ వ్యవహారంపై ఇప్పటి వరకు మూడు ఎఫ్ఐఆర్‌లు దాఖలయ్యాయని చెప్పారు.

జీవో 59పై విజిలెన్స్ విచారణ

- అక్రమ రిజిస్ట్రేషన్లపై ఆరా :వచ్చిన దరఖాస్తులు 48 వేలు 38 బృందాలతో క్షేత్రస్థాయిలో పరిశీలన
- కదిలిన విలువైన భూముల ఫైళ్లు
- రూ.కోట్ల విలువ గల భూములు మాయం చేసినట్టు సమాచారం

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

గూడు లేని నిరుపేదలు ప్రభుత్వ భూముల్లో ఎన్నో ఏండ్లుగా జీవనం సాగిస్తున్న జాగాలను క్రమబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం జీవో నెంబర్ 59ను తీసుకొచ్చింది. ఈ జీవోతో పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వం భావిస్తే.. కొంత మంది అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి అక్రమాలకు పాల్పడ్డారు. రాష్ట్ర రాజధాని శివారు ప్రాంతాల్లో విలువైన భూములపై కన్నేసిన రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పెద్ద మొత్తంలో ప్రభుత్వ భూములను 59 జీవో పేర స్వాధీనం చేసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేయిస్తోంది. త్వరలో అక్రమార్కుల చిట్టాను బయటపెట్టేందుకు విజిలెన్స్ అధికారులు సిద్ధమైనట్టు సమాచారం.భూముల ధరలకు రెక్కలు రావడంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో విలువైన ప్రభుత్వ భూములు మాయమ వుతున్నాయి. కబ్జా పెట్టిన భూములను క్రమబద్ధీకరించుకోవడానికి జీవో 59 వారికి వరంగా మారింది. జిల్లాలో జీవో నెంబర్ 59 కింద సుమారు 48 వేల దరఖాస్తులు వచ్చినట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ దరఖాస్తుల పరిశీలన కోసం 38 బృందాలు క్షేత్రస్థాయిలో.. ప్రభుత్వ జాగాల్లో ఎవరు ఇంటి నిర్మాణం చేసుకుని నివాసం ఉంటున్నారన్నది పరిశీలన చేసి 59జీవో కింద అర్హులా కాదా అన్నది నిర్ధారించాల్సి ఉంది. కానీ ఇక్కడే అసలు కథ మలుపు తిరిగింది. క్షేత్రస్థాయిలో రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు కలిసి అధికా రులతో తప్పుడు రిపోర్టులు రాయించుకుని రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించుకున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో అత్యధిక ధరలు ఉన్న రంగారెడ్డి జిల్లాలో శేరిలింగంపల్లి, శంకర్‌పల్లి, నార్సింగ్, శంషాబాద్, మహేశ్వరం, బాలాపూర్, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ మండలాల పరిధిలో ఎక్కువ మొత్తంలో 59జీవో కింద ప్రభుత్వ భూములు మాయమైనట్టు తెలుస్తోంది.

రెవెన్యూ రిపోర్టులపై విజిలెన్స్ విచారణ



59 జీవో కింద జిల్లాలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో ఇంటి నిర్మాణాలు ఉన్నాయా..! లేదా.. వాస్తవ పరిస్థితులను పరిశీలించి రిపోర్టు చేయాలి. కానీ అధికారులు అవేమీ పట్టించుకోకుండా కాసుల కక్కుర్తితో అర్హత లేని వారికి కూడా తప్పుడు రిపోర్టుల ద్వారా ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించినట్టు విచారణలో ఒక్కొక్కటి బయటపడ్తున్నాయి. అప్రూవ్ అయిన ఫైళ్లలో 20శాతం రాజకీయ నేతల ప్రోద్భలంతో క్లియర్ అయినట్టు తెలిసింది. త్వరలో ఎన్ని భూములు అక్రమార్కుల చేతుల్లోకి పోయినవి అన్నది బయట పెట్టేందుకు విజిలెన్స్ అధికారులు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. తప్పుడు రిపోర్టులు ఇచ్చిన అధికారులు, అక్రమాలకు పాల్పడిన వారికి చర్యలు తప్పవని ఉన్నతాధికారులు తెలిపారు.

ప్రశ్నలకు సమాధానాలిచ్చాకే నల్లగొండ సభకు వెళ్లాలి

- కేసీఆర్ కు టీజేఎస్ లేఖ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

కృష్ణా జలాల పరిరక్షణ కోసమంటూ నల్లగొండ సభకు వెళ్లే ముందు తామడిగే ప్రశ్నలకు సమాధానాలివ్వాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ పలు ప్రశ్నలతో కె.చంద్రశేఖర్ రావుకు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణా, గోదావరి నదులపై ఉన్న ప్రాజెక్టులన్నింటినీ నదీ యాజమాన్య బోర్డులకు అప్పగించాలని 2021 జులై 15న కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడు సీఎం హోదాలో ఎందుకు మౌనంగా ఉన్నారు? ప్రాజెక్టుల నిర్వహణకు ఆయా యాజమాన్య బోర్డులకు రూ.200 కోట్లు చెల్లించాలని పెట్టిన డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది వాస్తవం కాదా? భారత రాజ్యాంగం ప్రకారం నీరు రాష్ట్ర జాబితాలో ఉన్నప్పటికీ రాజ్యాంగ విరుద్ధంగా కేంద్రం లాగేసుకుంటుంటే, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించకుండా కేసీఆర్‌ను ఆపిందెవరు? అంటూ ప్రశ్నించారు.

"గెజిట్ నోటిఫికేషన్‌లో రాష్ట్ర పరిధిలో వున్న ప్రాజెక్టులకు ఆరు మాసాలలో అనుమతులు సాధించుకోవాలనీ, లేనట్టయితే నోటిఫికేషన్ అమల్లోకి వచ్చిన రోజునే పనులు ఆపేయాలని చెప్పింది. మరి బీఆర్ఎస్ సర్కారు కృష్ణా నదిలో నీటిని వినియోగం చేసుకోవడానికి ఎన్ని ప్రాజెక్టులను పూర్తి చేశారు. ఎన్ని ప్రాజెక్టులకు అనుమతులు సాధించారు.? ఈ గెజిట్ అమలులోకి వస్తే ప్రాజెక్టు నిర్మాణాలు ఆగిపోయి, వాటి కోసం తీసుకునే రుణాలు వడ్డీతో సహా చెల్లించడం భారమని తెలిసి కూడా ఎందుకు కార్పొరేషన్ల పేరుతో అప్పులు తెచ్చారు? ఎందుకు లక్షల ఎకరాల భూమిని బలవంతంగా సేకరించారు ? ఎస్సెల్బీసీ ఎడమ కాలువకు, సొరంగం త్రవ్వకానికి పదేండ్ల పాలనలో ఎందుకు నిధులు కేటాయించలేదు? "అంటూ ఆ లేఖలో నిలదీశారు.

పానీ పట్టు యుద్ధం..

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీలో 'పానీ' పట్టు యుద్ధం నడిచింది. కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు సరైన వాటా దక్కక పోవటానికి, న్యాయంగా రావాల్సిన నీటి వాటాలు రాకపోవటానికి 'మీరే కారణమంటే.. కాదు మీరే కారణమంటూ...' అధికార, ప్రధాన ప్రతిపక్షాలు పరస్పరం ఆరోపణాస్త్రాలు సంధించుకున్నాయి. గత పదేండ్ల బీఆర్ఎస్ సర్కారు వైఫల్యాల వల్లే నదీ జలాల్లో మనకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ విమర్శిస్తే.. అవగాహన, అనుభవరాహిత్యంతో రేవంత్ ప్రభుత్వం వ్యవహరించటం వల్లే కేఆర్ఎంబీ పరిధిలోకి ప్రాజెక్టులు వెళ్లాయంటూ గులాబీ పార్టీ విమర్శలు గుప్పించింది. రెండు పార్టీలకు చెందిన సభ్యుల వాగ్వాదాలు, వాగ్బాణాలతో సభ దద్దరిల్లింది. దూషణ భాషణలు, వ్యక్తిగత విమర్శలతో పలుమార్లు అసెంబ్లీ హీటెక్కింది. చివరికి కృష్ణా నదీ జలాలు, కేఆర్ఎంబీ సంబంధిత అంశాలపై ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది.

రాష్ట్ర శాసనసభ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఒకరోజు విరామానంతరం సోమవారం అసెంబ్లీ సమావేశమైంది. సభ ఉదయం 10.05 గంటలకు ప్రారంభం కాగానే సభా సమక్షంలో ఉంచిన పలు పత్రాల గురించి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రస్తావించారు. అనంతరం సభాపతి సూచన మేరకు హుక్కా, ఇతర మాదక ద్రవ్యాలను నిషేధానికి సంబంధించిన సవరణ బిల్లును శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. ఆ బిల్లును సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఉదయం 10.18 గంటలకు స్పీకర్ తేనీటి విరామాన్ని ప్రకటించారు. తిరిగి సభ ఉదయం 11.21 గంటలకు ప్రారంభం కాగానే సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కృష్ణా నదీ జలాల అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తూ సుదీర్ఘంగా ప్రసంగించారు. ఆయన ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కంటే తెలంగాణ వచ్చిన తర్వాతే నదీ జలాల్లో మనకు తీవ్ర అన్యాయం జరిగింది. దీనికి ముమ్మాటికి బీఆర్ఎస్ ప్రభుత్వ అలసత్వం, వైఫల్యమే కారణం...' అంటూ ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. తెలంగాణ జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించటానికి సహకరించిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నానంటూ ఏపీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలతో కూడిన క్లిప్పింగ్‌ను ఉత్తమ్ ఈ సందర్భంగా ప్రదర్శించారు.

కృష్ణా నదీ జలాలపై ప్రభుత్వం శాసనసభలో తీర్మానించటాన్ని బీఆర్ఎస్ విజయంగా ఆ పార్టీ సీనియర్ సభ్యుడు తన్నీరు హరీశ్‌రావు అభివర్ణించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వటానికి తమకూ అనుమతినివ్వాలంటూ ఆయన స్పీకర్‌ను కోరారు. కేసీఆర్‌ను గతంలో కరీంనగర్ ప్రజలు తిరస్కరిస్తే.. ఆయన మహబూబ్‌నగర్‌కు పారిపోయారంటూ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై హరీశ్ ఘాటుగా స్పందించారు. 'మిమ్మల్ని గతంలో కొడంగల్ ఓడిస్తే... మల్కాజిగిరికి వచ్చారు కదా..?' అంటూ ఎద్దేవా చేశారు. చర్చ ఈ విధంగా కొనసాగుతున్న క్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆయన సోదరుడు, అధికార పార్టీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి... హరీశ్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్... సభకు రాకపోవటాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌తోపాటు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తప్పుబట్టారు. శాసనసభలో సమస్యలపై చర్చల ద్వారా ప్రజలకు సందేశాన్ని ఇవ్వాల్సిన ప్రతిపక్ష నేత ఫామ్‌హౌస్‌లో దాక్కున్నారంటూ సీఎం ఎద్దేవా చేశారు. సభకు రానటువంటి కేసీఆర్... ఆ రకంగా తెలంగాణ సమాజాన్ని అవమానపరుస్తున్నారంటూ రేవంత్ ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ రకంగా సోమవారం వాడివేడిగా సభ కొనసాగిన దరిమిలా... ఇప్పుడు సీన్ ఇటు నల్లగొండకు, అటు మేడిగడ్డకు మారనుంది. ఇప్పటిదాకా నీటి వాటాలపై సభలో సమరం సాగించిన అధికార, ప్రతిపక్షాలు మంగళవారం క్షేత్రస్థాయికి వెళ్లనున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన పిల్లర్లను పరిశీలించేందుకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హైదరాబాద్ నుంచి బయల్దేరి వెళ్లనున్నారు. ఉదయం 10 గంటలకు అసెంబ్లీ ప్రారంభం కాగానే కొద్ది సేపు సభా కార్యక్రమాల్లో పాల్గొని, అనంతరం వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో మేడిగడ్డకు బయలుదేరుతారు. మధ్యాహ్నం మూడు గంటలకు వారు అక్కడికి చేరుకుంటారు. రెండు గంటలపాటు క్షేత్రస్థాయి పరిశీలన, పవర్ పాయింట్ ప్రజంటేషన్ అనంతరం తిరిగి సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌కు ఆ బృందం బయల్దేరుతుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. మరోవైపు కేఆర్ఎంబీకి కృష్ణా ప్రాజెక్టులను అప్పగించటాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ మంగళవారం నల్లగొండలో బహిరంగ సభను నిర్వహించనుంది. ఈ సభకు ఆ పార్టీ అధినేత కేసీఆర్‌తోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు హాజరు కానున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే ఈ సభకు ఇప్పటికే ఏర్పాట్లు చేసినట్టు నాయకులు తెలిపారు. అయితే డిసెంబరులో నిర్వహించిన అసెంబ్లీ సమావేశాలతోపాటు ప్రస్తుత ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలకూ కేసీఆర్ వరసగా నాలుగో రోజూ డుమ్మా కొట్టటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటిదాకా సభ మొహం చూడని కేసీఆర్...మంగళవారం నల్లగొండకు వెళుతుండటం గమనార్హం.

తప్పులను తప్పించుకునేందుకుకే కేఆర్ఎంబీపై చర్చ

- బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు గతంలో చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే అసెంబ్లీలో కేఆర్ఎంబీపై చర్చ చేస్తున్నాయని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీజేపీ ఎమ్మెల్యే కె.వెంకటరమణరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ది కోసమే ఈ చర్చ అని విమర్శించారు. గతంలో కృష్ణా జలాల కోసం రూ.200 కోట్లు ఎందుకు కేటాయించారో తెలియదని, కేఆర్ఎంబీకి అప్పగిస్తారనే కారణం కావచ్చునని అన్నారు. ఏ సర్వే చూసినా బీజేపీకి మెజార్టీ అవకాశముందని కాబట్టి కేంద్రంపై నింద వేస్తున్నాయన్నారు. మరోసారి తెలంగాణ ప్రజలను నమ్మించాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ యత్నిస్తున్నాయన్నారు.

మోడీ సర్కార్ ఉలికిపాటు



- రాజధానిలో నిరసన గళం విప్పిన కర్నాటక, కేరళ
- దక్షిణాదిపై వివక్ష ఎందుకని మండిపాటు
- బకాయిలు ఎప్పుడు ఇస్తారని నిలదీత
- సంఘీభావం తెలిపిన ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర సర్కారుకు వ్యతిరేకంగా 'నా పన్ను...నా హక్కు' పేరుతో కర్నాటక ప్రభుత్వం దేశ రాజధానిలో నిర్వహించిన నిరసన కార్యక్రమం ప్రతిపక్షాల్లో ఉత్సాహాన్ని నింపింది. మరో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఒక్కొక్కటిగా కేంద్రంపై బాహాటంగా గొంతు విప్పుతున్నాయి. మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుండీ ప్రజా సమస్యలను గాలికి వదిలేసి మందిరం, మతతత్వం, నయా జాతీయతావాదం, దేశభక్తి వంటి భావోద్వేగపూరితమైన అంశాలనే పట్టుకొని వేళ్లాడుతోంది. అయితే గత కొద్ది రోజులుగా దేశంలో రాజకీయం ఆశ్చర్యకరమైన మలుపులు తీసుకుంటోంది. తమకు రావాల్సిన న్యాయమైన నిధుల కోసం కర్నాటకకు చెందిన కాంగ్రెస్ నేతలందరూ దేశ రాజధానికి కదలివచ్చి, మోడీ ప్రభుత్వాన్ని నిగ్గదీశారు. ఆ మరునాడే కేరళకు చెందిన వామపక్ష నేతలు కూడా దేశ రాజధానిలోనే మోడీని నిలదీశారు. దేశంలో తనకు ఎదురే లేదని భావిస్తున్న ప్రధాని మోడీకి ఈ పరిణామాలు ఇబ్బందిని కలిగించాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత కాంగ్రెస్‌కు చెందిన బెంగళూరు రూరల్ ఎంపీ, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేష్ కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మోడీ ప్రభుత్వం దక్షిణాదికి తీవ్ర అన్యాయం చేస్తోందని, దక్షిణాది రాష్ట్రాల నుండి వచ్చే నిధుల్ని దారి మళ్లించి ఉత్తరాదికి దోచిపెడుతోందని ఆరోపించారు. దక్షిణ భారతదేశంపై హిందీ ప్రాంతాన్ని రుద్దుతున్న నేపథ్యంలో ప్రత్యేక దేశాన్ని ఏర్పాటు చేయాలని కూడా ఆయన డిమాండ్ కూడా చేశారు. దీనిపై మోడీ ప్రభుత్వం ఉలికిపాటుకు గురైంది. ఆ పార్టీ ఎంపీలు, నేతలు, ట్రోల్స్ సైన్యం ఒక్కసారిగా సురేష్‌పై విరుచుకుపడ్డారు. ఆయన్ని వేర్పాటువాదిగా, దేశ వ్యతిరేకిగా చిత్రీకరించారు. ఉత్తర, దక్షిణ ప్రాంతాల మధ్య సురేష్ చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. సురేష్ ప్రకటనను కాంగ్రెస్ తొలుత ఖండించినప్పటికీ ఆర్థిక వ్యవహారాల విషయంలో దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం నిష్పాక్షికంగా వ్యవహరించకపోవడం వాస్తవమేనని, అందుకే ఆయన అలా దక్షిణాదిని ప్రత్యేక దేశంగా ప్రకటించాలని కోరి ఉండవచ్చునని వివరణ ఇచ్చింది.

కర్నాటక 'ఛలో ఢిల్లీ'

కొద్ది రోజుల తర్వాత ఈ నెల 6న కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ వార్తా పత్రికల్లో 'ఛలో ఢిల్లీ' అంటూ పూర్తి పేజీ ప్రకటనలు ఇచ్చింది. కన్నడిగులపై, కర్నాటకపై కేంద్ర ప్రభుత్వ ఆర్థిక వేధింపులకు నిరసనగా రాష్ట్ర నేతలందరూ ఢిల్లీకి తరలి వెళ్లాలని అందులో పిలుపునిచ్చింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఓ అడుగు ముందుకు వేసి ఈ నిరసనకు రాజకీయాలతో సంబంధం లేదని, కాబట్టి బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా రావాలని కోరారు. ఏదేమైనా కాంగ్రెస్ నిర్వహించిన నిరసన కార్యక్రమంతో మోడీ ప్రభుత్వం ఉలిక్కి పడింది. కాంగ్రెస్‌పై ఎదురు దాడికి దిగుతూ ఆత్మరక్షణ చేసుకునేందుకు ప్రయత్నించింది. ప్రధాని మోడీ సైతం పార్లమెంటులో కాంగ్రెస్‌పై మండిపడ్డారు.

దక్షిణాది రాష్ట్రాల పట్ల మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షాపూరిత వైఖరిని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్ గణాంకాలతో సహా ప్రజల ముందు ఉంచారు. 15వ ఆర్థిక సంఘం రూపొందించిన ఫార్ములా ప్రకారం గత ఐదు సంవత్సరాల్లో కర్నాటక రూ.1.87 లక్షల కోట్లు నష్టపోయిందని వారు వివరించారు. రాష్ట్రం వసూలు చేస్తున్న ప్రతి వంద రూపాయల పన్నులో కేవలం రూ.13 రూపాయలే తిరిగి రాష్ట్రానికి దక్కుతున్నాయని తెలిపారు. మహారాష్ట్ర తర్వాత దేశంలో రెండో అతి పెద్ద పన్ను చెల్లింపుదారు అయిన కర్నాటక అందుకు తగిన ప్రతిఫలం పొందలేకపోతోందని సిద్ధరామయ్య వాపోయారు.

కేరళ సైతం...

జంతర్‌మంతర్ వద్ద కర్నాటక నిరసన జరిపిన మరునాడే కేరళ కూడా అక్కడే అందోళన నిర్వహించింది. దీనికి రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వం వహించారు. జీఎస్టీ పరిహారం ఆగిపోవడం, పన్నుల్లో వాటా కుదించడం, రుణాలకు అనుమతి నిరాకరించడం వల్ల రాష్ట్రం రూ.57,000 కోట్లు నష్టపోయిందని ఆయన తెలిపారు.

ఈ నిరసన కార్యక్రమానికి పలువురు ప్రతిపక్ష నేతలు తరలివచ్చి సంఘీభావం తెలిపారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, సీపీఐ (ఎం) నేత సీతారాం ఏచూరి, జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా, సీపీఐ నేత డీ.రాజా తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అదే రోజు డీఎంకే కూడా నిరసన తెలిపింది. కేరళ ఆందోళనకు డీఎంకే అధినేత, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సంఘీభావం తెలిపారు. ఆ కార్యక్రమానికి తన క్యాబినెట్ సహచరుడు పీటీ రాజన్‌ను పంపారు.

సుప్రీంను ఆశ్రయించిన కేరళ

ఇక్కడ మరో విషయాన్ని కూడా గుర్తు చేసుకోవాలి. ఉద్యోగుల జీతాలు, వరద బాధితులకు పునరావాసం, అభివృద్ధి పనుల కోసం వెంటనే నిధులు విడుదల చేయాల్సిందిగా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ గత నెల 12న కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. మోడీ ప్రభుత్వం తరపున వాదించిన అటార్నీ జనరల్ దీనికి అభ్యంతరం తెలుపుతూ 33 రాష్ట్రాలకు లేని సమస్య ఒక్క రాష్ట్రానికే వచ్చిందని వ్యాఖ్యానించారు. కేరళ పిటిషన్‌కు సమాధానం ఇవ్వాలని సుప్రీంకోర్టు మోడీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

తెలంగాణ కూడా...

తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేంద్రంపై దాడి ప్రారంభించింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజకీయాలను పక్కన పెట్టి అందరూ చేతులు కలపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో అన్ని పక్షాలకూ సూచించారు.

రాష్ట్రాలు ఏం కోరుతున్నాయి?

ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు కేంద్రాన్ని కోరుతున్నది ఒక్కటే. పేద రాష్ట్రాలకు అధిక నిధులు ఇవ్వడాన్ని అవి వ్యతిరేకించడం లేదు. తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, బీజేపీకి మిత్రపక్షంగా లేనందుకు తమను శిక్షించవద్దని అవి కోరుకుంటున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా (ఆదాయ వ్యత్యాసానికి 45%, జనాభాకు 15%, విస్తీర్ణానికి 15%, అడవులు–జీవావరణానికి 10%, జనాభా పనితీరుకు 12.5%, పన్ను ప్రయత్నాలకు 2.5%) బకాయిలు చెల్లిస్తే చాలునని అంటున్నాయి. జరిమానాలు విధించడం లేదా తమకు రావాల్సిన నిధులను ఇవ్వకపోవడం ద్వారా కేంద్రం తమ చేతులు కట్టేస్తోందని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

9
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
మంగళవారం | ఫిబ్రవరి 13, 2024 | www.navatelangana.com

'పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీనీ ఓడించాలి'

● సమ్మె కరపత్రం విడుదల చేసిన సీఐటీయూ నేతలు నాగేశ్వర్, జంగయ్య



నవతెలంగాణ-ధూల్ పేట్

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీనీ ఓడించడమే ఏకైక పరిష్కారమని సీఐటీయూ గోషా మహల్ జోన్ కన్వీనర్ కే.జంగయ్య, సీనియర్ నాయకులు పి. నాగేశ్వర్‌లు అన్నారు. 16న జరుగను న్న జాతీయ కార్మిక సమ్మె గ్రామీణ బంద్‌ను కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ అధ్వర్యం లో గోషామహల్ కిషన్ గంజి లోని సీఐటీయూ కార్యాలయంలో సమ్మె కరపత్రం విడుదల చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకత్వం లోని గత పదేండ్ల మోడీ పాలనలో దేశాన్ని దోచుకు తినేలా ఆదానీ, అంబానీ లాంటి బడా పెట్టుబడిదార్ల ఆదాయాలు 15 రెట్లు పెరిగాయన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని, దాని మిత్ర పక్షాలను ఓడించడమే ఏకైక పరిష్కారమని వారు కార్మికులకు, ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ బోర్డులో ఏజెన్సీ విధానం రద్దు చేయాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

వాటర్ బోర్డులో ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను బోర్డు పరిధిలోకి తీసుకోవాలని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు, కనీస వేత నాల సలహా మండలి మాజీ చైర్మెన్ పి. నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాటర్ బోర్డు కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూని యన్ కార్యవర్గ సమావేశం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించారు. భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు రాంబాబు యాదవ్ మాట్లాడుతూ వాటర్ బోర్డులో పనిచేస్తు చిన్న ఉద్యోగులకు సీనియార్టీ జాబితా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. కిరణ్ కుమార్, వర్కిం గ్ ప్రెసిడెంట్ రాజారత్నం, శ్రీనివాస్ రెడ్డి, ఆయిజనేయులు, కృష్ణయ్య, వాను, బాలరాజ్, రమేష్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

తరాలెన్ని మారినా తెలుగు పాటకు మా 'స్టార్' ఘంటసాలే

● ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ



నవతెలంగాణ-ముషీరాబాద్

తరాలెన్ని మారినా తెలుగు పాటకు మా "స్టార్" ఘంటసాలే అని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షు లు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రముఖ గాయకుడు ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ పాత మధురాలు అభ్యుదయ గీతాలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ హాజరై మాట్లాడుతూ 50 ఏళ్లుగా ఘంటసాల లేరు వారి పాటలు ఉదయం సాయంత్రం వరకు గుడి, బడి ప్రతి నోట పల్లవిస్తున్నదన్నారు. తరాలెన్ని మారినా తెలుగు పాటకు మా "స్టార్" ఘంటసాలేనన్నారు అమర గాయకుడికి ఆనవాళు వారి పది వేల పాటలేనని అన్నారు. ఈనాడు ఏ ఊరు కు వెళ్ళినా ఒకరో ఇద్దరో ఘంటసాలలు పాడేవారు ఉన్నారన్నారు. ఆంధ్రప్రజా నాట్యమండలి సభ్యులు స్వాతంత్ర్య సమర యోధులు క్విట్ ఇండియా ఉద్యమం పాల్గొన్ని 2 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించినా వీర యోధుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని అన్నారు. మహాత్మా గాంధీ లాంటి వారు సహచర్యం ఉంది జైలులోనే సంగీతం నేర్చుకున్నారు. దేశభక్తునిగా దేశభక్తి గీతాల ఆలాపన దేశ విదేశాల్లో సంగీత కచేరిలు చేసారన్నారు. సముద్రాల రాఘవాచారితో సినిమా కు పరిచయం అయ్యి సముద్రమంతా పాటలు పాడారని తెలిపారు.ప్రపంచ తెలుగు వారి పాటల ప్రతీక పద్మశ్రీ ఘంటసాల అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో అల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక అధ్యక్షుడు కొట వెంకటేశ్వర రెడ్డి సింగర్ రమ, శాస్త్రి, నర్సింగరావు, వేణు మాధవ్, ప్రణీత, అక్షర దీప్తి, ఆల్గా, అన్నపూర్ణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో లక్నో మున్సిపల్ కార్పొరేషన్ బృందం అధ్యయనం

● జవహర్ డంపింగ్ యార్డు, శానిటేషన్ పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

లక్నో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఆధ్వర్యం లో కార్పొరేషన్ (కార్పొరేటర్) ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ శానిటేషన్ బెస్ట్ ప్రాక్టీసెస్‌పై అధ్యయనం చేసేం దుకు హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా వారు జవహర్ నగర్‌లో డంపింగ్ యార్డు, శానిటే షన్‌ను పరిశీలించారు. చివరి రోజు సోమవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిసి శానిటేషన్, సీ అండ్ డీ సాలిడ్‌వేస్ట్ మేనే జ్మెంట్, జీహెచ్ఎంసీలో అమలు చేస్తున్న వివరా లను వారు మేయర్‌ను అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్ మొదటి దశ స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటికీ చెత్త సేకరించి దగ్గరలో యూసీటీపీ లకు తరలించి అక్కడ నుండి డంపింగ్ యార్డ్ కు తరలించడం జరుగుతుందని తెలిపారు. శానిటేషన్ లో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షన్‌లో మొత్తం జీహెచ్ఎంసీకి వివిధ కేటగిరీలలో 5 అవార్డులు వచ్చాయని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వివరిం చారు. ప్రతి రోజు 7500 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి జవహర్ నగర్ డంప్ యార్డు తరలిచడం జరుగుతుందని, ప్యారానగర్‌లో మరొక డంపు యార్డు గుర్తించామని చెప్పారు. భవన నిర్మాణ వ్యర్థాలు (సీ అండ్ డీ) రెండు ప్లాంట్‌కు గానూ మరో రెండు ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరిగిం దని, నగర వ్యాప్తంగా ఏర్పడిన సీ అండ్ డీ వ్యర్థాలను ఎప్పటి కప్పుడు రీసైక్లింగ్ చేయడానికి నగరం నలువైపులా మరో రెండు ఏర్పాటు చేసినట్లు మేయర్ వారికి వివరించారు. నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఫ్లైఓవర్‌లు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు, సోషల్ సెక్యూరిటీ పథకాలు అమ లు చేసినట్లు వివరించారు. లక్నో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ (శ్రీమతి సుష్మ కర్ఖ్వల, కార్పొరేటర్లు (ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ అంటే మన దగ్గర స్టాండింగ్ కమిటీ మెంబెర్స్) సుశీల్ కుమార్, సౌరవ్ సింగ్, శైలేంద్ర వర్మ ముఖే సింగ్, సురేంద్ర, వాల్మీకి, కమల్ సక్సేనా, హరిశ్చంద్ర, లాడి రాణి, కన్నా జియా, ఉమే ష్ సాన్వాల్, లెగ్ అఘ, కమ్రాన్ బెగ్, ఏఎంసి పంక జ శ్రీవాస్తవ, మేయర్ పీ.ఏ ప్రకాష్ ఉపాధ్యాయ, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయ లక్ష్మితో పాటు, యస్.డబ్లు.ఎం. ఈ.ఈ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకం సద్వినియోగించుకోవాలి

● ట్రూప్ బజార్ సబ్ డివిజన్ ఏడీఈ శ్రీనివాస్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న గృహజ్యోతి పథకం కింద అర్హులైన విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ట్రూప్ బజార్ సబ్ డివిజన్ విద్యుత్ ఏడిఈ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పుత్లి బౌలి విద్యుత్ కార్యా లయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగ దారులు ప్రజా పాలనలో గృహజ్యోతి పథకంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ 200 ల యూనిట్ లోపు వాడుకున్న వారికి నెలనెలా బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. అర్హులైన వారికి ఉచితంగా విద్యుత్తును అందిస్తామన్నారు. గృహ జ్యోతి స్కీం ఇంటింటికి తిరిగి తమ సిబ్బంది కరెంట్ ఫ్రీ పథకంగురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఇంటింటికి వచ్చిన తమ విద్యుత్ సిబ్బందికి ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న రశీదు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నెంబర్ వివరాలను ప్రజలనుంచి సేకరించి నోట్ చేసుకుంటున్నారని చెప్పారు. వాటిని డెటా ఎంట్రీ చేస్తు న్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సిబ్బంది వచ్చినప్పుడు ధ్రువపత్రాలను అందజేయాలని చెప్పారు. లేకుంటే నేరుగా విద్యుత్ కార్యాలయానికి వచ్చి అందజేయా లని సూచించారు. ఈ కార్యక్రమంలో పుత్లిబౌలి విద్యుత్ ఏఈ ప్రణవింద్ విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాలకు బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడం సామాజిక స్ఫూర్తికి విరుద్ధం

● బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్



నవతెలంగాణ-ముషీరాబాద్

సంపద సృష్టిస్తున్న బీసీ కులాలకు బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడం సామాజిక స్ఫూర్తికి విరుద్ధమని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ అన్నారు. సోమవారం విద్యానగర్‌లోని అంబేద్కర్ భవన్ లో బీసీ సేన రాష్ట్ర నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో కామారెడ్డి నియోజకవర్గం లో బీసీ డిక్లరేషన్ సభలో అధికారంలోకి వస్తే ప్రతి ఏటా వార్షిక బడ్జెట్ లో బీసీల అభివృద్ధికి 20 వేల కోట్లతో ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో బీసీలకు కేవలం ఎనిమిది వేల కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నరన్నారు. ఇచ్చిన హామీ మేరకు 20 వేల కోట్ల అదనపు బడ్జెట్ కేటాయించాలని రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ కేంద్రం లో కోటి రూపాయల నిధులతో పూలే భవన్ నిర్మించాలని రాష్ట్ర డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే హామీలతోనే బీసీల ఓట్లు లాక్కోవాలని చూస్తే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీసీలు అధికార పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో కరాటే ఎతినే చెన్నయ్య, వెంకటేష్ యాదవ్, బాలస్వామి, సెలేటి వెంకటేష్, గొడుగు నర్సిములు, రాజ్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనకు కృషి

● కేంద్ర సహాయ మంత్రి భగవంత్ ఖుభా



నవతెలంగాణ-ధూలపేట్

నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నా మని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి భవంత్ ఖుబా అన్నారు. సోమ వారం హైదరాబాద్ పాతబస్తీ చాంద్రాయణగుట్ట బార్కాస్ సీ.ఆర్.పీ.ఎఫ్. గ్రూప్ సెంటర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన రోజ్‌గార్ మోళా కార్యక్ర మంలో ఆయన ముఖ్యఅథిగా పాల్గొని మాట్లాడారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ, భారత దేశం చరిత్ర సృష్టిస్తునే ఉందన్నారు. దేశంలోని 10లక్షల మంది యువతకు కేంద్ర ప్రభుత్వ వివిధ విభాగాల్లో శాశ్వత ఉద్యోగాలు కల్పించారని, ఏం.ఏస్.ఏం.ఈ, ప్రోత్సహం, విధి వ్యాపారులకు రుణాసహాయం అందించి వారిని ఆదుకోవడం జరిగిందన్నారు. నిరుద్యోగ సమస్యను గుర్తించి ప్రధాన మంత్రి మోడీ రోజ్‌గార్ మోళ లాంటి కార్యక్రమా లను చేపడుతున్నారన్నారు. ఏప్రభుత్వ హాయంలో చేయని అభివృద్ధి పనులను మోడీ హయంలో జరుగుతున్నాయని తెలిపారు. చివరకు వివిధ ప్రభుత్వ శాఖలో ఉద్యోగం పొందిన తెలుగు రాష్ట్రలకు చెందిన 169 మంది అభ్యుర్థులకు నియమక పత్రాలు అం దించారు. ఈ కార్యక్రమంలో సీఆర్ పీఫ్ గ్రూప్ సెంటర్ డీఐజీ ఉదయభాస్కర్ ,దక్షిణ మండల మెడికల్ విభాగం ఐజీపీ డాక్టర్ లింగరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలి

● కమిషనర్ రోనాల్డ్ రోస్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రహమత్ నగర్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ జోనల్ కమిషనర్, అధికారులతో పలు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ రోనాల్డ్ రోస్ రహమత్ నగర్ జంక్షన్ అభివద్ధి పనులను, కార్మిక నగర్ నాలా పనులు యస్ సీ.ఆర్ హిల్స్‌లో గల దళిత స్టడీ సెంటర్, సున్నం చెరువు, 100 ఫీట్ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జంక్షన్ అభివృద్ధికి రూ.4.50 కోట్లు మంజూరు చేసిన నేపథ్యంలో టౌన్ ప్లానింగ్, పోలీస్ శాఖ సలహాలు తీసుకుని పనుల ను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్మిక నగర్‌లో ఎన్.ఎం. ఎస్.ఎం.ఈ వద్ద గల నాలాను వారి నిధులతోనే నాలా పనులు చేపట్టాలని సూచించారు. సున్నం చెరువులో చెత్త డంపింగ్ వేయకుండా పెన్సింగ్ ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. యస్ పీ.ఆర్ హిల్స్ దళిత సెంటర్ భవన నిర్మాణం పూరైనందున ప్రారంభోత్సవం చేయాలని కార్పొరేటర్ సీ.యస్ రెడ్డి కమిషనర్‌ను కోరారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్‌ను కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ స్నేహ శబరిష్, కార్పొరేటర్ సీ.ఎస్ రెడ్డి, ఈఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి తీవ్ర అన్యాయం'

● ఏఐడీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఎర్ర రాజేష్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఓటాన్ అకౌంట్ బడ్జెట్'లో విద్యకు 7.75 శాతం నిధులు మాత్రమే కేటాయించి విద్యా రంగానికి తీవ్ర అన్యా యం చేశారని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి ఫెడరేషన్ (ఏఐడీఎస్ఎఫ్) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఎర్ర రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా రంగానికి ఈ నిధులు ఏ మాత్రం సరిపోవని ఇంకా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వాస్తవానికి బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులు ఇవ్వాలని, కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో 15శాతం నిధులు విద్యకు కేటాయిస్తామని చెప్పారన్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో 20 శాతం ఇస్తే బాగుండేదని విద్యకు నిధుల కేటాయింపుపై పునరాలోచన చేసి సవరించి 20 శాతం ఇవ్వాలని కోరారు. గత బీఆర్ఎస్ పాలన వల్ల రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిందని, బడ్జెట్‌లో యూనివర్సిటీలకు మౌలిక సదుపాయాల కోసం కేటాయించిన రూ.500 కోట్లు ఏ మేరకు సరిపడవని ప్రతి యూనివర్సిటీకి రూ.300 కోట్ల నుండి రూ.1,000 కోట్ల నిధులు కేటాయించి, ఉన్నత విద్య ప్రమా ణాల పెంపునకు కృషి చేయాలని, కొత్తగా గురుకుల భవనాల నిర్మాణం కాకుండా అద్దె భవనాల్లో కొనసాగుతున్న సంక్షేమ హాస్టల్స్ ను సొంత భవ నాల నిర్మాణానికి కృషి చేయాలని, పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు రూ.5,500 కోట్లు వెంటనే విడుదల చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేసి, విద్యా రంగంలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకై 'జాబ్ క్యాలెండర్' విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి, నిరుద్యోగులకు అండగా ఉండి వారి సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

'క్రిస్టియన్ జేఏసీ ఉద్యమకారులకు 250 గజాల స్థలం కేటాయించాలి'

● తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ చైర్మెన్ జిలుకర రవికుమార్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి 10 జిల్లాలకు చెందిన 2,200 మంది క్రిస్టియన్ జేఏసీ ఉద్యమకారులకు ఎలాంటి నిబంధనలు లేకుండా తెలంగాణ ఉద్యమ కారులకు ఏ విధంగా 250 గజాల స్థలం ఇస్తామని హామీ ఇచ్చారో అదే విధంగా తమకు కూడా ఇవ్వాలని తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ చైర్మెన్ జిలుకర రవికుమార్ సీఎం ఎ.రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ తెలంగా ణ ప్రత్యేక రాష్ట్రం కోసం సర్వం కోల్పోయి, ఉప్పెన లాంటి ఉద్యమం చేసిన తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ప్రతినిధులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చే సంక్షేమ ఫలాలు ఇవ్వాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో కీలమైన భూమిక పోషించిన జేఏసీకి గత ప్రభుత్వం ఎలాంటి న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం అనేక మంది అమరుల వుతున్న సందర్భంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులందరూ కలిసి జేఏసీగా ఏర్పడి మిలియన్ మార్చ్, ఛలో అసెంబ్లీ, సకల జనుల సమ్మె ఇలా అనేక రకాలుగా ఉద్యమంలో కీలకంగా పని చేశామని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే క్రైస్తవులకు ప్రత్యేక చట్టం వస్తుందని, ప్రత్యేక నిధులు వస్తాయని ఆశించామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమంలో పాల్గొన్న వారికి ఎలాంటి న్యాయం చేయలేద న్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తమను గుర్తించి క్రిస్టియన్ జేఏసీ ఉద్యమకారులకు ఎలాంటి నిబంధనలు లేకుండా 250 గజాల స్థలం, నిర్మాణం కోసం రూ.10 లక్షలు, ప్రతి నెల పెన్షన్ ఇవ్వాలని సీఎం ఎ.రేవంత్ రెడ్డిని ఆయన కోరారు.ఈ సమావేశంలో జేఏసీ వరంగల్ జిల్లా చైర్మన్ బి.రత్నకుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ దాసరి శ్యామ్ రావు, జేఏసీ రాష్ట్ర నాయకులు మేకల సారయ్య, బంగారి రమేష్, రాజు, ప్రభాకర్, ఇర్మియా, ఎం.పద్మ, లూథియా తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ధూల్‌పేట్

16న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో బాగంగా శుక్రవారం ఐ.ఎస్ . సదన్ చౌరస్తా నుండి మలక్‌పేట్ వరకు జరిగే ప్రదర్శనలో పాల్గొనా లని సీఐటీయూ హైదరబాద్ సౌత్ జిల్లా నాయకులు పి. నాగేశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం గౌలిగుడలోని మున్సిపల్ కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. దేశ వ్యాప్త సమ్మెను కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో స్థానిక కార్మికులు లక్ష్మి, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ విద్యార్థిని అదృశ్యం



నవతెలంగాణ-ముషీరాబాద్

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువు తున్న విద్యార్థిని అదృశ్యమై న ఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దోమల గూడ ఎస్సై సాయి కృష్ణ తెలిపిన వివరాల ప్రకా రం.. దోమలగూడ తాళ్ల బస్తీకి చెందిన కే.సమ్మయ్య వృత్తిరీత్యా డ్రైవర్ ఆయన తన భార్య ఇద్దరు కూతుళ్లతో కలిసి నివసిస్తున్నాడు. చిన్న కూతురు మౌనిక (17) హిమాయత్ నగర్‌లోని ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుంది. రోజు మాదిరిగానే ఈనెల 10న ఉదయం 8 గంటల 50 నిమిషాలకు మౌనిక ను తన తండ్రి సమ్మయ్య కాలేజీ వద్ద దింపి పని నిమిత్తం వెళ్లిపోయాడు. మౌనిక ఇంటికి రాకపోవడంతో సమ్మయ్య భార్య రజిత ఫోన్ ద్వారా సమ్మయ్యకు మౌనిక ఇంటికి రాలేదని సమాచారం అందించింది. వెంటనే సమ్మయ్య స్పందించి కాలేజీ ప్రిన్సిపాల్, టీచర్లకు ఫోన్ చేసి అడగగా మౌనిక మధ్యాహ్నం రెండున్నర గంటలకే కాలేజీ నుంచి వెళ్లిపోయిందని సమాచారం అందిం చారు. బంధువులను స్నేహితులను ఆరా తీసిన ఆచూకీ తెలియకపోవడంతో స్థానిక దోమలగూడ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సిటీ కాలేజీలో ఫిజిక్స్ పోస్టు ఖాళీ..

నవతెలంగాణ-ధూల్ పేట్

ప్రభుత్వసిటీ కళాశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో తాత్కాలిక ప్రాతిపదికన ఎం.ఎస్సీ ఫిజిక్స్ బోధించటానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.బాల భాస్కర్ ప్రకటనలో తెలియజేశారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55శాతం ఉత్తీర్ణతతో పాటు అభ్యర్థులు పీహెచ్‌డీ, ఎం.ఫిల్, నెట్, స్లెట్ అర్హతలు కలిగిన అభ్యర్థులు మాత్రమే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోడానికి అర్హులన్నారు. అధ్యాపకులుగా అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కళాశాల విద్య జారీ చేసిన నియమ నిబంధనలను అనుసరించి ఎంపికైన వారికి జీతాలు చెల్లించబడునని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యరులు ఫిబ్రవరి 13న మధ్యాహ్నం 3 గంటలలోపు తమ ధ్రువ పత్రాలతో ఫిజిక్స్ శాఖాధిపతిని సంప్రదించాలని తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందిన సంఘటన నాంపల్లి ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నాంపల్లి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. ఫతేనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం అర్ధ రాత్రి 12 గంటల తర్వాత గుర్తుతెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు తెలి పారు. అతని వయసు (30-35) ఉంటుందన్నారు. మృతిని శరీరంపై ఎడమ పుట్టు మచ్చ, నల్లని జీన్స్ పాయింట్, తెల్లని ఆఫ్ షర్ట్ మెడలో ఒక రుద్రాక్ష ఉన్నట్లు తెలి పారు. వివరా లకు ఫోన్ నెంబర్ 8712567449 సంప్రదించాలని సూచించారు.

'గ్రూప్-1 అభ్యర్థులకు వయో పరిమితి పెంచడం పట్ల హర్షం'

నవతెలంగాణ-హిమాయత్ నగర్



గ్రూప్-1 అభ్యర్థులకు సీఎం ఎ.రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాలు వయో పరిమితి పెంచడం పట్ల నేషనల్ ఎకనామికల్ వీకర్ సెక్షన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు తాడిశెట్టి పశుపతి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం అసోసి యేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత తొమ్మిదిన్నర సంవత్సరాల పాటు కొనసాగిన బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రూప్-1 ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో వేలాది మంది నిరుద్యోగుల వయో పరిమితి దాటి ఉద్యోగ అవకాశం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం ఎ. రేవంత్ రెడ్డి రెండు సంవత్సరాలు వయో పరిమితి సడలించడం వల్ల వేలాది మంది నిరుద్యోగులు గ్రూప్-1 పరీక్ష రాసే అవకాశం లభించిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సీఎం ఎ.రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

చేనిమల్ల లక్ష్మీకాంత్ సునీల్‌కు జాతీయ సేవారత్న అవార్డు ప్రదానం



నవతెలంగాణ-ముషీరాబాద్

ప్రముఖ సమాజ సేవకులు సంఘసంస్కర్త బేతుల్ల లక్ష్మీకాంత్ సునీల్‌కు జాతీ య సేవారత్న అవార్డును అందుకున్నారు. తిరుపతిలో బహుజన సాహిత్య అకాడమీ ఏడవ జాతీయ దక్షిణ భారత దేశ సదస్సులో తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ కర్ణాటక కేరళ తమిళనాడు పాండిచ్చేరి నుంచి చాలామంది ప్రముఖులు పాల్గొన్నారు. అందులో తెలంగాణ ప్రాంతానికి చెందిన చేనిమల్ల లక్ష్మీకాంత్ సునీల్‌కు జాతీయ సేవారత్న అవార్డు ప్రధానం చేశారు. అంబేద్కర్ వారసుడిగా గుర్తింపు పొందిన లక్ష్మీకాంత్ సునీల్ చేసిన సేవలను ముఖ్యంగా కరోనా సమయంలో ప్రజలకు ఎంతో సేవ చేశారు. అందుకుగాను జాతీయ సేవా రత్న అవార్డుతో సత్కరించారు. ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథులుగా ఎంపీ ఆర్ కృష్ణయ్య ప్రజా గాయకుడు మిట్టపల్లి సురేం దర్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఈ సందర్భంగా లక్ష్మి కాంత్ సునీల్ మాట్లాడుతూ. తాను చేసిన సేవలను గుర్తించి తనకు అవార్డు ఇచ్చినందుకుగాను బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



ప్రముఖ పారిశ్రామికవేత్త ఎల్ రాంబాబుకు విశ్వ గురు అవార్డు-2024తో సత్కరిస్తున్న తెలంగాణ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్, విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం, విశ్రాంత న్యాయమూర్తి నేరెళ్ల మాల్యాద్రి, డాక్టర్. ఎంఆర్ ఎస్ రాజు, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఉమా మహేశ్వరి, సినీ నటులు రామ్‌కి, సంస్థ అధ్యక్షులు రాంబాబు తదితరులు నవతెలంగాణ-సుల్తాన్ బజార్

గృహజ్యోతి దరఖాస్తులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కాప్రా

గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందేందుకు మల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంలో లబ్దిదారుల ప్రజాపాలన దరఖాస్తుల అనుసంధాన ప్రక్రియను కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. గృహజ్యోతి పథకం కోసం నమోదు చేసున్న వారు ఈ నెల 15వ తేదీ వరకు వార్డు కార్యాలయంలో సంబంధిత పత్రాలను అందజేసి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డివిజన్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు పరిపాలన అధికారి రాజు గౌడ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షిద్దాం : ప్రజాకవి జయరాజు



నవతెలంగాణ-కాప్రా

ప్రకృతిని, పర్యావరణాన్ని రక్షించడానికి జర్నలిస్టులు కలిసి రావాలని ప్రజాకవి, గాయకుడు జయరాజు పిలుపునిచ్చారు. జయరాజు జన్మదినం సందర్భంగా పలువురు జర్నలిస్టులు సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రకృతికి విరుద్ధంగా జీవిస్తూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నామని తెలిపారు. తద్వారా ప్రజలు తమ ఆరోగ్యాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. పేపర్ ప్లేటు, గ్లాసు, ప్లాస్టిక్ బ్యాగులకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. శిలా నీవే..శిల్పి నీవే.. శిల్పం నీవే.. అనే అద్భుతమైన సందేశాత్మక తత్వగీతాన్ని ప్రజలకు అందించినందుకు జయరాజును జర్నలిస్టులు అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు దినపత్రిక ఎడిటర్ గుమ్మడి హరిప్రసాద్, ధరణి దినపత్రిక ఎడిటర్ జి.రోజారాణి, నేత్రం దినపత్రిక ఎడిటర్ ఇంద్రపాలసత్యనారాయణ, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సైంటిఫిక్ టెంపర్ ఆవశ్యకతపై అవగాహన



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ప్రముఖ శాస్త్రవేత్తలు థామస్ ఆల్వా ఎడిసన్, చార్లెస్ డార్విన్ జయంతి సందర్భంగా ఎస్ఆర్‌డీజీ స్కూల్ విద్యార్థులకు సైంటిఫిక్ టెంపర్ ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా థామస్ ఆల్వా ఎడిసన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ శోభారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. చార్లెస్ డార్విన్ చిత్రపటానికి ప్రముఖ విద్యావేత్త కర్రే మల్లేశం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించి, వారిలో స్ఫూర్తి నింపేందుకు శాస్త్రవేత్తల జీవిత విశేషాలను తెలిపేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రిన్సిపాల్ శోభారెడ్డి మాట్లాడుతూ థామస్ ఆల్వా ఎడిసన్ బల్బుతో సహా అనేక ఆవిష్కరణలు చేశారని, చార్లెస్ డార్విన్ పరిణామక్రమాన్ని పరిశోధించి రుజువులతో చూపించారని చెప్పారు. కర్రే మల్లేశం మాట్లాడుతూ థామస్ ఆల్వా ఎడిసన్ బల్బును తయారు చేయడం కోసం అనేక ప్రయోగాలు చేశారని పేర్కొన్నారు. నేడు ఉపయోగిస్తున్న మాస్ మీడియా, టాకీ సినిమాలు, పవర్ స్టేషన్స్ ఆయన ఆవిష్కరణలు అని చెప్పారు. చార్లెస్ డార్విన్ పరిణామ క్రమం సిద్ధాంత ఫలితంగానే నేడు మానవుడు, పశువృక్షజాతులు ఏర్పడ్డాయని చెప్పారు. ప్రకృతిలో ఉన్న అన్ని ప్రాణకోటి నేచర్ ఆఫ్ నేచురల్ సెలక్షన్ ద్వారా తమ ఉనికిని నిలుపుకుంటున్నాయని తెలిపారు. విద్యార్థులు మూఢనమ్మకాలు కాకుండా జిజ్ఞాసతో ముందుకు సాగాలని సూచించారు. విద్యావేత్త శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు మార్కుల కోసమే కాకుండా పరిపూర్ణ జ్ఞానాన్ని సంపాదించుకొని ముందుకు సాగాలన్నారు. అనంతరం జాతీయగీతం జనగణమన ఆలాపనతో కార్యక్రమం ముగించారు. ఈ కార్యక్రమంలో కేకే. ప్రసాద్‌బాబు, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూర్ఛపై అపోహలు వద్దు .. అవగాహన ముఖ్యం

- అంటువ్యాధి కాదు.. మందులు, శస్త్రచికిత్సలతో పూర్తి ఉపశమనం
- ఇండియాలో కోటి మందికిపైగా బాధితులు
- అంతర్జాతీయ మూర్ఛదినోత్సవం సందర్భంగా కిమ్స్ ఆస్పత్రిలో అవగాహనా సదస్సు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మూర్ఛ అనేది మెదడుకు వచ్చే సర్వసాధారణమైన వ్యాధి అని, భారతదేశంలో ప్రస్తుతం దాదాపు కోటి మందికిపైగా ఈ వ్యాధి బాధితులున్నారని కిమ్స్ ఆస్పత్రికి చెందిన న్యూరోసర్జన్ డాక్టర్ మానస్ ప్రాణిగ్రాహి అన్నారు. అంతర్జాతీయ మూర్ఛ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన అవగాహనా సదస్సును ఆస్పత్రి సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, న్యూరాలజిస్ట్ డాక్టర్ సీతా జయలక్ష్మిలతో కలిసి ప్రారంభించారు. ఇందులో మూర్ఛ వ్యాధిగ్రస్తులతో పాటు సామాన్య ప్రజలు పాల్గొన్నారు. ఇందులో దీని చుట్టూ ఉన్న అపోహలను దూరం చేయడంపై పలువురు మాట్లాడారు. తమ జీవితంలో మూర్ఛవ్యాధితో ముడిపడిన అనేక సవాళ్లను విజయవంతంగా ఎదుర్కొంటూ జీవితాన్ని గడుపుతున్న వారిపై ఈ ఏడాది అంతర్జాతీయ మూర్ఛ దినోత్సవం ప్రధానంగా దృష్టిపెట్టింది. ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి, ఈ వ్యాధిపై ఉన్న దురభిప్రాయాలను పారదోలాలని ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆస్పత్రి సీఎండీ డాక్టర్ బి.భాస్కరరావు సూచించారు. డాక్టర్ మానస్ పాణిగ్రాహి మాట్లాడుతూ "మూర్ఛ అనేది నరాలకు సంబంధించిన సమస్య. ఇది వచ్చినప్పుడు మెదడులోని నాడీ కణాల కార్యకలాపాలు దెబ్బతింటాయి. మూర్ఛ లేదా అసాధారణ ప్రవర్తన, అనుభూతులు, కొన్నిసార్లు స్పృహ కోల్పోతారు. మూర్ఛ అనేది చికిత్స చేయగల మెదడు వ్యాధి. ఇది ఏ వయస్సు వారిలోనైనా వస్తుంది. 20 ఏండ్లకు ముందు, 60 ఏండ్ల తర్వాత ఎక్కువగా నిర్ధారణ అవుతుంది. ఒక్కసారి వస్తేనే మూర్ఛ ఉన్నట్టు కాదు. కనీసం రెండు సార్లు వస్తే అప్పుడు చూపించుకోవాలి. కొద్దిపాటి మూర్ఛ వచ్చినా చికిత్సలు అవసరం అవుతాయి. ఎందుకంటే వాహనాలు నడిపేటప్పుడు, లేదా ఈత కొట్టేటప్పుడు అవి ప్రమాదకరం. మందులతో కొన్నిసార్లు నయమవుతుంది. శస్త్రచికిత్స చేస్తే దాదాపు 80శాతం మందికి పూర్తిగా నయమవుతుంది. చిన్నతనంలో వస్తే, పెద్దవారయ్యే కొద్దీ అదే పోతుంది. మూర్ఛ రావడానికి అత్యంత ముఖ్యమైన కారణాలు చిన్నతనంలోనే మెదడుకు గాయాలు, అంటు వ్యాధులు, మెదడుకు తీవ్రమైన గాయం, స్ట్రోక్. ఈ పరిస్థితులన్నీ నివారించదగినవి. ఈ సమస్య ఉన్నవారిలో 30శాతం మందిలో మూర్ఛకు గుర్తించదగిన కారణం ఉండదు. ఇంకా జన్యు ప్రభావం, మెదడు కణితులు, మెదడు అభివృద్ధి రుగ్మతల వంటి కారకాల వల్ల కూడా దీన్ని కనుక్కోవచ్చు" అని వివరించారు.

చంద్రానగర్ కాలనీ సమస్యలు పరిష్కరించండి



- డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేసిన కాలనీవాసులు

నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ సర్కిల్ పరిధిలోని మచ్చ బొల్లారం 133 డివిజన్‌లోని చంద్రానగర్ కాలనీ సమస్యలను పరిష్కరించాలని అల్వాల్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. కాలనీలో 23 ఏండ్ల క్రితం సన్నని పైపులతో వేసిన డ్రయినేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరిందని తెలిపారు. దీంతో నిత్యం కాలనీలో ఏదో ఒకచోట డ్రయినేజీ పైపులు పగిలి మురుగు నీరు రోడ్డుపై పారుతుందని పేర్కొన్నారు. దీంతో దుర్వాసన వెదజల్లి దోమలు స్వైరవిహారం తో చేయడంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నామని చెప్పారు. కాలనీలోని రోడ్డు నెంబర్-1లో ఓపెన్ నాలా ఉండడంతో దుర్వాసన వెదజల్లుతుందని, దానికి పైకప్పు వేయాలని కోరారు. కాలనీ మీదుగా బాక్స్ డ్రెన్ నిర్మించారని దానికి ఇరువైపులా సిమెంట్‌తో ఫీలింగ్ చేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురై ఆస్పత్రిలో పాలవుతున్నారని తెలిపారు. వెంటనే రోడ్డుకిరువైపులా సీసీ ఫిలింగ్ చేయాలని అభ్యర్థించారు. మంచినీటి పైపులైన్ చివరి ఇండ్లవారికి అందక మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలనీలోని నాలుగో నంబర్ రోడ్డు వరకు గల డ్రయినేజీ కాలువలను బాక్స్‌డ్రెన్‌లో కలపాలని విజ్ఞప్తి చేశారు. గుంతల మయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని నివేదించారు. కాలనీలో రెండు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి 10 విద్యుత్ దీపాలు బిగించాలన్నారు. కొన్ని చోట్ల వృక్షాల వేర్లు ఇంటి పునాదులలోకి వస్తున్నాయని పేర్కొన్నారు. చెట్ల వేర్లతో సీసీ రోడ్డుకు పగుళ్లు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఆ చెట్లను తొలగించి వాటి స్థానంలో చిన్న మొక్కలను నాటావాల్సిందిగా వినతిపత్రం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కే యాదగిరి, వైస్ ప్రెసిడెంట్లు ఈ.రాములు, నాగభూషణ చారి, జనరల్ సెక్రెటరీ శేషారెడ్డి, ట్రెజరర్ ఎస్.వీ.బీచార్యులు, కాలనీవాసులు ఉన్నారు.



శ్రీశ్రీ శివభక్త మార్కండేయ స్వామి జన్మదినం సందర్భంగా మండల కేంద్రం శామీర్‌పేట గ్రామంలో పద్మశాలీలు స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శామీర్‌పేట పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ స్వామి ఆలయంలో ఉదయం 8 గంటల 30 నిమిషాల నుంచి అభిషేకం, ప్రత్యేక పూజలు ప్రారంభించారు. శివభక్త మార్కండేయ స్వామికి అర్చన, మహా మంగళహారతి నిర్వహించి భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం సభ్యులు, శామీర్‌పేట ఎంపీపీ దాసరి ఎల్లూభాయి దంపతులు, జెడ్పీటీసీ అనిత లాలయ్య దంపతులు, మాజీ సర్పంచ్ కిషోర్ యాదవ్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

-నవతెలంగాణ, శామీర్‌పేట్

ఘనంగా బండారి రాజారెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ తొలి శాసనసభ్యులు బండారి రాజారెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హబ్సిగూడలోని ఆయన నివాసంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, సాయి జన్ శేఖర్, మల్లేష్ యాదవ్, ముత్యంరెడ్డి, అంజి మాదిగ, భూపాల్ రెడ్డి, తుంగ తిరుపతి, అశ్వద్ధామ రెడ్డి, విఠల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్, పెంటయ్య, విజయ్ కుమార్, తదితరులు మర్యాదపూర్వ కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, డివిజన్ ప్రెసిడెంట్ కాసం మహిపాల్‌రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ మైనార్టీ ప్రెసిడెంట్ మహమ్మద్ బద్రుద్దీన్, రహీమ్, గౌస్ కలిసి పూల బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



సమస్యల పరిష్కారమే లక్ష్యం



- కార్పొరేటర్ బన్నాల గీత

నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. సోమవారం డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టి కి తీసుకెళ్లారు. వర్షం నీరు పోవడానికి స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ ఏర్పాటు చేయాలని కోరారు. లో వోల్టేజ్ విద్యుత్ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. హై వోల్టేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని కోరారు. వంగిపోయిన విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. కాలనీలో పలుచోట్ల ఆకతాయి కుర్రాళ్లు గంజాయి సేవిస్తున్నారని, పోలీస్ పెట్రోలింగ్ వెహికల్ తిరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, మహమూద్, కుమ్మరి కుంట అధ్యక్షులు సదానంద్‌చారి, రవి, కృష్ణా, నర్సింలు, సోమేశ్, సుధాకర్, భూపతి, రామ్‌రెడ్డి, శివకోటి సతీష్, కుమ్మరి కుంట వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

గుండెపోటుతో గాదం రాములు యాదవ్ మృతి



గాదం రాములు యాదవ్ (ఫైల్)

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని బీఆర్ఎస్ పూడూరు గ్రామ మాజీ అధ్యక్షుడు గాదం రాములు యాదవ్ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. దీంతో పూడూరు గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో నుంచి బీఆర్ఎస్ పార్టీకి విశేషంగా సేవలు అందిస్తూ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. అదేవిధంగా పూడూరు, చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న దేవాలయాల్లోని అమ్మవార్లకు పంచ లోహాలతో ఆభరణాలు తయారు చేయిస్తూ తన దైవభక్తిని చాటుకున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ మాజీ సీఎం కేసీఆర్ తనకు ఆదర్శ నాయకుడని ఎల్లప్పుడూ చెబుతూ ఉండేవారు. గాదం రాములు యాదవ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీనిలోటని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. సోమవారం డీసీ రాజు అధ్యక్షతన మల్కాజిగిరి సర్కిల్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రజావాణికి ఆయన పలు కాలనీవాసులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారుల దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ముఖ్యంగా మల్కాజిగిరి డాల్ఫిన్ హోటల్ వెనుక వీధిలో పైప్‌లైన్ పనులు, గ్రీన్‌వెస్ట్ లిఫ్టింగ్, ప్రాపర్టీ టాక్స్ తదితర సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ కోరారు. దీనికి డీసీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశిష్, రేంజిత్ నాయిర్, తేజ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 149 అర్జీలు : జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 149 అర్జీలను పీడీ, డీఆర్‌డీవో పద్మజతో కలిసి స్వీకరించినట్టు జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి తెలిపారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'గావ్ చలో అభియాన్'



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బీజేపీ అధిష్టానం ఆదేశానుసారం వినాయక్‌నగర్ డివిజన్ అధ్యక్షులు ఓం ప్రకాష్ ఆధ్వర్యంలో వినాయక్ నగర్‌లో 'గావ్ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం హయాంలో చేసిన అభివృద్ధి పనులు వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి పార్టీని మరింత బలోపేతం చేస్తూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తున్నామని ఓం ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ యాదవ్, శక్తి కేంద్రం ఇన్చార్జిలు మౌలాలి డివి జన్ అధ్యక్షుడు సాయి బాబా, శ్రీకాంత్ యాదవ్, ఉపాధ్య క్షులు సాల్వేరి భాస్కర్, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

కృష్ణానది జలాలలో తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసం చేపట్టిన 'చలో నల్లగొండ' పోస్టర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం ఆవిష్కరించారు.

-నవతెలంగాణ,కాప్రా



ప్రభుత్వ భూమిలో నిర్మాణాలను నిలుపుదల చేయాలి

- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో అధికారులకు నాగారం మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి ఫిర్యాదు



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 291లో గల ప్రభుత్వ భూమిలో చేపడుతున్న నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి సోమవారం మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కొందరు వ్యక్తులు తప్పుడు ధృవపత్రాలు సృష్టించి జీవో 59 ద్వారా నాగారం సర్వే నంబర్ 291లో గల ప్రభుత్వ భూమిని రెగ్యులరైజ్ చేసుకున్నారని పేర్కొన్నారు. ఆ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్లను రద్దు చేసి ప్రభుత్వ భవనాల నిర్మాణాలు చేపట్టడానికి నాగారం మున్సిపల్ కౌన్సిల్ కూడా తీర్మానం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

టీచ్ ఫర్ ఛేంజ్ ఫ్యాషన్ షో..



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ నోవాటెల్‌లో ప్రముఖ సినీనటి లక్ష్మీ మంచు ఆధ్వర్యంలో పేద విద్యార్థుల చదువులకు నిధుల సమీకరణ కోసం ప్రతి ఏటా నిర్వహించే టీచ్ ఫర్ ఛేంజ్ ఫ్యాషన్ షో మరోసారి నగరవాసులకు వావ్ అనిపించింది. టీచ్ ఫర్ చేంజ్ వార్షిక నిధుల సమీకరణ ఫ్యాషన్ షో కోసం ఈ సారి షో స్టాపర్‌లుగా శ్రుతి హాసన్, శ్రియా శరణ్, హర్షవర్ధన్‌తోపాటు ప్రముఖ క్రీడాకారులు సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్ వంటి ప్రముఖులు కూడా ర్యాంప్ వాక్ చేశారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు టీచ్ ఫర్ చేంజ్ వార్షిక నిధుల సమీకరణ కోసం సోమవారం 9వ ఎడిషన్ లక్ష్మీ మంచు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్టార్-స్టడెడ్ సెలబ్రిటీ ఫ్యాషన్ షోతో ఈ సారి నగర వాసులను కండ్లు చెదురే షోగా నిలిచింది. ఈవెంట్‌లో మహిళల దుస్తుల కోసం ప్రఖ్యాత ఫ్యాషన్ మాస్ట్రోలు అమిత్ జీటీ, పురుషుల దుస్తుల కోసం శశాంక్ చెల్మిల్లా రూపొందించిన డిజైన్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి సిద్ధార్థ ఫైన్ జ్యువెలర్స్ ఆభరణాలను అందజేస్తుంది. ఈ సందర్భంగా లక్ష్మీ మంచు మాట్లాడుతూ "ది టీచ్ ఫర్ చేంజ్ ఫ్యాషన్ షో కేవలం స్టైల్, గ్లామర్ మాత్రమే కాదు, బీద పిల్లల జీవితాల్లో అర్థవంతమైన మార్పును సృష్టించడానికి చేస్తున్న గొప్ప ప్రయత్నం. ఈ ప్రయత్నంలో ఎంతో మంది పెద్ద మనసుతో ముందుకు వచ్చి తమ వంతు సాయాన్ని అందిస్తున్నారు. నిధులను సేకరించి విద్యార్థులకు వాటిని అందించి వారి భవిష్యత్‌లో భాగం అవ్వాలనే ఆలోచనతో ముందుకెళ్తున్నాం' అని తెలిపారు. శ్రియా సరణ్ మాట్లాడుతూ "టీచ్ ఫర్ చేంజ్స్ వార్షిక ఫ్యాషన్ షో నిధుల సమీకరణలో భాగమవ్వడాన్ని గౌరవంగా భావిస్తున్నాం. విద్య ప్రాథమిక హక్కు, టీచ్ ఫర్ చేంజ్ వంటి కార్యక్రమాలు ఇలాంటి మార్పునకు చాలా అవసరం. ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుంది' అని తెలిపారు. హర్షవర్ధన్ రాణే మాట్లాడుతూ కొన్నేండ్లుగా మంచు లక్ష్మీ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు టీచ్ ఫర్ చేంజ్ చొరవలో భాగం కావడం అద్భుతమన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమంలో తాను భాగమవ్వడం, వారి కోసం ఫ్యాషన్ షోలో పాల్గొనడం గొప్ప అనుభూతి అన్నారు. ఈ కార్యక్రమంలో సీరత్, ఫరియా అబ్దుల్లా, అవంతిక మిశ్రా, లేఖా ప్రజాపతి, అలేఖ్య హారిక, రాశిసింగ్, అక్షరగౌడ, అశోక్‌గల్లా, ప్రదీప్ మాచిరాజు, విరాజ్ అశ్విన్, సుధీర్ బాబు, అదిత్, శివ కంద్కూరి, బ్యాడ్మింటన్ క్రీడాకారులు సైనా నెహ్వాల్, పారుపల్లి కశ్యప్, నోవాటెల్ జనరల్ మేనేజర్ రాబిన్ చేరియన్ తోపాటు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ట

నవతెలంగాణ-అల్వాల్

బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ పునః ప్రతిష్ట చేసే ప్రక్రియలో భాగంగా పాత ధ్వజస్తంభం తొలగింపు సందర్భంగా సోమవారం హోమాలు నిర్వహించారు. వచ్చే 19వ తేదీన పునఃప్రతిష్ట కార్యక్రమం ఉంటుందని ఆలయ చైర్మెన్ రాజా సంజయ్ గోపాల్, ఈవో వీరేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో ధ్వజస్తంభ దాతలు రామచంద్రరావు, సురేందర్‌రెడ్డి శివ, రామకృష్ణ, నాగేష్, అర్చకులు పాల్గొన్నారు. ప్రతీ సోమవారం అన్న ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు మధు తెలిపారు.

నవతెలంగాణ

11

కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్

మంగళవారం | ఫిబ్రవరి 13, 2024 | www.navatelangana.com

ప్రజావాణిలో వచ్చిన ప్రతీ ఫిర్యాదును పరిష్కరించాలి



- కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణంగా పరిశీలించి పరిష్కరించాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్ అన్నారు. సోమవారం కూకట్‌పల్లి జోనల్ పరిధిలోని పలు సర్కిల్‌ల నుంచి మొత్తం 29 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూకట్‌పల్లి జోనల్ పరిధిలోని మూసాపేటలో 2, కూకట్ పల్లి 1, కుత్బుల్లాపూర్ 9, గాజులరామారం 7, కూకట్ పల్లి జోనల్ కార్యాలయం 10 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదులను పెండింగ్లో ఉంచకుండ త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

మాజీ ఉప రాష్ట్రపతికి శుభాకాంక్షలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఇటీవల అత్యున్నతమైన పద్మ విభూషణ్ పురస్కారం పొందిన జాతీయ స్థాయి రాజకీయ సీనియర్ నేత, దేశ మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుకు సోమవారం గచ్చిబౌలిలోని అన్వేయ కన్వెన్షన్‌లో సత్కార కార్యక్రమం జరిగింది. ఆయనను కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ కలిసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

మున్సిపల్ కార్మిక ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలి



- సీఐటీయూ జిల్లా నాయకులు ఎం. చంద్రశేఖర్
- తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం

నవతెలంగాణ-దుండిగల్

మున్సిపల్ కార్మిక ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం గేటు వద్ద తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పి.పెంటయ్యలు మాట్లాడుతూ ఈ నెల 16 దేశ వ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆరోజు మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపల్, కార్పొరేషన్ల అభివద్ధికి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు కనీస వేతనం రూ. 26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీసం ఏపీలో మాదిరిగా రూ. 24,500 వేతనం నిర్ణయించాలన్నారు. కార్మికులకు నెలకు నాలుగు వారాంతపు సెలవులతో పాటు పండుగ సెలవులను అమలు చేయాలని కోరారు. అధికారులు నిర్లక్ష్యంగా కార్మికుల వేతనాలలో కోతలు విధిస్తున్నార న్నారు. కార్మికులకు రూ. 25 లక్షల ఇన్సూరెన్స్ బెనిఫిట్ కల్పించాలన్నారు. కార్మికులకు వేతనాలు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తో పాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. అర్హులైన మున్సిపల్ కార్మికులందరికీ డబుల్ బెడ్రూమ్ ఇల్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశానంతరం సమ్మె గోడ పత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు నాగ శేషు, వెంకన్న, సత్యనారాయణ, కమలమ్మ నరసింహ, మనీ పాల్గొన్నారు.

‘పీఎం విశ్వకర్మ’తో చేతి వృత్తులకు చేయూత

- మేడ్చల్-మల్కాజిగిరి ఎక్కువ శాతం పట్టణీకరణ జిల్లా
- విద్యా రుణాలు అధికంగా ఇస్తే యువతకు తోడ్పాటు
- లక్ష్యాలకు అనుగుణంగా అర్హులైన లబ్దిదారులకు రుణాలివ్వాలి
- జిల్లా కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

పీఎం విశ్వకర్మ స్కీం ద్వారా అంతరించిపోతున్న చేతి వృత్తుల వారికి చేయూత ఇచ్చినట్టు అవుతుందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో డీసీసీ, డీఎల్‌ఆర్సీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితో కలిసి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ 18 రకాల చేతి వత్తుల వారికి పీఎం విశ్వకర్మ స్కీం ద్వారా ఆర్థిక సహాయం అందించడం ద్వారా అంతరించి పోతున్న హస్త కళలకు జీవం పోసినట్టు అవుతుందన్నారు. ఈ స్కీం కోసం దరఖాస్తు చేసుకునే లబ్దిదారులు ఆధార్, రేషన్ కార్డులు జత చేసి గ్రామ పంచాయతీల్లో సమర్పించాలని తెలిపారు. ఈ దరఖాస్తులను జిల్లా స్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు కార్డు అందజేస్తామని తెలిపారు. గుర్తింపు కార్డు పొందిన వారికి అవసరమైన ఉపకరణాలు ఈ పీఎం విశ్వకర్మ స్కీం ద్వారా మొదటి విడతగా రూ.50 వేలు, తదుపరి అవసరమైన మేరకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణం ఇవ్వనున్నట్టు తెలిపారు. 2023 -24 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక లక్ష్యం రూ.18,370 కోట్లు కాగా, రూ.44,287 కోట్లు మంజూరు చేసి 241 శాతంతో లక్ష్యాన్ని అధిగమించారన్నారు. లక్ష్య సాధనలో వెనుకబడిన బ్యాంకర్లు తమ పనితీరును మెరుగు పర్చుకోవాలన్నారు. పట్టణ ప్రాంతమైన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో యువత ఉన్నత విద్య కోసం ఎక్కువ శాతం రుణాలు అందించడం ద్వారా యువత ఉన్నత విద్యా ప్రమాణాలను పొంది వారి బంగారు భవిష్యత్‌కు మైలు రాయి అవుతుందన్నారు. రైతులకు పంట రుణాలు, టర్మ్ లోన్‌లు, వ్యవసాయ అనుబంధ రుణాలు విరివిగా అందించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పరిశ్రమలు, డీఆర్‌డీఓ తదితర శాఖల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్య, గహ నిర్మాణం, ఇతర ప్రాధాన్యత రంగాలకు అర్హులైన పేద లబ్దిదారులకు మంజూరు చేయాలని కోరారు. చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి అవగాహన కలిగిస్తూ విరివిగా రుణాలు అందించాలని కోరారు. ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు నిర్దేత గడువు లోగా రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకులో దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలనీ, తిరస్కరణకు గురైన వాటిని పరిశీలించి తగు రీతిలో బ్యాంకులు పంపాలని అధికారులకు సూచించారు. నెలకోసారి లేదంటే రెండు నెలలకోసారి తప్పనిసరిగా బ్యాంకర్స్ బెనిఫిషరీ మీటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల రుణాలను సకాలంలో తిరిగి చెల్లించే విధంగా బ్యాంకర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వన్ టైం సెటిల్‌మెంట్‌పై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగించాలని బ్యాంకర్లకు సూచించారు. ఈ సమావేశంలో కెనరా బ్యాంకు డీజీఎం సంజయ్ కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు, ఆర్బీఐ ఎల్‌డీఓ గోమతి, నాబార్డ్ అధికారి రమేష్, జీఎం డీఐసీ రవీందర్, జిల్లా వ్యవసాయాధికారిణి మేరి రేఖ, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి నీరజా గాంధీ, ఆయా బ్యాంకుల మేనేజర్లు, డీఆర్డీవో పద్మజారాణి, మెప్మా, ఎస్సీ కార్పొరేషన్, డీఐసీ, కేవీఐసీ, ఆర్బీఐ, నాబార్డుతోపాటు జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తల్లిదండ్రుల ఆశీర్వాదమే శ్రీరామరక్ష



- ఠాగూర్స్ పాఠశాల కరస్పాండెంట్ బండారు సాయికుమార్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సృష్టిలో తల్లిదండ్రుల ప్రేమ ఎంతో గొప్పదని వారి ఆశీర్వాదమే విద్యార్థులకు శ్రీరామరక్ష, అని ఠాగూర్స్ హై స్కూల్ కరస్పాండెంట్ బండారు సాయికుమార్ అన్నారు. సోమవారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి, గాంధీనగర్‌లో గల ఠాగూర్స్ పాఠశాల ఆధ్వర్యంలో క్యాంపస్ గ్రౌండ్స్‌లో సంత్ శ్రీ ఆశారాంజీ బాపు ఆశ్రమం, యోగవేదాంత సేవా సమితి (శంషాబాద్)యువ సేవా సంఘం నేతృత్వంలో"అమ్మనాన్న పూజోత్సవ"వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అనే నానుడిని విద్యార్థులు సార్ధకత చేయాలని ఆ విధంగా ఎదగాలని సూచించారు. తల్లిదండ్రుల ప్రాముఖ్యత, ప్రేమ, త్యాగం, సంబంధ బాంధవ్యాలు, కుటుంబ ప్రాముఖ్యత,వంటి గొప్ప గుణగణాల వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతీ ఒక్కరూ తల్లి దండ్రులతో మనోభావాలు పంచుకోవాలని అప్పుడే వారు సంతోషంగా ఉంటారన్నారు. అమ్మానాన్నల సేవలు సృష్టి ఉన్నంతవరకు మరవద్దని అదే వారికి మనమిచ్చే గురుతర బాధ్యత అని స్పష్టం చేశారు. అనంతరం తల్లి దండ్రులకు వారి పిల్లలు(విద్యార్థులు) పాదాభివం దనం చేస్తూ, తల్లిదండ్రుల గొప్ప ఆశీర్వాదం తీసుకు న్నారు. ఈ కార్యక్రమంలో యువ సేవా సంఘం (సాధకులు) సేవా దారులు ఉమేష్ జే.శంకర్, జీ.వీరారెడ్డి, జీ.ధర్మేందర్, జీ.కృష్ణ, జీ.గణేష్ జీ.రమాదీదీ, కవిత దీదీ, పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ బండారు నేహా, సామాజిక సేవకులు ఇక్కుర్తి నారాయణరావు, ఉపాధ్యాయులు చైతన్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కరమే ధ్యేయం



- మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

డివిజన్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలు పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి తెలిపారు. సోమవారం 130 డివిజన్ లోని కార్పొరేట్ కార్యాలయం వద్ద వివిధ కాలనీలకు చెందిన ప్రజలు , పలువురు నాయకులు కార్యకర్తలు అభిమానులు కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు సురేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ప్రారంభోత్సవ, గృహప్రవేశాలతో పాటు శుభకార్యాలకు, వివిధ కాలనీలలో నూతనంగా చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ఆహ్వాన పత్రికలు, వినతి పత్రాలు అందజేశారు. ఈ సంధర్భంగా కార్పొరేటర్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ నూతన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.

పట్టుదలతో చదివితే ప్రతిభవంతులౌతారు



- నారాయణ పాఠశాలల డి.జి.ఎం. గోపాల్ రెడ్డి
- ఘనంగా చింతల్ నారాయణ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

చిన్ననాటి నుండే విద్యార్థులు పట్టుదలతో చదివితే భవిష్యత్తులో ప్రతిభావంతులౌతారని నారాయణ పాఠశాలల డి.జి.ఎం.గోపాల్ రెడ్డి విద్యార్థులకు సూచించారు .ఆదివారం సాయంత్రం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్‌లో గల నారాయణ పాఠశాల(చింతల్ బ్రాంచ్) వార్షికోత్సవ వేడుకలు విద్యార్థుల కేరింతల నడుమ ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు ప్రముఖ క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ అనిత, ఆర్ అండ్ డి డిపార్ట్మెంట్ శ్రీలక్ష్మి, కేపీహెచ్‌బీ జోన్ నారాయణ పాఠశాల ఏజీఎం. వైజయంతిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నారాయణ పాఠశాల (చింతల్) ప్రధానోపాధ్యాయురాలు స్వరాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ వార్షికోత్సవ వేడుకల్లో ముందుగా వారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డీజీఎం.గోపాల్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని అప్పుడే వారు అనుకున్న లక్ష్యాన్ని అవలీలగా సాధిస్తారని తెలిపారు. క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిస్తే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో మంచి స్థాయి ఉద్యోగాలు వస్తాయని ఆ దిశగా ప్రయత్నించాలని ఆకాంక్షించారు.విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న పాఠశాల అధ్యాపక బృందాన్ని, యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు కేపీహెచ్‌బీ జోన్ ఏ.జి.ఎం.వైజయంతి మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంచే ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధతో బోధిస్తు విద్యతోపాటు, సంస్కృతి, సాంప్రదాయాలు, సామాజిక విలువల గూర్చి తెలుపుతూ వారి ఉజ్వల భవితకు పునాదులు వేస్తున్నామన్నారు.విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జె. త్రిశితరెడ్డికి నాట్య విరించి పురస్కారం



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు జె.నర్సింహారెడ్డి మనుమరాలు, ఎస్ జె.త్రిశిత రెడ్డి శిల్పకళా వేదికలో ఆదివారం నిర్వహించారు. జాతీయ స్థాయి శాస్త్రీయ, జానపద నృత్య వేడుకలో నాట్య విరించి జాతీయ స్థాయి పురస్కారం అందుకుంది. త్రిశిత రెడ్డి, న్యాయ శాస్త్రాన్ని అభ్యసిస్తూనే నాట్యం పట్ల తనకు ఉన్న మక్కువతో హైదరాబాద్ నృత్యోదయా కూచిపూడి నాట్య సంస్థలో కూచిపూడి నాట్యాన్ని అభ్యసించారు. నాట్యాన్ని నేర్చుకుంటూనే తారా ఆర్ట్స్ అకాడమీ సారధ్యంలో హైదరాబాదు శిల్పకళా వేదికలో నిర్వహించిన జాతీయ స్థాయి శాస్త్రీయ, జానపద నృత్య వేడుకలో పాల్గొని, అందులో కూచిపూడి సాంప్రదయంలో ఉత్తమ నాట్య ప్రదర్శన కనబర్చినందుకుగాను అకాడమీ వారు “నాట్య విరించి” అను పురస్కారాన్ని బహుకరించారు. ఈ పురస్కారం అందించినందుకు గాను త్రిశిత రెడ్డి కుటుంబ సభ్యులు హర్షాన్ని వ్యక్తం చేశారు. ఇలా యువత సాంప్రదయ నృత్యాలపట్ల ఆసక్తి కనబర్చాలని తద్వారా మన కళలను కాపాడుకున్న వారమవుతామని కళాశాల కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కళాశాల కోశాధికారి జె త్రిలోక్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ విజయం వెనుక ఎంతో కృషి, పట్టుదల దాగి ఉన్నాయని, ఇవి ఉన్నచోట విజయం దానంతట అదే వరిస్తుందని తెలిపారు. పురస్కారాన్ని అందుకున్న తమ కుమార్తె ను అభినందించారు. ఇలాగే తన భవిష్యత్తు ముందుకు సాగాలని కోరారు. ఈ పురస్కారాన్ని అందుకున్న చిరంజీవి త్రిశితను కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్. లోకనాథం కళాశాల సిబ్బంది అభినందించారు.

ఆదమరిస్తే... అంతేసంగతి

- గాంధీనగర్ మూలమలుపులో నోరు తెరుచుకున్న మ్యాన్ హెూల్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అధికారుల ఉదాసీనత, సిబ్బంది నిర్లక్ష్యం బాటసారుల,ప్రయాణికుల పాలిట శాపంగా మారుతుంది. రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ అంబేద్కర్ చౌరస్తా ప్రాంగణంలో ప్రధాన రోడ్డు మూలమలుపు వద్ద మ్యాన్ హెూల్ పై కప్పు గత 15 రోజులుగా లేకపోవడంతో ప్రమాద భరితంగా మారిందని పలువురు వాపోయారు. పారిశ్రామిక వాడ ప్రాంతం కావడంతో నిత్యం వాహనాల రద్దీతో ఆ రోడ్డు బిజీగా ఉంటుంది.రాత్రి వేళల్లో మ్యాన్ హెూల్ కనపడకుండా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు నవతెలంగాణ దృష్టికి తీసుకువచ్చారు.అధికారులు,సిబ్బంది సైతం చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు స్థానిక బస్తీవాసులు మండి పడుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్ హెూల్ పై కప్పు వేయించాలని కోరుతున్నారు.

డాక్టర్ డి.శ్రీనివాస్ రావు మృతి డిపార్ట్‌మెంట్‌కు తీరని లోటు



- జేఎన్టీయూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కట్టా నర్సింహా రెడ్డి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఈసీఈ డిపార్ట్‌మెంట్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ డి శ్రీనివాస్ రావు మృతి డిపార్ట్‌మెంట్‌కు తీరని లోటని జేఎన్టీయూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కట్టా నర్సింహా రెడ్డి అన్నారు. ఈ నెల 10 వ తేదిన ఈసీఈ డిపార్ట్‌మెంట్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ డి శ్రీనివాస్ రావు మృతి చెందడంతో సోమవారం ఓల్డ్ ఐఎస్టీ బిల్డింగ్‌లో సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో ఆయనతో పాటు రెక్టర్ డాక్టర్ విజయ కుమార్ రెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు, యూనివర్సిటీ లో అన్ని డిపాంట్ల ప్రొఫెసర్స్, యూనివర్సిటీ, కాలేజీ అధికారులు, నాన్ టీచింగ్ సిబ్బంది ఈసీఈ డిపార్ట్మెంట్ విద్యార్థి విద్యార్థులు సంతాప సభ లో పాల్గొన్నారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళ్ళులర్పించారు. అనంతరం వైస్ ఛాన్స లర్ డాక్టర్ కట్టా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ కాలేజీ ఓ మంచి అనుభవం గల అధ్యాపకుని కోల్పోవడం చాలా భాధకరమన్నారు. డాక్టర్ శ్రీనివాస్ రావు వ్యక్తిత్వం చాలా మంచిదని, అనేక సందర్భల్లో తనన్ను కలిసి తనకు అప్పగించి పని పట్ల ఆ పని ప్రొగ్రెస్ ను ఇక ముందు చేయబోయే పని విధానం చాలా కులం కుశం గా ఎక్కడ పొరపాటు లేకుండా వివరించే వారన్నారు. రెక్టర్ డాక్టర్ విజయ కుమార్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాస్ రావు మన మధ్య లేరు అన్న విషయం నేను ఇప్పటికి నమ్మలేక పోతున్నానని, అందరికి కావలిసిన వ్యక్తి మంచి ఆలోచన పరుడు అన్నారు. రిజిస్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ యూనివర్సిటీ కాలేజీ ఓ మంచి అనుభవం గల అధ్యాపకుని కోల్పోవడం చాలా విచారకరమన్నారు. డాక్టర్ రావు తన పని విషయం పై వివరణ ఇవ్వడం తనకు గల వృత్తి పరంగా ఉన్న అంకిత భావం తెలుపుతారన్నారు. ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ తనకు డాక్టర్ రావు కి గల వృత్తి పరమైన అనుబంధం వివరించారు. ఈసీఈ డిపార్ట్మెంట్ హెచ్‌ఓడి డాక్టర్ రజని మాట్లాడుతూ డా.రావు మృతి డిపార్ట్‌మెంట్‌కు చాలా లోటు అన్నారు. చాలా చక్కగా, ఎంతో ఓపికగా వృత్తి పరంగా ఎలాంటి సమస్య ఉన్న వారు చాలా ప్రశాంతంగా చేసేవారన్నారు. పలువురు విద్యార్థులు డాక్టర్ రావుతో ఉన్న అటాచ్ మెంట్‌ను వారి బోధన విధానం కొనియాడారు. కాలేజీ నూతన ప్రిన్సిపాల్ డాక్టర్. జీ.వి నర్సింహా రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ రావులో మంచి విషయ పరిజ్ఞానం, ఉద్యోగం పట్ల భాద్యత, విద్యార్థుల పట్ల శ్రద్ధ, తనకు యూనివర్సిటీ అధికారులు ఇచ్చిన పనిని మళ్ళీ ఎవ్వరు కూడ వేలు ఎత్తి చూపకుండా మంచి క్రమశిక్షణతో పని పూర్తి చేసి ఇన్ టైమ్‌లో ఇచ్చేవారన్నారు.

ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలి



- సామాజికవేత్త, పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్లలోని పలు ప్రాంతాలలో నాణ్యతలేని పాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా దుకాణదారులు, టిఫిన్ సెంటర్స్,ఫాస్ట్ ఫుడ్స్ సెంటర్స్, కూరగాయల విక్రయదారులు వాడుతున్నారని పర్యావరణ ప్రేమికుడు,సామాజికవేత్త కోలా రవీందర్ ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు సోమవారం గాజులరామారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో డిసి మల్లయ్యకు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా వినియోగదారులకు ఇస్తు పర్యావరణాన్ని నాశనం చేయిస్తున్నారని అటువంటి వారిపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్లాస్టిక్ కవర్ల తయారీ యూనిట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. నాణ్యమైన ప్లాస్టిక్ కవర్లు, చేతిసంచులు, వాడేవిదంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు, యన్.బిక్షపతి గౌడ్ పాల్గొన్నారు.

కాలనీ వాసులకు అండగా ఉంటా



- కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కాలనీ వాసులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని గౌతమి నగర్‌లో బీఎంఆర్ రేసిడెన్సికి ఆనుకొని ప్రణీత్ కన్స్ట్రక్షన్ చేపట్టిన భారీ బహుళ అంతస్తుల సెల్లార్ తవ్వడంతో సెంట్రల్ డ్రయినేజీ కూలిపోవడంతో విషయం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి కార్పొరేటర్ వెళ్లి కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గౌతమి నగర్‌లో బీఎంఆర్ రేసిడెన్సి వద్ద సెల్లార్ వల్ల నెలకొన్న సమస్యను కాలనీ వాసులు తన దృష్టికి తీసుకొని రావడంతో వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి కాలనీ వాసులతో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. సెల్లార్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేసి తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బారికేడ్లు, ఇసుక బస్తాలు వేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. జేఎన్టీయూ నుండి పర్మిషన్ వచ్చే వరకు సెల్లార్ నిర్మాణ పనులను చేపట్టవద్దని హెచ్చరించారు. ప్రజలకు కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేయాలని బిల్డర్‌కి ఆదేశించారు. కాలనీ వాసులు ధైర్యంగా ఉండాలన్నారు. చిన్న పిల్లలు, పెద్దలు, కాలనీ వాసులు అటు వైపు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ని గాజులరామారం శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులు తన నివాసం వద్ద కలిసి, ఈ నెల 18 న జరిగే శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర మహెూత్సవానికి ఆహ్వానించారు. మరియు రిట్జ్ టవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రీ రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహెూత్సవానికి శ్రీశైలం గౌడ్ ని ఆహ్వానించారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

12

సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్

మంగళవారం | ఫిబ్రవరి 13 2024 | www.navatelangana.com

చిరంజీవిని కలిసిన వేణుగోపాల్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

మెగాస్టార్ చిరంజీవికి పద్మ విభూషణ్ అవార్డు వచ్చి న సందర్భంగా లాలపేటకు చెందిన వేణుగోపాల్ రెడ్డి చిరంజీవి బ్లడ్ బ్యాంకులో మెగాస్టార్‌ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఫంక్షన్‌హాల్ పెండింగ్ పనులు పూర్తి చేయాలి

నవతెలంగాణ-ధూల్‌పేట్



గోషామహల్ చుడీబజార్‌లో డాక్టర్. అంబేద్కర్ ఫంక్షన్‌హాల్ పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని బంమిత్ర సంఘం నాయకులు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో నగర మేయర్ గద్వాల్ విజయ లక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు సుమన్ కుమార్ మా ట్లాడుతూ అంబేద్కర్ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులు పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అసంపూర్తి పనులు చేసి వదిలేశారని వాపో యారు. స్థాని కంగా నిరుపేదలకు పెండ్లిళ్లు, ఫంక్షన్లను చేసుకునేందుకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో మెగా రక్తదాన శిబిరం..

- డాక్టర్ లోకేష్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా పలువురు రక్తదానం

నవతెలంగాణ-ఓయూ



టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ మెంబర్ అండ్ స్ట్రాటజీ కమిటీ మెంబర్ డాక్టర్ లోకేష్ యాదవ్ జన్మదినోత్సవం సందర్భం గా సోమవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట ఉస్మానియా విద్యార్థులు, నిరుద్యోగులు, యువకుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలసేమియాతో, రక్తహీనత తో బాధపడే వారికోసం భారీ రక్తదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి డాక్టర్స్, టీం వారితో రక్త సేకరణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థి నాయకులు నాయకులు వికాస్, శ్రీనివాస్ యాదవ్,రామచంద్రయాదవ్, లెనిన్, శ్రావణ్, వినోద్, మనోహర్, శంకర్ యాదవ్, పాల్గొన్నారు.

చలో నల్లగొండ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ

బీఆర్ఎస్ నాయకత్వం కృష్ణా నదీ జలాల సమస్య పై మంగళవారం నిర్వహిస్తున్న 'చలో నల్గొండ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు. చలో నల్లగొండ కార్యక్రమం ఏర్పాట్లు, జన సమీకరణ తదితర అంశాలపై ఆయన సోమవారం సితాఫలమండీ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి అడ్డగుట్ట, సితాఫల్ మండీ, మెట్టుగూడ, బౌద్ధనగర్, తార్నాక డివిజన్లకు సంబంధించి ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో కార్యకర్తలను నల్గొండ సభకు తరలించాలని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా సూచించారు. తాము మాత్రమే తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించ గలుగుతామన్నారు.కార్పొరేటర్లుకందిశైలజ, రాసురి సునీత, నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆకట్టుకున్న 'గ్రాండ్ గాల కార్నివాల్'



నవతెలంగాణ-బంజారాహిల్స్

హైదరాబాద్ నగరంలో 'గ్రాండ్ గాల కార్నివాల్' ఈవెంట్ సోమవారం ఎంతో అట్టహాసంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'గ్రాండ్ గాల కార్నివాల్' వేడుకలో యువత ఉత్సాహం ఉరకలెత్తిందని, ఫ్యా మిలీలు కూడా ఈ వేడుకలో పెద్ద ఎత్తున పాల్గొని ఈ సంబరానికి అదనపు ఉత్సాహాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈవెంట్‌లో క్యావి అండ్ ఎల్వీఎం బ్యాండ్, మ్యూజిక్ ప్రత్యేక ఆకర్ష ణగా నిలిచిందన్నారు. నాన్ స్టాప్ పాటలతో చిన్న, పెద్ద,యువత ఈవెంట్‌కు హాజరైన ఒక ట్రాన్స్‌లో డ్యాన్స్ చేసేలా ఆలపించారు. వింటేజ్ సాంగ్స్‌తో ప్రారంభమై పెట్టి రొమాంటిక్ సాంగ్స్ కలిపి పాప్ సాంగ్స్ వరకు వచ్చిన ఆడి యెన్స్ చిందులేసేలా యమ జోరుతో పాడి గ్రాండ్‌గాల కర్నివాల్ విజయోత్సవంలో తమ వంతు పాత్ర వహించారు. ఇక నగరం మొత్తం ఇక్కడే ఉందా అనేంత జనం. జంటలుగా యువత, స్నేహి తులతో, కుటుంబాలతో ఈవెంట్ మొత్తం సందడిగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఘనంగా జరిగిన కార్య నిహార్వాహణ కమిటీ సభ్యులు త్వరలోనే పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

రైతులకు గ్రామ ప్రజలకు నష్టాన్ని చేకూర్చే ఐఎంఆర్ ఆగ్రో రెండ్ రింగ్ సంస్థలను తొలగించాలి

- ఆవేదనను ఆవేదనను వెలిబుచ్చిన అప్పి రెడ్డిపల్లి గ్రామ శివారు ప్రజలు, రైతులు



నవతెలంగాణ-బంజారాహిల్స్

రంగారెడ్డి జిల్లా మాడుగుల మం డలం అప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన బొక్కల కంపెనీని వెంటనే తొలగించాలని అప్పి రెడ్డిపల్లి గ్రామ శివా రు ప్రజలు,రైతులు కోరు తున్నారు. ఈ సందర్భంగా సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సుమారుగా 150 మంది శివారు రైతులు మీడియా ఎదుట తమ ఆవేదన వెలబుచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గతంలో ఈ కంపెనీని ప్రారంభించిన ప్పుడు అన్ని గ్రామాల రైతులు అడ్డుకున్నామని, అప్పుడు కంపెనీని ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ ఏర్పాటు చేయమని వాగ్దానం చేసిన కంపెనీ యాజమాన్యం, తిరిగి 20 రోజుల క్రితం మరలా కంపెనీని ప్రారంభించారని, ఈ కంపెనీ వలన కంపెనీ పరిసరాలలో చుట్టూ ఉన్న పది గ్రామాల ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నారని తెలి పారు. పలువురు ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా రని, జంతువులు కూడా రోగాలతో చనిపోతున్నాయన్నారు. గర్భిణీలు, చిన్నపిల్లలు శ్వాస ఆడక ఇబ్బంది పడు తున్నారని, పొలాలలో కూలి పనులకు వచ్చే వారు దుర్వాసనతో పనిచేయలేక ఇబ్బందులకు గురువుతున్నారన్నారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ,ఎమ్మె ల్సీలకు కూడా ఫిర్యాదు చేశామని, చర్యలు తీసుకోలేదని, పొల్యూషన్ బోర్డ్, పూర్తిగా విచారించకు ండానే, స్థానికులతో మాట్లాడకుండానే పొల్యూషన్‌కు అనుమతించారని, అధి.కారులు, నాయకులు కంపెనీకి మద్దతు తెలిపి మరల ప్రారంభిం చటానికి సహకరించారని స్థానిక రైతులు ఆవేదన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమీప గ్రామ సర్పంచులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

యాదన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకం



నవతెలంగాణ-ఓయూ

శ్రీసర్దార్ సర్వాయి పాపన్న జన్మస్థల మైన జనగామ జిల్లా ఖిల్లాఃషాపూర్ గ్రామ సర్పంచిగా 23 సంవత్స రాలు విశిష్ట సేవ లందించి 5 ఫిబ్రవరి స్వర్గస్థులైన దూడల యాదగిరి జీవిత చరిత్రపై ఉస్మానియా ఆర్ట్స్‌కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. చింతా గణే ష్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూడల యాదన్న జీవితం భవిష్యత్తు ప్రజాప్రతిని ధులకు స్ఫూర్తిదాయకమని, నేటి విద్యార్థులు, యువకులు ఇలాంటి గొప్ప విలువలు, ఆశయాల వ్యక్తిని స్ఫూర్తి తీసుకొని సమాజంలో భాగస్వాములు అవ్వాలని కోరారు. సోషల్ సైన్సెస్ డీన్ ప్రొ.అర్జున్‌రావు, మాట్లాడు తూ గ్రామ అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన నిస్వార్థ రాజ కీయ నాయకుడిగా జీవించిన యాదన్న జీవితచరిత్ర నేటి నాయకులకి ఆదర్శవంతన్నారు. ఉస్మాని యా సివిల్ సర్వీసెస్ అకాడమీ డైరెక్టర్ ప్రొ.కొండా నాగేశ్వరరావు మాట్లాడుతూ చారిత్రక గ్రామమైన ఖిల్లాఃషాపూర్ గ్రామ స్థుల నిజాయితీ, చైతన్యం,పోరాట పటిమ, అంకితభావం శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న చరిత్ర నుండి దూడల సాలమ్మ, వారి కు మారుడైన దూడలయాదన్న వరకు స్ఫూర్తి నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ. చల్లమల్ల వేంకటేశ్వర్లు, డా.టి.ప్రే మయ్య, డా.రజేంద్రనాయక్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రవినాయక్ అన్ని విద్యార్థి సంఘాల నాయకులు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వయోపరిమితి పెంచాలి : డా.ముత్యం గౌడ్

నవతెలంగాణ-ఓయూ

ఉద్యమ కాలంలో, గత బీఆర్ఎస్ ప్రభు త్వ హయాంలో మేము 15 సంవత్సరాల కాలా న్ని కోల్పోయామని, ముఖ్యమంత్రి దీని దృష్టిలో పెట్టుకొని, త్వరలో జారీ చేయబోవు గ్రూప్-1 నోటిఫికేషన్‌లో యూ నిఫాం పోస్టులకు కూడా 46 సంవత్సరాల వరకు వయసు పెంచాలని డా.పొన్నం. ముత్యం గౌడ్ సూచించారు. గత ప్రభుత్వం చేసిన తప్పును ఈ ప్రభుత్వం చేయకూడదని ఆయన విజ్ఞప్తి చేశారు. సప్లిమెంట్ నోటిఫికేషన్‌లో యూ నిఫాం పోస్టులకు కూడా 46 సంవత్సరాల వరకు వయసు పెంచాలని డా.పొన్నం. ముత్యం గౌడ్ సూచించారు. గత ప్రభుత్వం చేసిన తప్పును ఈ ప్రభుత్వం చేయకూడదని ఆయన విన్నవించుకున్నట్లు తెలిపారు.

ఓయూ తెలుగు శాఖ ఆధ్వర్యంలో తొలి తెలుగు సాహిత్య మహాసభ-2024

- దేశవ్యాప్తంగా పాల్గొననున్న 350 ప్రతినిధులు
- పత్రాల సమర్పణలు, ప్రసంగాలు, పాఠాలు, కవితలు, కథ, పద్యాలపై విశ్లేషణ





నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ సామాజిక, రాజకీయార్థిక చలనాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఒక ప్రత్యక్ష సాక్ష్యం. 1919 సంవత్సరంలో ఏర్పడ్డ తెలుగు శాఖ బోధన, పరిశోధన రంగాల్లో ప్రమాణాలను నెలకొల్పుతూ వందేళ్లను పూర్తి చేసుకున్న విషయం తెల్సిందే. సాధికారికమైన పరిశోధన విలువలను తెలుగు సమాజానికి అందించిన తెలుగు శాఖ మరొక నూతన సాంస్కృతో ముందుకు వస్తుంది.

ఫిబ్రవరి 15 నుండి 17 వరకు నిర్వహించనున్న తెలుగు సాహిత్య మహాసభ


ఓయూ ఆర్ట్స్ కాలేజి వేదికగా ఫిబ్రవరి 15, 16, 17 తేదీల్లో తెలుగు లీటరరి కాంగ్రెస్-2024, తెలుగు సాహిత్య మహాసభ -2024 నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఓయూ తెలుగు శాఖా ధ్యక్షులు ప్రొఫెసర్ సి.కాశీం ఈ లిటరరీ కాంగ్రెస్‌కు కన్వీనర్ వ్యవహ రించనున్నట్లు తెలిపారు.

అనేక అంశాలపై లోతైన చర్చ

శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి క్రమంలో బోధన, పరిశోధన రంగాల్లో వస్తున్న నూతన పరిణామాలను చర్చించుకునేందుకు చరిత్రకు సంబంధించి "హిస్టరీ కాంగ్రెస్", ప్రకృతి శాస్త్రాలకు సంబంధించి "సైన్స్ కాంగ్రెస్" వంటివి ఏర్పడి విప్లవాత్మకమైన మార్పును తీసుకువచ్చాయి. ఇటువంటి వాతావరణమే తెలుగు భాష, సాహిత్యాలకు అవసరమని భావించిన తెలుగు శాఖ తెలుగు లీటరరి కాంగ్రెస్-2024ని నిర్వహణకు పూనుకుంది. ఈ కార్యక్రమంలో ఎంపిక చేసిన వారు మాత్రమే ప్రతినిధులుగా పాల్గొంటున్నారు.

హాజరు కానున్న ప్రముఖ కవులు, రచయితలు, సాహిత్య నిష్ణాతులు

మూడు రోజులు జరిగే ఈ సమావేశంలో దేశ వ్యాప్తంగా తెలుగు భాష, సాహిత్య, పరిశోధన రంగాల్లో కృషి చేస్తున్న ప్రముఖ కవులు, రచయితలు, పరిశోధకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే వివిధ భాష, సాహిత్య విషయాల్లో నిష్ణాతులైన 100 మంది విషయ నిపుణులు పత్ర సమర్పణ చేస్తారు. సాహిత్య శిల్పం, సాహిత్య మూల్యాంకనంఅంశాలపై ఫానల్ డిస్కషన్స్ తదితర విషయాలు నిర్వహిస్తారు.



సాహిత్యాన్ని సాధారణ ప్రజలకు, విద్యార్థుల వరకు తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో 15, 16 తేదీల్లో సాయం త్రం సాహిత్య, కళాభిమానుల కోసం కవితా పొద్దు, కవితా వసంతం అనే రెండు కవిగాయక సభలను నిర్వహి స్తారు. ఈ రెండు సమావేశాలలో అధిక సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు, కళాభిమానులు పాల్గొని కవిగాయక సభలను విజయవంతం చేయాల్సిందిగా తెలుగు లిటరరీ కాంగ్రెస్ - 2024 కన్వీనర్ ప్రొ.సి. ఖాశీం.కోరారు.

పాటల కవులు : అందెశ్రీ,జయరాజు, విమలక్క, యోచన, నలిగంటి.శరత్, మాట్ల.తిరుపతి, చింతల యాదగిరి, కింకిపాటి.రాజా తదితరులు పాల్గొంటారన్నారు.

వచన కవులు : దర్భశయనం శ్రీనివాసాచార్య, కొండేపూడి.నిర్మల, శిఖమణి, యాకుబ్, విల్సన్ సుధాకర్, అన్నవరం దేవేందర్, పగడాల. నాగేందర్, సుద్దెంఖి.యాదగిరి,పొన్నాల.బాలయ్య, తగుళ్ల.గోపాల్, పల్లిపట్టు నాగరాజు,మహేశ్వరం అంబదాస్ పాల్గొంటారు.

కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత కె.శివారెడ్డి, జాతీయ ఉత్తమ సినిగేయ పురస్కార గ్రహీత సుద్దాల అశోక్ తేజ, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత గోరటి. వెంకన్న, ప్రముఖ కవి జూకంటి జగన్నాథం ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

నూతన సీఐకు శుభాకాంక్షలు తెలిపిన సీఐటీయూ నేతలు



నవతెలంగాణ-బేగంపేట్

గోపాలపురం పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన నర్సింగరావుకి, ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన సైదులుని భగత్‌సింగ్ ఆటోయూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం కలిసి పుష్ప గుచ్ఛం అందజేపి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ సీఐటీ యూ జోన్ కార్య దర్శి టీ.మహేందర్ మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపా డటంతో పాటు పేదల, కార్మికుల సమస్యలు పరిష్కరిం చడంలో సానుకులంగా ఉండాలని కోరారు. పోలీస్‌స్టేషన్ లు అంటే పేదలు ఇంకా భయపడుతున్నారు, ఫ్రెండ్లీ పోలీ సింగ్‌ను ప్రజల్లో ఇంకా అవగాహన తీసుకురావాలని, ఆటోలు నడుపుకునే వారిని కొంత మంది పోలీసులు అకారణంగా చలానాల పేరుతో వేధించి, కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నసింగరావు స్పందించి అటో డ్రైవర్స్ క్రమశిక్షణ లేకుండా న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్నారని, దాని వలన ఇబ్బందులు వస్తున్నాయని, క్రమ శిక్షణతో, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఉండాలన్నారు.భగత్‌సింగ్ ఆటో యూనియన్ అధ్యక్షులు చిన్న, కార్య దర్శి, ఆర్గనై జింగ్ సెక్రటరీ మచ్చేందేర్, ఉపాధ్యక్షులు కైలాస్, సందీప్, పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీలో ప్రజావాణిలో 164 విన్నపాలు



- సికింద్రాబాద్‌లోని ఇంటి సమస్యను పరిష్కరించాలంటూ కలకత్తా నుంచి ఫోన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ పరిధిలో నిర్వహిస్తున్న ప్రజావాణి, ఫోన్‌ఇన్ కార్యక్రమానికి నగర వాసుల నుంచే కాకుండా ఇతర రాష్ట్రల నుంచి విశేష స్పందన వస్తోంది. ప్రతి సోమవారం జీహెచ్ఎంసీ వ్యాప్తంగా సర్కిల్, జోన్, హెడ్ ఆఫీస్‌లలో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుండి విన్నపాలను అధికారులు స్వీకరింస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మొత్తం 164 విన్నపాలు వచ్చాయి. ఇందులో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో 76 విన్నపాలు వచ్చాయి. 66 దరఖాస్తులు రాగా మరో 10 ఫోన్‌ఇన్ ప్రోగ్రాం ద్వారా ఫిర్యాదులు వచ్చాయి. ఓ వ్యక్తి ఫోన్ ఇన్ ప్రోగ్రామ్ ద్వారా కలకత్తా నుండి ఫోన్ చేశాడు. సికింద్రాబాద్‌లో తన ఇంటి సమస్యను పరిష్కరించాలని కోరడంతో అధికారులు పూర్తి వివరాలను నమోదు చేసుకున్నారు. ఇదిలావుండగా చార్మినార్ జోన్‌లో 8 దరఖాస్తులు రాగా, సికింద్రాబాద్ జోన్ 13, కూకట్ పల్లి జోన్ 29, శేరిలింగంపల్లి జోన్ 12, ఖైరతాబాద్ జోన్‌లో 1, ఎల్బీనగర్ జోన్‌లో 25 విన్నపాలు స్వీకరించారు. ఇప్పటి వరకు నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను పరిష్కరించామని అధికారులు తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు అర్జీ దారుడు సమర్పించిన సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారితో పాటు అర్జీ దారినికి లేఖ పూర్వకంగా సమాచారం అందిస్తు న్నారు. యుద్ధప్రాతిపదికన దరఖాస్తులను పరిష్కరింస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ అడ్మిన్ సరోజ, యాదగిరిరావు, సితఈ దేవానంద్, టౌన్ ప్లానింగ్ అధికారులు విన్నపాలను స్వీకరించారు. హెచ్.ఓ.డిలు డాక్టర్ పద్మజ, డాక్టర్ రాంబాబు, హౌసింగ్ ఎస్.ఈ విద్యాసాగర్, ఓ ఎస్ డి అనురాధ, ఏ.ఎం.సీ శారద, యస్.బీ.ఎం.ఎం ప్రాజెక్ట్ మేనేజర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండలో బీఆర్ఎస్ సభ విజయవంతం చేద్దాం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

ఈనెల 13న నల్లగొండలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీమంత్రి, సనత్‌నగర్ బీఆర్ఎస్ తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం వెస్ట్ మారేడపల్లిలోని తన నివాసం వద్ద సనత్ నగర్ నియో జకవర్గ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాల పరిరక్షణ, కృష్ణానది పై ఉన్న ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి అప్పగించడానికి వ్యతిరేకంగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తే భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ సభకు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ హాజరవుతారన్నారు. 13 వ తేదీ ఉదయం 9.00 గంటలకు మారేడ్‌పల్లిలోని మున్సిపల్ గ్రౌండ్ నుండి ర్యాలీగా నల్లగొండ సభకు బయలుదేర నున్నట్లు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, అత్తిలి మల్లికార్జున్ గౌడ్, లలితా చౌహన్, బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చలసాని సాయి కిరణ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు కొలను బాల్ రెడ్డి, హన్మంతరావు, గుర్రం పవన్ కుమార్ గౌడ్, వెంకటేషన్ రాజు, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు తలసాని మహేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పీజీ 3వ సెమిస్టర్ ఎగ్జామ్స్ వెంటనే వాయిదా వేయాలని ఆందోళన



నవతెలంగాణ-ఓయూ

ఓయూ పీజీ 3వ, సెమీస్టర్ ఎగ్జామ్స్ వెంటనే వాయిదా వేయా లని సోమవారం జరుగుతున్న ఇం టర్నల్ ఎగ్జామ్స్ బైకట్ చేసిన విద్యా ర్థులు ఓయూ వీసీ కార్యా లయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఓయూ, సైఫాబాద్, నిజాం, సికిం ద్రాబాద్ పీజీ కళాశాల విద్యార్థులు భారీగా తరలివచ్చారు.ఓయూ స్టూడెంట్ డీన్ కి వినతి పత్రం అందజేశారు. యూజీసీ నిబంధలను అనుసరించి కనీసం 16 వారాలు తరగతులు నిర్వహించాలి, కానీ నవంబర్ 1న, ప్రారంభం అయి నేటికీ పని దినాలు 70 మాత్రమే, 16 నేలలో పూర్తి చేయాల్సింది 70 రోజులలో చెప్పి చేతులు దులుపుకున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తరగ తులు ప్రారంభించిన 20 రోజుల తర్వాత హాస్టల్ ఇవ్వడం చాలా దారుణమని, వారు చేసిన తప్పిదాల వలన మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఆసియా లోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క జాతరను విస్మరించి పరీక్షలు నిర్వించడం గిరిజన దేవతల ను అవమానించడమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎస్ఎస్‌సీ, జీడీ కానిస్టేబుల్, సీఎస్ఐఆర్, ఎస్ఓ, ఎఎస్ఓ లాంటి ఎగ్జామ్స్ వుండడం వలన అటు సెమిస్టర్ రాయాలో ఇటు కాంపిటిటివ్ ఎగ్జామ్స్ రాయాలో అర్థం కాని పరిస్థితులలో విద్యార్థులు ఉన్నామన్నారు. అదేంటని ఒక విద్యార్థి వీసీని అడిగితే బ్యాలాగ్ రాసుకో అని మాట్లాడడం చాలా దారుణం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయని తెలంగాణ గవర్నర్, యూజీసీ చైర్మెన్‌కు లేఖ

- 'ఎవరినీ వీసీలుగా నియమించొద్దు'



నవతెలంగాణ-ఓయూ

సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, అదే విధంగా రానున్న వీసీ నియామకాల్లో వీసీలుగా నియమిం చొద్దని గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, యూజీసీ చైర్మెన్ జగదీష్ కుమార్‌కు ఏఐఎస్ఎఫ్ ఉస్మానియా యూని వర్సిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో పోస్టు ద్వారా లేఖ రాశారు. అవకతవకలకు పాల్పడిన ప్రొఫెసర్ల అక్ర మాలు పూర్తి ఆధారాలను ఓయూ పోస్టాఫీస్‌లో వివరాలతో కూడిన లేఖ ద్వారా పంపినట్లు తెలిపారు. పొలిటికల్ సైన్స్ రీసెర్చ్ స్కాలర్, ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లిసత్య మాట్లాడుతూ యూజీసీ నిబంధనల ప్రకారం ఒక ప్రొఫెసర్ సీనియర్ ప్రొఫెసర్ కావాలంటే ఆ ప్రొఫెసర్ పది రీసెర్చ్ ఆర్టికల్స్‌ను కలిగి ఉండాలని, అవి కూడా యూజీసీ కేర్ లిస్ట్, స్కోపస్, వెబ్‌ఆఫ్ సైన్స్ లాంటి రీసెర్చ్ జర్నల్స్ లలో పబ్లిష్ చేయాన్నారు. అంతే కాకుండా ఆ ప్రొఫెసర్ కింద ఇద్దరు పిహెచ్డీ అవార్డ్ పొందిన విద్యార్థులు ఉండాన్నారు. అర్హతలు లేకుండా ఓయూలో కొంతమంది ప్రొఫెసర్లు అక్రమాలకు పాల్పడి సీనియర్ ప్రొఫె సర్లుగా పదోన్నతులు పొందారన్నారు. ఈ అన్ని విషయాలు తెలంగాణ గవర్నర్ (ఛాన్సలర్), యూజీసీ చైర్మెన్ దృష్టికి తీసుకువెళ్లి ఉద్దేశంతో పూర్తి వివరాలు పోస్ట్ చేశామని తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణ గవర్నర్ ని యూజీసీ చైర్మెన్ ను ప్రత్యక్షంగా కలిసి అన్ని ఆధారాలను కూడా వారికి అందిస్తామని అన్నారు.ఏఐఎస్ఎఫ్ ఓయూ సహాయ కార్యదర్శి భగత్, నాయకులు అశ్విన్, రాఘవేందర్, మధు పాల్గొన్నారు.

16న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి టీ.మహేందర్



నవతెలంగాణ-ఓయూ


చిలకలగూడ లేబర్ అడ్డ వద్ద ఫిబ్రవరి 16 దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సోమ వారం సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భగా సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి టి.మహే ందర్ మాట్లాడుతూ చిలకల్‌గూడ అడ్డమీద అనేక మంది పేద కార్మికులు జీవనం సాగిస్తున్నారని, అటువంటి వారికి ఎలాంటి సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. వారికి మరుగుదొడ్లు, మంచినీళ్లు, సౌకర్యం కల్పిం చాలన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం ఫిబ్రవరి 16 సమ్మెను జయప్రదం చేయాలన్నారు. అడ్డ వద్ద కనీస సౌకర్యాలు లేవు కార్మికులకు పనులులేక రోడ్డు మీద ఎండలో ఉదయం నుండి సాయంత్రం వరకు పని కోసం నిరీక్షణ చేసే పరిస్థితి ఉందని, పట్టణ ఉపాధి హామీ కల్పించి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. అడ్డవద్ద షెడ్డు ఏర్పాటు, మంచినీళ్ల సౌకర్యం, ఐదు రూపా యల భోజనం ఏర్పాటు చేసి ఆ సంఘటిత రంగ కార్మికులను ఆదుకోవాలన్నారు.కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులందరూ కలిసి పోరాడాలని, ఆధారంగానే కార్డులు రెన్యువల్ చేసి కొత్త కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో చిలకలగూడ అడ్డ కార్యదర్శి మధు, నాయకులు, నర్సింగ్ రావు,పోచయ్య, పోచయ్య, నరేందర్‌అజిబాయి తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ - జవహర్ నగర్

ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జవహర్ నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం నడిమింటి వినోద, ఉపేందర్, ఇద్దరు కూతుళ్లతో కలిసి జవహర్‌నగర్‌లోని మసీదు లైన్ శివాజీనగర్‌లో నివాసం ఉంటున్నారు. వినోద మీనాక్షి ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తుంది. ఆమె భర్త మద్యం సేవించి అలవాటు ఉందని, ఒక నెల క్రితం, ఆమె భర్త అధికంగా మద్యం సేవించి బైక్‌పై నుంచి పడి గాయాలయినట్లు తెలిపారు. సోమ వారం ఉదయం తన రోజువారీ పనికి వెళ్తానని చెప్పి, మద్యం సేవించి వచ్చాడు. అతనిని ఆసుపత్రిలో రెగ్యులర్ చెకప్‌కు తీసుకెళ్లడానికి ఇద్దరూ ఈఎస్ఐ కార్డ్ కోసం వెతికారు, కానీ కార్డు దొరకక పోవడంతో ఆమె బ బయటకు వచ్చింది. అనంతరం ఆమె ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా లోపల నుంచి తాళం వేసి ఉంది. బలవంతంగా తలుపులు తెరిచి చూడగా ఉపేందర్ బెడ్‌రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు చున్నితో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించింది. వెంటనే స్థానికులను పిలిపించి బాలాజీనగర్‌లోని మీనాక్షి ఆస్పత్రికి తీసుకెళ్లగా డ్యూటీ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు.

రాచకొండ సీపీగా తరుణ్ జోషి



నవతెలంగాణ-సిటీ బ్యూరో

రాచకొండ పోలీస్‌కమిషనరేట్ నూతన పోలీస్ కమిషనర్‌గా తరుణ్ జోషిని నియమిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే రాచకొండ సీపీగా పనిచేసిన సుధీర్ బాబును మల్టీజోన్-2 ఐజీపీగా నియమించారు. నగరంలో సౌత్, వెస్ట్ జోన్ డీసీపీగా ఉదయ్ కుమార్ రెడ్డితోపాటు ఈస్ట్ జోన్ డీసీపీగా గిరిధర్ ను నియమించారు. టాస్క్ ఫోర్స్ డీసీపీగా సాధన రశ్మిని బదిలీ చేశారు. వెంటనే బాధ్యతలు చేపట్టాలని సోమవారం డీజీపీ రవి గుప్త ఉత్తర్వులు జారీ చేశారు.

పెద్దల సూక్తులు అచరణీయాలు : సినీ డైరెక్టర్ వీఎన్. ఆదిత్య



నవతెలంగాణ-కల్చరల్

ఋషులు మహా పురుషులు వారి జీవిత అనుభవాలు సూక్తులుగా ఉపదేశాలు గా మనకు అందించారని అవి అనుసరణీయం అనీ ప్రముఖ సినీ దర్శకుడు వీ.ఎస్.ఆదిత్య అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభ లోని గుండవరపు హనుమంతరావు కళా వేదిక పై ప్రముఖనటి రచయిత్రి డాక్టర్ శ్రీజ సాదినేని రచించిన శ్రీజ కోట్స్(నిప్పులాంటి నిజాలు) సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆదిత్య పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. శ్రీజ తన జీవితం లో ఎదురైన సంఘటనల నుంచి నేర్చుకొన్న అనుభవాలు సూక్తులుగా వెలుగు లోకి తెచ్చారన్నారు ఈ కోట్స్ లో వాస్తవాలు ఎన్నో ఉన్నాయని ఇవి ప్రతి వారి జీవితానికి మార్గదర్శనం చేస్తాయని అభినందించారు. మహానటి సావిత్రి ని మరపించగల నటి శ్రీజ అన్నారు. సినీ దర్శకుడు గౌరీ నాయుడు అధ్యక్షత వహించి మాట్లాడుతూ శ్రీజ కోట్ ప్రతివారూ చదవ తగ్గ సంపుటి అన్నారు.

బహుజన సాహిత్యం లేకపోతే

తెలుగు సాహిత్యానికి అస్తిత్వమే లేదు

- సుప్రసిద్ధ సాహితీ వేత్త జూలూరు గౌరీ శంకర్,బుక్ ఫెయిర్ సెక్రటరీ ఆర్ వాసు
- హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో 'దళిత,బహుజన సాహిత్యం - దశ దిశ ' అనే అంశంపై సదస్సు





నవతెలంగాణ-ముషీరాబాద్

బహుజన సాహిత్యం లేకపోతే తెలుగు సాహిత్యానికి అస్తిత్వమే లేదని సుప్రసిద్ధ సాహితీ వేత్త జూలూరు గౌరీ శంకర్, బుక్ ఫెయిర్ సెక్రటరీ ఆర్ వాసు అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆధ్వర్యంలో రవ్వా శ్రీహరి వేదిక పై 'దళిత,బహుజన సాహిత్యం - దశ దిశ ' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆత్మీయ అతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ. పోతులూరి వీరబ్రహ్మం నుంచి అంబేద్కర్ వరకు సాగిన సుదీర్ఘ తాత్విక ప్రస్థానంలో దళిత బహుజన, గిరిజన, ముస్లిం కవులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయ సాహిత్య, రాజకీయ సామాజిక పోరాటానికి పిలుపునిచ్చి, బీసీ డిక్లరేషన్ ప్రకటించారన్నారు. ఈదేశ జ్ఞాన, ఆర్థిక సంపదలకు మూలం బహుజనులే అన్నారు. మంగలి కత్తి, నాగలి, పెద్ద బాడిస లాంటి బహుజన వృత్తి పరికరాలు అందించిన ప్రతిఘటనాత్మక చైతన్యాన్ని అందిపుచ్చుకున్న బహుజన కవులు సజీవ సాహిత్యాన్ని సృజించారని తెలిపారు. అసెంబ్లీ వైపుగా అడుగులు వేసే, పార్లమెంట్ దిశగా పరుగు తీసే సాహిత్యం రావాలని అన్నారు. ఈనాడు తెలుగు భాషను రక్షించేది దళిత, బహుజనులే అని అన్నారు. ప్రధాన వక్త, ప్రముఖ కవి రచయిత సతీష్ చందర్ మాట్లాడుతూ బుద్ధుడు, మార్క్స్,అంబేద్కర్ ఈ ముగ్గురు తాత్త్విక మూర్తుల స్ఫూర్తితో సాహిత్యం రావాలని అన్నారు. ఈ సభకు డా కోయి కోటేశ్వర రావు అధ్యక్షత వహించగా ఆచార్య సూర్యా ధనంజయ్ , స్కై, బాబా, డా జిలకర శ్రీనివాస్ ప్రసంగించారు.



రెసోనెన్స్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

అనుమతి లేకుండా నడుస్తున్న రెసోనెన్స్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ నగర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి పర్మిషన్ లేకుండా రెసోనెన్స్ విద్యాసంస్థలు హిమాయత్ నగర్, ఎస్సార్‌నగర్‌లో నడిపిస్తున్నారని, అదేవిధంగా టెన్త్‌క్లాస్ పరీక్షలు పూర్తికాకముందే తల్లిదండ్రులను, ఇంటర్మీడియట్ బోర్డు అధికారులను మోసం చేస్తూ అడ్మిషన్లు మొదలుపెట్టారని ఆరోపించారు. ఇంటర్మీడియట్ బోర్డు చట్టం ప్రకారం ఎలాంటి ప్రకటనలు చేయొద్దని రెసోనెన్స్ విద్యాసంస్థలు హిమాయత్ నగర్, ఎస్ఆర్‌నగర్‌లో మెట్రో పిల్లర్లకి బ్యానర్లు కట్టి, టీవీలో ప్రచారం చేస్తున్నారన్నారు. అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని విద్యార్థులను పేరెంట్స్‌ను మోసం చేస్తున్నారని ఆయన తెలిపారు. వెంటనే ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు స్పందించి రెసోనెన్స్ విద్యాసంస్థల్లో పర్మిషన్ లేకుండా నడిపిస్తున్నటువంటి కళాశాలలను మూసివేయాలని అశోక్ రెడ్డి డిమాండ్ చేశారు. హిమయాత్‌నగర్, ఎస్ఆర్ నగర్‌లో మెట్రో పిల్లర్లకు భారీ హెూర్డింగ్‌నీ నిలిపివేయాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆయన విజ్ఞప్తి చేశారు.

రవాణాశాఖ ఉద్యోగుల ఫోరమ్ అడహాక్ కమిటీ ఏర్పాటు



నవతెలంగాణ-సిటీబ్యూరో

రవాణాశాఖ ఉద్యోగుల ఫోరమ్ అడహాక్ కమిటీ ఏర్పాటైంది. టీఎన్జీవోస్ సంఘం కేంద్ర కమిటీ అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ(ముజీబ్), అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్, హైదరాబాద్ సిటీ అధ్యక్షులు శ్రీకాంత్, కార్యదర్శి హరి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.సామ్యూల్ పాల్ ఆధ్వర్యంలో తాజాగా హైదరాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లతో కూడిన ఆడహాక్ కమిటీని ఎన్నుకున్నారు. మొత్తం 15 మందితో ఏర్పాటు చేసిన ఈ కమిటీకి కన్వీనర్‌గా ఎం.ఎస్. అరుణేంద్రప్రసాద్, కో-కన్వీనర్లుగా జి. చంద్రశేఖర్, పి. అభిలాష్ గౌడ్, సభ్యులుగా శ్రీనివాస్, సతీష్, కృష్ణమూర్తి, డి. పవన కుమార్. మహమ్మద్ పర్వేజ్, మహ్మద్ ఇలియాస్, కె. సాయికుమార్, ఎస్.విజయ, వినయకుమార్, కె.గిరిబాబు, రవీందర్ గౌడ్, ఎన్. ఉదయ్ రాజ్ ఎన్నికయ్యారు. టీఎన్జీవోస్ కేంద్ర సంఘం, జిల్లా సంఘం నేతలు నూతన కమిటీ సభ్యులకు ప్రొసిడింగ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ నేతలు కస్తూరి వెంకటేశ్వర్లు, డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు, వాటి పరిష్కారమే లక్ష్యంగా రవాణాశాఖ ఉద్యోగుల ఫోరమ్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు.



కేపీహెచ్‌బీని అభివద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తా

- కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కేపీహెచ్‌బీ డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సివరేజ్ పైప్ లైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 ఏండ్ల నుంచి డివిజన్‌ను ఎంతో అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. ప్రభుత్వాలు ఏవైనా సరే నిత్యం ప్రజల కోసమే ఆలోచించే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అండదండలతో భవిష్యత్తులో కూడా నియోజకవర్గాన్ని, కేపీహెచ్‌బీ డివిజన్ ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాయకులు కాలనీవాసులు పాల్గొన్నారు.



జీవో 317 బాధితులను సొంత జిల్లాలకు పంపాలి

- కొత్త నియామకాల ముందే తమకు న్యాయం చేయాలి
- బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల కంటే ముందే జీవో 317 బాధితులను తమ సొంత జిల్లాకు పంపించాలని బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ ఒలంపిక్ భవన్‌లో తెలంగాణ గురుకుల మైనార్టీ అధ్యాపకులు బాధిత ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీకి మద్దతు ప్రకటించి.. అందులో చేరారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షులు విజయకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 48గంటల్లో 317 బాధితులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు బాధిత ఉద్యోగ ఉపాధ్యాయులను సొంత జిల్లాలు, జోన్లకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అలానే మైనార్టీ గురుకులాలలో జరిగే కొత్త నియామకాల కంటే ముందే తమకు న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గత కొంతకాలంగా జీవో 317 వల్ల ఇబ్బంది పడుతున్నామని..

ఆధునిక కృత్రిమ మేధతో చికిత్సలపై సదస్సు



నవతెలంగాణ-కల్చరల్

ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏ. ఐ) విస్తృతంగా ప్రచారం లో ఉంది. ఈ కృత్రిమ మేధతో ప్రత్యామ్నాయ మార్గాలలో చికిత్స చేయగలమని డాక్టర్ రఘు ఆర్య తెలిపారు. జే. సీ. ఐ కార్యాలయంలో ఫ్రీక్వెన్సీ థెరపీ పై సదస్సు నిర్వహించారు. ప్రధాన వక్త గా డాక్టర్ రాఘు ఆర్య మాట్లాడుతూ కృత్రిమ మేధను వ్యక్తి మొబైల్‌కు అనుసంధానించి ఆ వ్యక్తికి సంబంధించిన శారీరక మానసిక రుగ్మతలను ఆధ్యాత్మిక చింతనతో నివారణ చేయవచ్చని వివరించారు. ఇది పలు దేశాలలో మెడికల్ కౌన్సిల్స్ ఆమోదం తెలిపాయని అయన పేర్కొన్నారు. జే. సి. ఐ అలుమిని క్లబ్ జోన్ 12 చైర్మెన్ జీ.వీ ఏ.ఎస్.రాజు కార్యక్రమనికి స్వాగతం పలుకగా వైస్ చైర్మెన్ జీ.సురేందర్ రెడ్డి, డాక్టర్ చందన, జోన్ సభ్యులు రవిచంద్ర, సత్యవాణి, కె.వీ.సుబ్బా రావు, తదితరులు కార్యక్రమం పర్యవేక్షణ చేశారు. డాక్టర్ పూజా సెట్టి వందన సమర్పణ చేశారు



బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- కార్పొరేటర్ కొలుకుల జగన్.
- శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఈ నెల 13,14,15 తేదీలలో జగద్గిరిగుట్ట కొండపై శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి శ్రీవారి 53వ బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలు పురస్కరించుకొని జగద్గిరిగుట్ట పద్మశాలి సంఘం నేతత్వంలో మగ్గంపై నేర్చిన చేనేత పట్టు వస్త్రాలకు సోమవారం స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయ సమీపంలో గల శ్రీ శివ పంచాయతన మార్కండేయ దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం జగద్గిరిగుట్ట బస్ స్టాప్ నుంచి పద్మశాలి సంఘం సభ్యులతో కలిసి ఊరేగింపుగా కొండపైన గల శ్రీవారి దేవాలయంలోని ప్రధాన అర్చకులు మాడభూషిని రామాచార్యులు,దేవాలయ ఈవో. కృష్ణమాచార్యులు ధర్మకర్తల మండలి సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పద్మశాలి కులస్తులు స్వయంగా మగ్గంపై నేర్చిన పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ మేరకు పద్మశాలి కులస్తులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో,సంఘం అధ్యక్షులు భోగ రాజేష్ నేత,సభ్యులు మునిపల్లి జనార్దన్,పల్లె దత్తాత్రేయ,నారా నరేందర్,మాయకోటి ప్రభాకర్, మహిళలు పాల్గొన్నారు.

పరులకు సహాయ పడితే పదవి అర్థవంతం

- జస్టిస్ శేషశయన రెడ్డి



నవతెలంగాణ-కల్చరల్

ఎందరో ప్రభుత్వ పదవులు చేపట్టి ఉండవచ్చని కానీ ఆ అధికారంలో ఉన్నప్పుడు పరులకు సహాయ పడితే సార్థకత చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శేష శయన రెడ్డి అన్నారు. రమణాచారి వివిధ పదవుల్లో ఉన్న సమయంలో అయన సహకారం పొందిన వారు పదవీవిరమణ చేసిన తరువాత కూడా జన్మ దిన సందర్భంలో తమ అభిమానం చూపటం అరుదైన విషయమని జస్టిస్ అభినందించారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై జీ.వీ.అర్.కల్చరల్ ఫౌండేషన్ నిర్వహణ లో విశ్రాంత సివిల్ సర్వీస్ అధికారి కె.వీ.రమణ జన్మ దిన సందర్భంలో హాస్యానందం పత్రిక నిర్వహణ లో జరిగిన కార్టూన్ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ శేష శయన రెడ్డి పాల్గొని మాట్లాడుతూ జీవిత ప్రయాణం లో ఎన్నో ఎత్తపల్లాలు చూసిన వ్యక్తులు వారి వారి రంగాల్లో అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. హాస్యానందం ప్రత్యేక సంచికను సంపాదకుడు పీ.రాము లాంఛనం గా డాక్టర్ రమణ కు అంకిత మిచ్చారు. డాక్టర్ రమణ మాట్లాడుతూ దినపత్రికలు తప్పని సరిగా కార్టూన్స్ ప్రచురించాలని కోరారు. కళా పోషకుడు చిల్ల రాజశేఖర రెడ్డి సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు యువ కళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ ధార్మిక ప్రచార కుడు కృష్ణామాచార్యులు రచయిత్రి నిర్మల తదితరులు పాల్గొనగా కవి పెద్దూరి వెంకట దాసు కార్యక్రమం నిర్వహించగా సంస్థ స్థాపకుడు గుదిబండి వెంకట రెడ్డి స్వాగతం పలికారు కార్యక్రమానికి తొలుత శిరీష తన శిష్యులు నివేదిత, కిరణ్మయి తో కూచిపూడి నృత్యం నర్తించారు

మహిళా పై దాడి హేయమైన చర్య : తెలంగాణ ఆర్య వైశ్య జర్నలిస్ట్ సంఘం

నవతెలంగాణ-బంజారా హిల్స్

సమస్య ఉంటే పరిష్కరించడానికి అనేక మార్గాలు ఉన్నాయి కానీ ఒక మహిళా అనికూడా చూడకుండా అమానుషంగా అచ్చంపేట మార్కెట్ చైర్మెన్‌పై రైతులు దాడి చేసే విధానం బాధని కల్గిస్తుందని తెలంగాణ ఆర్య వైశ్య జర్నలిస్ట్ సంఘం నాయకులు గుండా చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సేవారంగం లో ఎనలేని పాత్రపోషించే ఆర్య వైశ్యులు నేడు రాజకీయంగా ఎదుగుతున్న విధానం కొందరు జీర్ణించుకోలేక ఇలాంటి అమానుష చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సభ్యసమాజం తలదించుకునే విధంగా చేసిన ఈ చర్యను కులాలకు అతీతంగా సమాజంలో అన్ని కులాలకు చెందిన ప్రతి ఒక్కరూ ముక్త కంఠంతో ఖండించాలన్నారు. వైశ్యులకు కూడా రాజకీయాల్లో ఉండేందుకు హక్కు ఉందన్నారు.తుకాలలో మోసాల జరిగితే గీట్టు గిట్టుబాటు ధర లభించకపోతే చైర్మెన్‌కు, సెక్రటరీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలి కానీ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సమంజసం కాదన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని, దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు

IN THE COURT OF THE HON'BLE IV ADDL. DISTRICT JUDGE: R.R.DISTRICT AT: L.B.NAGAR I.A.NO. 240 OF 2022 IN O.S.NO. 193 OF 2022

BETWEEN:
Swarna Subba Rao ...Petitioner/Plaintiff
And
Govindlal Agarwal & another ...Respondents/Defendants

To,
R2-Smt.Rakhi W/o.Vinay Kumar Aged about 51 years, Occ: Business R/o.H.No.3-6-69/B/20 /4/1, Avanthinagar, Basheerbagh, Hyd

Take notice that the plaintiff filed the above suit for declaration of title and recovery of possession against the respondents/defendants. The above IA is posted to **12-03-2024**. If any person or persons has any objection with regard to the claim of the petitioner/plaintiff, they may appear before the Hon'ble Court on the said date **at 10.30 a.m.** by person or through an Advocate, failing which the matter will be decided on merits.

// BY ORDER OF THE COURT //
A.RAJA RANGA RAO, ADVOCATE,
Plot No.55, Road No.2, Chanakya puri Nagole, Medchal Malkajgiri District-68 Counsel for the Plaintiff

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE (PROH.& EXCISE): AT NALGONDA. I.A.NO.240 OF 2021 IN O.S.NO.460 OF 2021

Between:-
Chintha Sucharitha ...Petitioner/Plaintiff
AND
Musham Janardhan and others ...Respondents/Defendants

To,
R1:- Musham Janardhan S/o Laxmi Narsaiah, Aged: 72 years, Occ: Business,R/o H.No.4-4-230/3, 3rd Floor, Indhar Bagh, Sultan Bazar, Hyderabad-500195.

Take notice that the Petitioner/ Plaintiff had filed the above suit and I.A. against you and others in respect of the petition schedule property and the said I.A. is pending before the Hon'ble Court for your appearance. The said I.A. is posted to 26-03-2024 for your appearance.

Hence, you are hereby directed to appear in person or through Advocate before the court on 26-03-2024 at 10-30 A.M., without fail, failing which the matter will be decided against you as per law.

// BY ORDER OF THE COURT//
NUKALA NARASIMHA REDDY
NUKALA SANDHYA RANI
Advocates,Nalgonda.
Cell:9440335523.
Nalgonda,
Date:12.02.2024.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE (PROH.&EXCISE): AT NALGONDA. O.S.NO. 460 OF 2021

Between:-
Chintha Sucharitha ...Plaintiff
AND
Musham Janardhan and others. ...Defendants

To,
D1:- Musham Janardhan S/o Laxmi Narsaiah, Aged: 72 years, Occ: Business,R/o.H.No.4-4-230/3,3rd Floor, Indhar Bagh, Sultan Bazar, Hyderabad-500195.

Take notice that the Plaintiff had filed the above suit against you and others in respect of the petition schedule property and the said suit is pending before the Hon'ble Court for your appearance. The said suit is posted to 26-03-2024 for your appearance.

Hence, you are hereby directed to appear in person or through Advocate before the court on 26-03-2024 at 10-30 A.M., without fail, failing which the matter will be decided against you as per law.

// BY ORDER OF THE COURT//
NUKALA NARASIMHA REDDY
NUKALA SANDHYA RANI
Advocates,Nalgonda.
Cell:9440335523.
Nalgonda,
Date:12.02.2024.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE CUM XIV ADDL.METROPOLITAN MAGISTRATE, R.R DISTRICT, AT: L.B NAGAR O.S.NO. 642 OF 2022

BETWEEN:
B.Balaiah S/o.B.Sathaiah A/a.68 yrs, Occ: Retired employee, R/o. Plot No.359, Judges Colony, Road No.6, Near Sahara Estate, Gate No.2, Mansoorabad, Hayathnagar (M), R.R District-500065. ...Plaintiff
AND
1.Banoth Lalitha Devi W/o.Laxmoji A/a.49 yrs Occ: Government Employee, R/o.Plot No.22, MNR Colony, Boyawada, Ramagiri, Nalgonda Town & District.
2.Jasti Seetha Maha Lakshmi W/o. Ram Babu A/a.72 yrs, Occ: Business R/o.Plot No.21, Road No.4 Green Hills Colony, L.B Nagar, Hyderabad. ...Defendants No.1 & 2

Please take notice that the above O.S.No.642 of 2022 is posted to **21/02/2024** for your appearance i.e., Defendants No.1 & 2, hence you are hereby directed to appear before the above said Hon'ble Court **on 21/02/2024 at 10.30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be decided in your absence, on merits.

//BY ORDER OF THE COURT //
SD/-
M/S.L.HARISH ADVOCATE
plot No.2, MIG, H.No. 2-2-1105, Nandanavanam Colony, Bagh Amberpet HYDERABAD-13
Mob.: 9948323614

IN THE COURT OF THE HON'BLE IX ADDL. DIST JUDGE, R.R DISTRICT, AT: L.B NAGAR I.A NO.577 OF 2023 IN O.S NO. 635 OF 2023

BETWEEN:
Pabba Srinivasulu, S/o.Chandraiah Aged about 41 years, Occ: Business, R/o Sangyapally(V), Thalkondapally(M), R.R.District ...Petitioner/Plaintiff
AND
1.Syed Ali Patel, S/o Syed Kursheed Patel, Aged about 39 years, Occ: Business, R/o.H.No.13-133, All Ayin Colony, Shaheen Nagar, Balapur, Saroornagar, R.R.District
2.Mallekedi Venkoba, S/o.Mallekedi Jangeer, Aged about 53 years, Occ: Business, R/o.H.No 10-1-99/13, Sri Sai Nilayam, Raghavendranagar Colony, Road No 1, Karmanghat, R.R.District ...Respondents /Defendants No 1 & 2

Please take notice that the above I.A No.577 of 2023 In O.S No 635 of 2023 is posted to **05/03/2024**, for your appearance i.e., Respondent No 1 and 2, hence you are hereby directed to appear before the above said Hon'ble Court **on 05/03/2024 at 10.30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be decided in your absence, on merits.

// BY ORDER OF THE COURT //
SD/-
M/S.L.HARISH ADVOCATE
plot No.2, MIG, H.No.2-2-1109, Nandanavanam colony, Bagh Amberpet HYDERABAD -13

IN THE COURT OF HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM XI ADDL. METROPOLITAN MAGISTRATE, AT: RAJENDRANAGAR, R.R.DISTRICT. O.S.NO. 389 OF 2023

BETWEEN:
Nalla Karuna & Others ...Plaintiffs
AND
1.All Concerned
2.The Tahsildar, Mandal Revenue Officer Rajendranagar Mandal, R.R. District. ...Defendants

To,
ALL CONCERNED
Please take notice that the Plaintiff has filed the above suit for declaring herself as the legal heirs of Late Nalla Krishna, who expired **on 04-12-2022** and other descendants of the Plaintiff. That if any person (s) is having any objection, claims, rights whatsoever relating to the above said matter, may appear **on 15-02-2024 at 10.30 A.M** in person or through a duly appointed advocate, failing which the matter will be heard and decided ex-parte.

(BY ORDER OF THE HON'BLE COURT)
MOHAMMED IBRAHIM ALI, ADVOCATE
Office: #: 10-1-595, Chintal Basti Main Road, Khairtabad, Hyderabad.
Phone#: 939656627.

IN THE COURT OF THE HON'BLE IV ADDL. DISTRICT JUDGE: R.R.DISTRICT AT: L.B.NAGAR O.S.NO.193 OF 2022

BETWEEN:
Swarna Subba Rao ...Petitioner
And
Govindlal Agarwal & another ..Respondents

To,
R2-Smt.Rakhi W/o.Vinay Kumar Aged about 51 years, Occ: Business R/o.H.No.3-6-69/B/20/4/1, Avanthinagar, Basheerbagh, Hyd

Take notice that the plaintiff filed the above suit for declaration of title and recovery of possession against the respondents/defendants. The above OS is posted to **12-03-2024.** If any person or persons has any objection with regard to the claim of the petitioner/plaintiff, they may appear before the Hon'ble Court **on the said date at 10.30 a.m.** by person or through an Advocate, failing which the matter will be decided on merits.

// BY ORDER OF THE COURT //
A.RAJA RANGA RAO, ADVOCATE,
Plot No.55, Road No.2, Chanakya puri Nagole, Medchal Malkajgiri District-68 Counsel for the Plaintiff

IN THE COURT OF THE HON'BLEPrl., JUINOR CIVIL JUDGE MEDCHAL MALKAJIGIRI DIST. AT: MEDCHEL

O.S. No. 776 OF 2023

Between:
P.Chander Rao 5 anothers ....Plaintiffs
And
Ganesh Kumar Jonnakuti & another ....Defendants

To,
Whomsoever it may Concern. ....(Defendant No. 2)

Whereas the plaintiffs herein have filed the above suit for Declaration to Declare the Plaintiff's as the legal heirs of Late P.Pushpa Rao W/o. P.Chander Rao) against you vide. O.S. No. 776 of 2023 on the file of this Hon'ble court, you are hereby summoned to appear in this court, in person or by a pleader on 21-02-2024 at 10-30.A.M.,Including answer the same, failing which the matter will be decided ex-parte.

//BY ORDER OF THE COURT//
Middhinti Srinivas
Advocate
Sangareddy District

BEFORE THE DISTRICT CONSUMER DISPUTES REDRESSEL COMMISSION, RANGA REDDY DISTRICT COURT COMPLEX AT: LB.NAGAR, HYDERABAD C.C.NO. 535 OF 2023

BETWEEN:
Nimmakanti Ravi Kumar, S/o. Balaiah, A/a.39 yrs, Occupation: Self Employee, R/o.H.No.2-2-112 5/79, Narasimhamurthy Basti, Near Shivam Road, Amberpet, Hyderabad, Telangana-500 013. Mobile No.9393209804 ...Complaint
AND
ABG Manufacturing & Marketing, a Proprietary Concern, Represented by its Proprietor A.Balaswamy Goud, Plot No.5, Road No.1, Phase-II, Sri Sai Enclave, Boduppal, K.V.R.R.Dist, Hyderabad, Telangana-500092. Mobile No.798 9959144, 8074536496, email id: abgmmrktg.@gmail.com ...Opposite Party

To
A.Balaswamy Goud, Proprietor, ABG Manufacturing & Marketing, Plot No.5, Road No.1, Phase-II, Sri Sai Enclave, Boduppal, K.V. R.R. Dist, Hyderabad, Telangana - 500092. Mobile No.7989959144, 8074536496, email id: abgmmrktg @gmail.com

Whereas the above CC is filed by the Complainant seeking compensation against you in view of the services rendered by you being defective and negligent. Whereas the **28th day of February 2024** has been fixed for your appearance and objections if any in that regard. Notice is hereby given that you shall appear before the Hon'ble District Consumer Disputes Redressel Commission, Ranga Reddy District Court Complex At L.B.Nagar, Hyderabad on the said date **at 10:30 AM** and submit objections if any, failing which, the above CC will be heard and decided in your absence. By Order of the Hon'ble Commission.

CV.S.S.SARMA ADVOCATE
COUNSEL FOR COMPLAINANT
Flat No.101, 2nd Floor, Lakshmi Residency, 1-1-364/60&61, Jawaharnagar, Hyderabad-500020
Mobile: 9392464292

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT, AT: MEDCHAL I.A.NO.697 OF 2023 IN O.S. NO. 224 OF 2015

BETWEEN:
Sri Sai Co-operative Housing Society Ltd.,Rep. by its Seceratary, Ch.Chalapathi Rao .....Petitioner/Plaintiff
AND
M/s.Sri.G.Hari Babu and Others ....Respondents/ Defendants/ Proposed Defendants

To
12.Smt.A.V.V.Lakshmi W/o.Sri Suraajee,R/o.Plot No.6, Jagadish Nagar,Rasoolpura, Begumpet, Secunderabad - 500016
21.Ms.D.N.Sowmya, D/o.Sri D.K.Kumar, H.No.6-6-/3, Flat No. 102, Sri Nilayam Apartments, Ramakrishna Street,Kukatpally, Hyderabad- 500072.
26.Sri Gurram Venkat Rao, S/o. Late Venkata Subbayya, R/o.Plot No.1134, Pragathi Nagar, Opp. JNTU, Hyderabad -500090.
38.Sri Inturi Nageswara Rao,S/o Late Subbarao, R/o.Plot No.1134, Pragathi Nagar, Opp.JNTU, Hyderabad -500090.
44.Gaddala Soujanya Rani, W/o. Kuchipudi Vijaya KumarFlat No.G1
45.K.Srinivasa Rao, S/o.Samba sivarao, Flat No.G2
46.Y.Kasthuri Sireesha, W/o. Y.Koteswaraao, Flat No.G3
47.Gudisa Raja Reddy, S/o.Narayana Reddy, Flat No.101.
48.Annadanam Naga Venkata Rama Krishna Ravi Kishore, S/o. A.Venkata Subramanayam, Flat No.102.
49.N.V.P.L.N.Swamy, W/o.N.Badari Narayana Flat No.103.
50.P.Padma, W/o.P.Bhaskar Rao, Flat No.201.
51.Bhupathi Hari Prasad, S/o. B.Koteswara Rao, Flat No.202.
52.Pannala Vishal, S/o.P.Malli karjuna Sharma,Flat No.203.
53.G.V.Swapna Sri,W/o.G.Venkata Rao, Flat No.301.
54.Z.Madhavi Latha, W/o.Z.Ram Mohan, Flat No.302.
55.P.Gowtham Kishore, S/o. P.V.Ramana, Flat No. 303. ....Respondents/Defendants

(The above said Respondent No.s 44 to 55 are residing at SLN Meadows, H.No.7-12/29-30, Lake view Colony, Pragathi Nagar, Hyderabad-500 090).

Whereas the above named Petitioner have filed the above said I.A.No 697 of 2023 in O.S.No.224 of 2015 against you for amendment of plaint in O.S.No.224 of 2015 and the said I.A.is postedto **22-02-2024** for your appearance

Therefore, you are called upon to appear either in person or through counsel before the Hon'ble Court in the above said I.A.No.697 of 2023 in O.S. No. 224 of 2015 **on 22-02-2024 at 10.30 a.m.**, failing which the matter will be decided in your absence.

(BY ORDER OF THE COURT)
K.SANKARAIAH Advocate
Plot.No.19/1, Road No.25, Vivekanandanagar Colony, Kukatpally, Hyderabad- 500 072.
Cell No.9391386614

నాగోల్‌లో మహిళ అదృశ్యం



నవతెలంగాణ -నాగోల్

మహిళ అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. నాగోల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ డివిజన్‌లోని సాయి నగర్ ప్రాంతంలో నివాసముండే కే యాదమ్మ (43) ఫిట్స్‌తో బాధపడుతోంది. దాంతో కుటుంబ సభ్యుల ఆమెకు వివాహం కూడా చేయకపోవడంతో తల్లితోనే ఆమె కలిసి ఉంటోంది. ఆదివారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో యాదమ్మ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. దాంతో పరిసర ప్రాంతాలలో, బంధువుల వద్ద వెతికినా లాభం లేకపోవడంతో యాదమ్మ తల్లి కొరువైనోలు కౌసల్య సోమవారం నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. అదృశ్యమైన యాదమ్మ ఇంటి నుంచి బయలుదేరేముందు పింకు గ్రీన్ కలర్ చీర, రెడ్ కలర్ జాకెట్ ధరించినట్టు పోలీసులు తెలిపారు.

చలో నల్లగొండ సభను విజయవంతం చేద్దాం

- **బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద శర్మ**



నవతెలంగాణ - చైతన్యపురి

జల హక్కులు కాపాడేందుకు మంగళవారం(నేడు) నల్గొండలో నిర్వహించే బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు ప్రతీ ఒక్కరు తరలిరావాలని బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ పిలుపునిచ్చారు. సోమవారం ఆర్కే పురం లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపుమేరకు చలో నల్లగొండ సభకు మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యులు, మాజీ విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రా రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంస్థ నాయకులు, సబితమ్మ అభిమానులు పాల్గొనాలని కోరారు.

జీహెచ్ఎంసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-సంతోష్‌నగర్/ధూల్‌పేట్

జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, పర్మనెంట్ రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 10,000, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. పని చేయలేని కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను ఎలాంటి షరతులు లేకుండా పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జీహెచ్ఎంసీ పరిధి పెరిగి రోడ్లు విస్తరించినా జీహెచ్ఎంసీలో స్వీపర్లుగా పనిచేసే కార్మికుల సంఖ్య మాత్రం పెంచలేదన్నారు. దాంతో పనిచేస్తున్న కార్మికులపై పని భారం పడుతున్నదని.. కావున వెంటనే కార్మికులను రిక్రూమెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అవసరమైనవి చీపుర్లు, పారాలు, గంపలు, గ్లౌజులు, బిల్ డ్రమ్ములు, తదితర పనిముట్లు ఇవ్వాలన్నారు. ఆదివారాలు కార్మికుల పని గంటలు తగ్గించాలని అలాగే పండగ సెలవులు ఇవ్వాలని కోరారు. ఎండాకాలంలో మార్చి నుంచి మే నెల వరకు ఎండ తీవ్రతకు గురికాకుండా కార్మికుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని పనిగంటలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులపై జీహెచ్ఎంసీ అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు అదేవిధంగా దేశంలో మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సామాన్య ప్రజల మీద కార్మికుల మీద అనేక రకాలుగా దాడి చేస్తున్నారన్నారని.. సమస్త కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో జీహెచ్ఎంసీ కాంట్రాక్టు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి శ్రావణ్ కుమార్, ఎస్ కిషన్, ఏ. కృష్ణ, రామ్ కుమార్, కళ్యాణ్, హెచ్ఎంఎస్ అంజద్, ఏఐటియూసీ నాయకులు జైపాల్ రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు

జంతు పరిరక్షణ కేంద్రంగా జేఎస్ఎస్ఎస్

- వివిధ రకాల కుక్కలు, పిల్లులు, జీవులకు సేవలు
- పండుగలకు వెళ్లే వారి కుక్కలకు భద్రత
- ఎప్పటికప్పుడు వైద్య పరివేక్షణ







కుక్కల పెంపకం ఇష్టం

ఆది నుంచి కుక్కల పెంపకం ఇష్టం. మా ఫార్మ్‌లో నిత్యం 50 కుక్కలకు తగ్గకుండా ఉంటాయి. ప్రతీ రోజు 40-50 కిలోల చికెన్, పౌష్టిక ఆహారం అందిస్తాము. వ్యక్తిగత పనులు, శుభకార్యాలకు,పండుగలకు,వ్యక్తిగత పనుల మీద వెళ్లే వారి కుక్కలకు, నామ మాత్రం రుసుంతో వారు తిరిగి వచ్చే వరకు ఆశ్రమం కల్పిస్తాము. ఎప్పటికప్పుడు ఇక్కడి పెంపుడు జంతువులను వైద్య పర్యవేక్షణలో ఉంచుతూ, తగిన జాగ్రత్తలు తీసుకుంటాం. అలాగే కుక్కలతో పాటు వివిధ రకాల పెంపుడు జంతువులు ఆశ్రమంలో నివాసం ఉంటాయి. మూగ జీవాలకు ఆశ్రమం కల్పించి సేవ చేయడం సంతోషంగా ఉంది. పెంచుకోవడానికి ఇష్ట పడే వారి కోసం వివిధ రకాల కుక్క పిల్లలు ఇక్కడ లభించును.

\- నిర్వాహకులు మధుసూదన్ రెడ్డి

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

నేటి తరం మనిషి తన దైనందిత జీవితంలో పని ఒత్తిడి, ఆర్థిక పరమైన సమస్యలు, వైరుధ్యాల కారణంగా మానవ సత్సం బంధాలు, క్రమంగా క్షీణిస్తున్నాయి. దాంతో మనషుల మధ్య బంధాలు, ప్రేమ, గౌరవం దూరం పెరిగుతూ వస్తున్నాయి. నాటి తరం కాలంలో డబ్బు కన్న వ్యక్తిత్వ విలువలకే ప్రాధాన్యత ఉండేది. రానురాను డబ్బు చుట్టు వ్యవస్థ, వ్యవస్థ చుట్టూ మనుషులు భ్రమణం చెందుతూ మనిషి ఒంటరితనానికి అలవాటు పడుతుండడంతో మానవ సంబంధాలు మెల్లగా దూరమవుతూ వస్తున్నాయి. మాయ మై పోతున్నాడమ్మా మనిషన్నా వాడే, మచ్చుకైనా దొరకడమ్మ మానవత్వమున్న వాడు అంటూ ఓ కవి రాసిన పాట అక్షరాల నిజము. కానీ నేటికీ కొంతమంది మనుషులతో పాటు జంతు ప్రేమికులు ఉన్నారు. భిన్న రకాల జంతువులను ప్రేమిస్తుంటారు. అదే కోవకు చెందిన మర్రిపల్లిలోని జేఎస్ఎస్ఎస్ అండ్ కెన్నెల్ జంతు రక్షణ కేంద్రం ప్రజల మంచి ఆదరణ పొందుతుంది.

రంగారెడ్డి జిల్లా, పెద్ద అంబర్ పేట మున్సిపల్ మర్రిపల్లి గ్రామ పరిధిలో ఒక ఎకరం విశాలమైన విస్తీర్ణంలో జేఎస్ఎస్ఎస్ అండ్ కెన్నెల్ అనే పేరుతో కుక్కల పరిరక్షణ కేంద్రం ఉంది. విశాలమైన ప్రాంతంలో ఉండే ఇక్కడి కేంద్రంలో నివసించే కుక్కల భద్రత, బాధ్యత అన్ని నిర్వాహకులదే. సుమరుగా 50-60 కుక్కలు, పిల్లలు వివిధ జాతులకు చెందినవి ఆశ్రమంలో ఉంటాయి. ఆశ్రమం లో ఉండే పెంపుడు జీవాలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తారు. నమ్మకమైన జేఎస్ఎస్ఎస్ అండ్ కెన్నెల్ ఆశ్రమానికి ఎంతో మంది వచ్చి తమ కుక్కలను ఆశ్రమంలో వసతి కల్పించాలని కోరుతూ వస్తారు. జంతువులకు ఇలాంటి ఆశ్రమాలు ఉండడంతో జంతు ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు లబ్ది

- **ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



నవతెలంగాణ -ఎల్బీనగర్

సీఎంఆర్ఎఫ్‌తో ఎంతో మంది పేదలకు లబ్ది చేకూరుతోందనిఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. లింగోజిగూడా డివిజన్ పరిధిలోని అల్తాఫ్ నగర్ కు చెందిన వెంకటేశ్వరరావు కాలేయంకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి ఆర్థికస్థితులు బాగలేకపోవడంతో ఎమ్మెల్యేను సంప్రదించారు .వెంటనే స్పందించిన ఎమ్మెల్యే.. అట్టి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేశారు. అందుకు గాను బాధితునికి రూ. 1,50,00 ఎల్.ఓ.సీ. చెక్కు మంజూరైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి దోహదపడుతుందన్నారు. ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిదన్నారు. పేదలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిధి అండగా ఉంటుందని తెలిపారు. ఎల్.బి.నగర్ నియోజకవర్గ సమగ్ర అభివద్ధి కోసం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు, వెంకట్ రెడ్డి, షఫీ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మెన్‌పై దాడి అమానుషం

- **ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం గుప్తా**



నవతెలంగాణ - చైతన్యపురి

అచ్చంపేట మార్కెట్ చైర్మెన్ అరుణపై రైతులు దాడి చేయడం అమానుషమని రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం గుప్తా తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆర్య వైశ్యులు మార్కెట్ చైర్మెన్‌గా ఉండడం కొందరు జీర్ణించుకోలేక ఇలాంటి చర్యలకు పాటుపడుతున్నారని అన్నారు. సమాజంలో అన్ని కులాలతో పాటు వైశ్యులకు కూడా రాజకీయాల్లో ఉండేందుకు హక్కు ఉందన్నారు. తూకాలలో మోసాల జరిగితే, గిట్టుబాటు ధర లభించకపోతే చైర్మెన్‌కు కానీ, సెక్రటరీకి కానీ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలి కానీ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సమంజసం కాదన్నారు. ఇప్పటివరకు ఎందరో అచ్చంపేట మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ చైర్మెన్‌లు చేసిన వారు ఉన్నారు కానీ ఏ చైర్మెన్‌పై కూడా దాడి జరగలేదని చెప్పారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని, దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దోషులను శిక్షించేంతవరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన లు నిర్వహిస్తామని తెలిపారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తే సహించేది లేదు



- **సీఐటీయూ జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ**

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ , కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండ కట్టాల్సిన అవసరం ఉందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ అన్నారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తే సహించేది లేదన్నారు. ఈ నెల 16న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ కుంట్లూరులోని అంబేద్కర్ చౌరస్తాలో కార్మికులతో కలిసి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మతోన్మాద బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పుకొట్టాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ, కార్మిక రంగాలలో తీసుకువస్తున్న చట్టాలు రైతులను, కార్మికులను నిర్వీర్యం చేయడమేనన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధివిధానాలు మార్చుకొని కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ ప్రజల హక్కులను కాల రాస్తున్నారని మండిపడ్డారు. దేశమంతా మతోన్మాదంతో కాషాయం చేస్తున్నారని, దళితులు, మైనారిటీల పైన దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.వీటన్నింటిని తిప్పికొట్టడానికి 16 న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను అన్ని రంగాల కార్మికులు, కర్షకులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే మున్సిపల్ లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్మిక నాయకులు మైసయ్య, జంగయ్య, నరసింహ, రవి, పోచమ్మ ,వ్మహిళా నాయకురాలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు బ్యాగ్ అప్పగింత

- **అభినందించిన రాచకొండ సీపీ సుధీర్ బాబు**



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఓ వ్యక్తి క్యాబ్‌లో పోగుట్టుకున్న బ్యాగ్‌ను బాలాపూర్ పోలీ సులు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు పంజాగుట్ట ప్రాంతానికి చెందిన సతీష్ అనే వ్యక్తి, వారి సోదరి వివాహం నిమిత్తం మూడున్నర తులాల బంగారంతోపాటు దాదాపు యాభై వేల రూపాయల విలువైన పట్టు చీరలను ఒక బ్యాగులో తీసుకొని పంజాగుట్ట నుంచి వివాహం జరుగుతున్న బాల గార్డెన్, బాలాపూర్‌కు ర్యాపిడో కార్ బుక్ చేసుకొని తీసుకు వెళ్లారు. అక్కడికి వెళ్లిన తర్వాత వారు ప్రయాణించిన కారులోనే బ్యాగును మర్చిపోయినట్టు గుర్తించారు. వెంటనే శివాజి చౌక్ వద్ద పెట్రోల్ మొబైల్ విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ సురేందర్, హెూంగార్డు రవీందర్‌కు సమాచారం అందించారు. అప్రమత్తమైన ఇద్దరు.. బాలాపూర్ ఎస్‌హెచ్‌వో వెంకట్‌రెడ్డికి విషయం చెప్పారు. దాంతో ఆ ఏరియాలోని పెట్రోలింగ్ సిబ్బంది, బ్లూకోర్ట్ సిబ్బంది కానిస్టేబుల్ రవీందర్, హెూంగార్డు ప్రవీణ్‌లను ఎస్‌హెచ్‌వో అప్రమత్తం చేశారు. విచారణ జరిపించిన పోలీసులు క్యాబ్ డ్రైవర్‌ను గుర్తించారు. అతని వద్ద నుంచి బంగారం, పట్టుచీరలున్న బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు బాలాపూర్ ఎస్‌హెచ్‌వో వెంకట్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సురేంద్ర కుమార్, కానిస్టేబుల్ రవీందర్, హెూం గార్డులు రవీందర్, ప్రవీణ్‌లను ప్రత్యేకంగా అభినందించారు. రివార్డ్ అందజేశారు.



చదువుతోపాటు క్రీడలు ముఖ్యం

- **చిలుక ఉపేందర్ రెడ్డి**

నవతెలంగాణ - చైతన్యపురి

చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. సరూర్ నగర్ డివిజన్ లోని ఇండోర్ స్టేడియంలో న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 3వ అంతర్జాతీయ ఓపెన్ టూ ఆల్ స్టైల్స్ కరాటే, కుంగ్ ఫూ ఛాంపియన్ షిప్ - 2024 పోటీలకు అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు టోర్నమెంట్ నిర్వాహకులు పెద్దవూర శ్రీరాములు జ్ఞాపికను అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికంగా ఉల్లాసంతో పాటు శారీరకంగా ఎంతో దఢంగా అవుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు కొప్పుల శేఖర్ గౌడ్, మాజీ సర్పంచ్ వట్టికోటి పాండు, అల్లేటి కిరణ్ కుమార్, పెద్దవూర సైదులు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

‘వర్క్ ఆర్డర్స్‌ను యధావిధిగా కొనసాగించాలి’

నవతెలంగాణ- నాగోల్



రాష్ట్రంలో జీవో నెంబర్ 317, స్పాంజ్ మెడికల్ గ్రౌండ్ లో ఉన్న ఉద్యోగులకు ప్రాధాన్యతను కల్పించి వర్క్ ఆర్డర్స్ యధావిధిగా కొనసాగించాలని కోరుతూ సోమవారం రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్‌ను ఆయన చాంబర్‌లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కర్నాటి సాయి రెడ్డితో పాటు ఆ యూనియన్ నేతలతో సహా కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సాయి రెడ్డి మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్ వినతిపత్రం చదివి సానుకూలంగా స్పందించి ఉద్యోగులందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు.ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి తమ సమస్యల పై దృష్టి సారించి సత్వరంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ వన్ యూనియన్ రాష్ట్ర చీఫ్ అసోసియేట్ ప్రెసిడెంట్ జి రాజశేఖర్ ,ఉపాధ్యక్షులు కొంపల్లి మత్స్యగిరి, రంగారెడ్డి జిల్లా హెచ్‌వన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి. మల్లయ్య ,ఆ ఆర్. శ్రీనివాస్ గౌడ్, డి.శ్రీనివాస్ లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- **సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్**



నవతెలంగాణ-తుర్కయంజాల్

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్ అన్నారు. ఈ నెల ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం తుర్కయంజాల్ చౌరస్తాలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు గడుస్తున్నా రైతాంగ, కార్మిక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించలేదని అన్నారు. భారత్ వెలిగిపోతుంది, అచ్చేదిన్ ఆయేగా విశ్వ గురు ఆత్మనిర్భార్ భారత్, మేక్ ఇన్ ఇండియా వంటి మోసపూరిత నినాదాలు ఇచ్చినప్పటికి ప్రజలకు ఏమి ఒరగలేదని, అంతే కాకుండా ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.భారత రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకికవాదాన్ని తారుమారు చేస్తూ హిందూ రాజస్థాపనే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ తన ఎజెండాను ముందుకు తీసుకెళ్తుందన్నారు. సీఐటీయూ తుర్కయంజాల్ మున్సిపల్ నాయకులు మండల. సత్యనారాయణ, ఎం జె ప్రకాష్ కారత్, కుంచం వెంకటకష్ణ, చేతాల జ్యోతిబస్, ఆటో యూనియన్ నాయకులు హరీష్, హనుమంత్ రెడ్డి, గుండా బాలరాజ్ భవన నిర్మాణ రంగ కార్మిక నాయకులు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడికి యత్నించిన వృద్ధుడు అరెస్ట్

- **హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి..**

నవతెలంగాణ-హయత్ నగర్

ఆడుకుంటున్న చిన్నారిపై లైంగికదాడికి యత్నించిన వృద్ధుడిని హయత్ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట జిల్లాకు చెందిన 50 ఏండ్ల రాంల రామ్ చందర్ గత ఏడాది నుంచి కుటుంబ సభ్యులతో కలిసి కుంట్లూర్‌లోని పాపాయి గూడ వద్ద ఉన్న గుడిసెలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 11న అతను ఉండే గుడిసెల ప్రాంతంలో 10 ఏండ్ల బాలిక ఉయ్యాల ఊగేందుకు వచ్చింది. అయితే ఎవరూ లేని సమయంలో రామ్‌చందర్ ఆ బాలికను గుడిసెలోకి తీసుకుని వెళ్లి లైంగికదాడికి యత్నించాడు. తర్వాత బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కసు నమోదు చేసుకుని నిందితుడిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నేషనలిస్ట్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మహమ్మద్ బాసరత్ అల్లాహ్

నవతెలంగాణ-సంతోష్ నగర్



నేషనలిస్ట్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ బాసరత్ అల్లాహ్ ఎంపికయ్యారు. ఈ మేరకు మహమ్మద్ బాసరత్ అల్లాహ్‌కు నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సునీల్ జాదవ్, మైనార్టీ అధ్యక్షులు ఎండీ పాషాలు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యక్షులు మహమ్మద్ బాసరాత్ అల్లాహ్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానన్నారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించడంతో పాటు అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. నూతన ఉపాధ్యక్షులను పలువురు మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక అభినందనలు తెలుపుతూ పూలమాలలు వేసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యక్షులు మొహమ్మద్ బాసరత్ అల్లాహ్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

పిల్లలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి

- **ఏసీపీ జీ.శంకర్‌రాజు**



నవతెలంగాణ-సిటీబ్యూరో

పిల్లలకు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ జీ.శంకర్‌రాజు తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం బేగంపేట్‌లోని 'గీతాంజలి స్కూల్' ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు, స్కూల్ సిబ్బందికి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. చిన్నతనం నుండే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకొని, పెద్దగైన తరువాత వాటిని పాటించాలని కోరారు. రోడ్డు భద్రత, నియమాల గురించి బోధనాం శాలలో కూడా చేర్చాలన్నారు. రహదారులపై క్రమశిక్షణగా వ్యవహరించాలని వివరించారు. ముఖ్యంగా పిల్లలు రోడ్డు దాటేసమయంలో ట్రాఫిక్ సిగ్నల్‌తోపాటు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని, తల్లిదండ్రులను, గురువులను పూజించాలన్నారు. ఈ కార్యక్రమానికి సుమారు 50 మంది పిల్లలు, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, క్లాస్ టీచర్లు, సిబ్బందితోపాటు పలువురు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ప్రజావాణిలో 59 అర్జీలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఎప్పటి ఫిర్యాదులను అప్పుడే పరిష్క రించాలని అన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, మండలాల తహసీల్దార్‌లతో మాట్లాడుతూ వారి పరిధిలోకి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, జాప్యం లేకుండా చూడాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 59 అర్జీలు రాగా 24గృహ నిర్మాణ శాఖకు, 35 ఇతర శాఖలకు సంబంధించినవి వచ్చాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీవోలు సూర్యప్రకాష్,రవికుమార్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ మానవి
www.navatelangana.com



పదమూడేండ్ల వయసులో ఎదుర్కొన్న ఆరోగ్య సమస్య ప్రియాషా సలుజా వ్యాపార వేత్తగా మార్చింది. ఇష్టమైన ఆహారం తీసుకోడానికి తనలా ఇబ్బంది పడుతున్న వారికి పరిష్కారంగా 2019లో ది సిన్నమోన్ కిచెన్‌ను ప్రారంభించింది. ఆహారం పట్ల ఆమెకున్న ఇష్టాన్నే వృత్తిగా మలుచుకుంది. కోట్లల్లో వ్యాపారం చేస్తూ గొప్ప మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదిగి ప్రజలకు ప్రిజర్వేటివ్ రహిత ఉత్పత్తులను అందిస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

ఇష్టాన్నే వృత్తిగా మలుచుకుంది

ప్రియాషా సలుజా తన 13 ఏండ్ల వయసులో పీసీఓఎస్ బారిన పడింది. స్వీట్స్ ఎక్కువగా ఇష్టపడే ఆమె అప్పటి నుండి ఆహార విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకోవల్సి వచ్చింది. అది ఆమెకెంతో కష్టంగా మారింది. 'ఆ సమయంలో పీసీఓఎస్ గురించి పెద్ద చర్చ జరిగేది కాదు. అవగాహన చాలా తక్కువగా ఉండేది. దాంతో నా ఆరోగ్య పరిస్థితి రీత్యా ఎన్నో సవాళ్లను, అవమానాలను ఎదుర్కొంటూ పెరిగాను' అంటూ ఆమె గుర్తు చేసుకుంది. ఆ పరిస్థితులే ఆమెను దీనిపై మరింత పరిశోధన చేయించాయి. పరిష్కారంగా ఇంట్లోనే ఆరోగ్యకరమైన పదార్థాలతో ప్రయోగాలు చేయడం ప్రారంభించింది. పిసిఒఎస్ ఉన్నట్లు నిర్ధారణ అయిన 9 ఏండ్ల తర్వాత అంటే 2018లో ప్రియాషా తన ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా ఆరోగ్యకరమైన ఆహారపు ప్రయాణాన్ని డాక్యుమెంట్ చేయడం ప్రారంభించింది.

దానికి పరిష్కారంగా...

వంటకాలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి చిట్కాలను అందులో పొందుపరిచేది. 'ప్రజలు ఆరోగ్యంగా తినాలని కోరుకుంటున్నారు. కానీ సమయం, డబ్బు, ఆసక్తి వంటివి లేకపోవడంతో ఇంట్లో తయారు చేసుకోడానికి వారు సిద్ధంగా లేరని గుర్తించాను. దీనికి పరిష్కారంగానే ది సిన్నమోన్ కిచెన్‌ను ప్రారంభించాను' ఆమె చెప్పారు. సిన్నమోన్ కిచెన్ 100% గ్లూటెన్-ఫ్రీ, ప్రిజర్వేటివ్-ఫ్రీ, రిఫైన్డ్ షుగర్-ఫ్రీ, ఫ్లోర్-ఫ్రీ, ప్లాంట్-బేస్డ్ డి2సి ఉత్పత్తులను అందిస్తుందని ఆమె అంటున్నారు. ఢిల్లీ కేంద్రంగా కుకీలు, చిప్స్, కేకులు, బ్రెడ్‌తో పాటు మరెన్నో ఉత్పత్తుల అందిస్తుంది. 'స్వీట్లంటే నాకు చాలా ఇష్టం. నా ఇష్టాన్నే వృత్తిగా మార్చుకున్నాను' అని ఆమె చెప్పింది.

వంట పట్ల ప్రేమతో...

ఆమె జీవితంలో ఆహారం ఓ అంతర్భాగమైంది. 'నా కుటుంబంలో అందరూ వంట బాగా చేస్తారు. అందరూ ఉత్తర భారత వంటకాలను చేస్తుంటే, నేను ఎడారి ప్రాంత వంటలపై దృష్టిపెట్టాను. ముఖ్యంగా స్వీట్లను ఎక్కువగా తయారు చేస్తాను' అని ఆమె అంటుంది. ప్రియాషా పాఠశాలలో చదివేటపుడు తన స్నేహితురాలి కోసం మొదటి సారి కేక్ తయారు చేయడానికి ప్రయత్నించింది. ఆ కేక్ సరిగా తయారు కానప్పటికీ ఆ సంఘటన ఆమె జీవిత గమనాన్ని మార్చేసింది. అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూడలేదు. ఒక్క కేక్ మాత్రమే కాదు పట్టుదలతో ఫేవార్, మలై పెధాతో పాటు రకరకాల వంటకాలతో ప్రయోగాలు చేస్తూనే ఉంది.



ఉద్యోగం నచ్చలేదు

నోయిడాకు చెందిన సలుజా ఢిల్లీ యూనివర్సిటీలో బిజినెస్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసింది. గ్రాడ్యుయేషన్ తర్వాత పిడబ్ల్యూసి పన్నుల విభాగంలో చేరింది. క్రియేటివ్‌గా ఏదైనా చేయాలని అనుకుంటున్న సమయం ఇది. అందుకే మార్కెటింగ్, అడ్వర్టైజింగ్‌లోకి వెళ్లాలనుకుంది. వెంటనే Denstu Inc.లో చేరింది. అక్కడ పార్లే, ఐటిసి మొదలైన బ్రాండ్‌లతో పనిచేసింది. 'నచ్చిన మార్కెటింగ్‌లో చేరినప్పటికి నా ఆలోచనలకు అక్కడ ప్రాధాన్యం లేదు. నా అభిప్రాయాలకు చోటు లేదు. దాంతో నాకు స్వేచ్ఛకావాలనిపించింది' ఆమె చెప్పింది. 2019లో సోషల్ మీడియా ద్వారా ముంబైకి చెందిన ఒక బ్రాండ్ గురించి తెలుసుకుంది. వారు తమ ఈవెంట్‌లో ఫుడ్ స్టాల్‌ను ఏర్పాటు చేయవల్సిందిగా ఆమెను కోరారు. ఎంతో ఉత్సాహంగా ఆ ఈవెంట్‌లో పాల్గొంది. తర్వాత ఆమెకు చాలా ప్రశంసలు వచ్చాయి. ఆ ధైర్యంతో తన ఉద్యోగాన్ని విడిచిపెట్టి తన సొంత వ్యాపారాన్ని ప్రారంభించాలనుకుంది.

సవాళ్లు ఉన్నప్పటికీ...

కేవలం రూ.50,000 పెట్టుబడితో ఇంటి వంటగదిలోనే తన కంపెనీని ప్రారంభించింది. మొదట్లో వారానికి రెండు, మూడు ఆర్డర్లు వచ్చేవి. దీంతో భవిష్యత్‌లో వ్యాపారం ఎలా నడుస్తుందో అని కాస్త కంగారు పడింది. 'నేను ఒకపక్క నా ఉద్యోగాన్ని విడిచిపెట్టాను. మరోపక్క ఆర్డర్లు సరిగా రాలేదు. ఇది క్లిష్ట పరిస్థితిగా అనిపించింది' అంటూ ఆమె గుర్తు చేసుకుంది. ఇలాంటి సవాళ్లు ఉన్నప్పటికీ తన ప్రయత్నాలను కొనసాగించింది. తర్వాత కాలంలో రోజుకు రెండు, మూడు ఆర్డర్‌లకు పెరిగి ఆపై పది ఆర్డర్‌లకు ఆమె వ్యాపారం వృద్ధి చెందింది. 'వ్యాపార వేత్తగా ఉండటం అంటే ఎన్నో బాధ్యతలు ఉంటాయి. నిరంతరం అభివృద్ధి చెందుతున్న పాత్ర మనది. ఈ పని అత్యంత సవాలుగా ఉన్నప్పటికీ మంచి గుర్తింపునిస్తుంది' అని ఆమె జతచేస్తుంది. మహిళా వ్యాపారవేత్తగా తాను ఎదుర్కొన్న సవాళ్ల గురించి మాట్లాడుతూ 'లింగ వివక్ష నాకు వ్యక్తిగత సవాలుగా అనిపించలేదు. అందరినీ సమానంగా చూడాలి అనే వాతావరణంలో నేను పెరిగాను. దానికి తోడు నాతో వ్యాపారం చేస్తున్న వ్యక్తులు కూడా నన్ను స్వాగతించి సహకరించారు' అని చెప్పింది.

రుచితో పాటు ఆరోగ్యం

ప్రారంభంలో ఆమె నట్ బటర్ వంటి ప్యాక్ చేసిన ఆహారాలను అందిస్తూ తన వెంచర్‌ను ప్రారంభించింది. అయితే దీని కోసం కష్టమర్లు రెండు రోజులు ఎదురు చూడాల్సి వచ్చేది. దాంతో వాళ్ళు మరోసారి ఆర్డర్ ఇవ్వడానికి ఇష్టపడేవారు కాదు. అందువల్ల ది సిన్నమోన్ కిచెన్ కింద బేకరీ ప్రారంభించాలని ఆమె నిర్ణయించుకుంది. ఇప్పుడు ఆమె ఢిల్లీ అంతటా తన కేక్‌లను అందిస్తుంది. కంపెనీ తొలి ఏడాది రూ.1,40,000 వ్యాపారం చేసింది. తర్వాతి ఏడాది ఇది రూ. 12,50,000 అమ్మకాలను చూసింది. ఈ ఏడాది సుమారు రూ. 6 కోట్ల విక్రయాలు జరగొచ్చని అంచనా వేస్తోంది. 'ఇన్‌స్టాగ్రామ్‌లో మా బ్రాండ్‌గా ప్రారంభించాము. కస్టమర్లకు అసలు ఏమి అవసరమో తెలుసుకోవడానికి వారితో ఇంటరాక్ట్ అవ్వడానికి ఇది నాకు సహాయపడింది' ఆమె చెప్పారు.



బేకింగ్ వర్క్‌షాప్‌లు

'చక్కెర లేని, ప్రిజర్వేటివ్‌లు లేని' ఉత్పత్తులను అందించడమే కాకుండా తన వినూత్న వంటకాల పట్ల ఆమె గర్వంగా ఉంది. ఈమె వ్యాపారంలో 80% పైగా మహిళా శ్రామిక శక్తి కూడా ఉంది. ఇంకా మహిళల కోసం ఆమె బేకింగ్ వర్క్‌షాప్‌లను నిరంతరం నిర్వహిస్తుంది. ఈ వర్క్‌షాప్‌లు మూడు గంటలు ఉంటాయి. దీనికి రూ. 1,750 ఖర్చు అవుతుంది. చాలా మంది గృహిణులు ఈ వర్క్‌షాప్‌లలో ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఆమె చెబుతుంది. సిన్నమోన్ కిచెన్‌కి వెబ్‌సైట్‌తో పాటు Blinkit, Amazon, Le Marche వంటి వాటి ద్వారా ఉత్పత్తులను విక్రయిస్తోంది. అలాగే ఆఫ్‌లైన్ స్టోర్‌లలో కూడా అందుబాటులో ఉన్నాయి. రాబోయే ఏడాదిలో ఉత్పత్తుల సంఖ్యతో పాటు ఆఫ్‌లైన్ స్టోర్లను పెంచడంపై దృష్టి పెట్టాలని ఆమె భావిస్తుంది.



అన్నదాతల్ని దేశ శత్రువులుగా భావించొద్దు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పంజాబ్, ఢిల్లీ సరిహద్దుల్లోని హైవేలపై ఇనుప మేకులు, ముళ్ల తీగలు, కాంక్రీట్ బారికేడ్‌లు ఏర్పాటు చేసి ప్రజాస్వామ్యయుతంగా నిర్వహిస్తున్న రైతుల ఆందోళనలపై మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నియంతృత్వ ధోరణి పట్ల సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం)తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఢిల్లీ, హర్యానా పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించి ప్రజలకు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ట్రాఫిక్‌ను దారి మళ్లించి ప్రజలను భయాందోళనకు గురిచేస్తోందని విమర్శించింది. నిరసనకారులను మోడీ ప్రభుత్వం దేశ శత్రువులుగా చూస్తోందని ధ్వజమెత్తింది. ఈ మేరకు సోమవారం ఎస్కేఎం ప్రకటన విడుదల చేసింది. "ఎఐకేఎస్ నేత రామ్ నారాయణ్ కురారియాతో సహా అతని భార్య, ఐద్వా నేత అంజనా కురారియా, కిసాన్ సంఘర్ష సమితి నాయకుడు ఆరాధనా భార్గవ, బీకేయూ (తికాయత్) నేత అనిల్ యాదవ్, ఎస్‌పీఎం నేత రాజ్‌కుమార్ సిన్హాలు, మధ్యప్రదేశ్‌తో పాటు ఐదు రాష్ట్ర నాయకులు, ఎస్కేఎం నాయకులపై సీఆర్పీసీ సెక్షన్ 151 కింద అరెస్టు చేసి జైలులో పెట్టారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పలువురు కార్యకర్తలను అరెస్టు చేశారు" అని తెలిపింది

"ఫిబ్రవరి 13న చలో ఢిల్లీకి తాము పిలుపునివ్వలేదని, ఈ ఆందోళనతో ఎస్‌కెఎంకు ఎలాంటి సంబంధం లేదని ఎస్‌కెఎం ముందే స్పష్టం చేసింది. అయితే, ఎస్‌కెఎం కాకుండా ఇతర సంఘాలకు నిరసన తెలిపే హక్కు ఉంది. మితిమీరిన రాజ్య అణచివేతకు కట్టుబడి ఉండే బదులు ఇటువంటి నిరసనలను ప్రజాస్వామ్య పద్ధతిలో చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది" అని తెలిపింది.

"ప్రజల జీవనోపాధి డిమాండ్లపై ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక/ సెక్టోరల్ సమ్మె పిలుపు నేపథ్యంలో రైతులు, కార్మికుల వేదికలతో చర్చలకు ప్రభుత్వం ఎందుకు సిద్ధంగా లేదో ప్రధాని మోడీ స్పష్టం చేయాలి" అని ఎస్కేఎం పేర్కొంది.

"ప్రజల జీవనోపాధి డిమాండ్లపై దేశమంతటా జరుగుతున్న పోరాటాలను, ప్రజల ఆందోళనను అణిచివేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించవు. పౌరులందరికీ నిరసన తెలిపే హక్కును కల్పించే రాజ్యాంగం దేశంలో ఉందని ప్రధాని నరేంద్ర మోడీ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌లకు ఎస్కేఎం గుర్తు చేసింది. ఎస్కేఎం అన్ని రాజకీయ పార్టీలు, అన్ని వర్గాలకు చెందిన వర్గ, బహుజన సంఘాలు మోడీ పరిపాలన దురాక్రమణను ఖండించాలి" అని విజ్ఞప్తి చేసింది.

" బీజేపీ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న అణచివేతను ప్రజలు తిప్పికొట్టాలి. అన్ని వర్గాల ప్రజల మద్దతుతో రైతులు, కార్మికులు ఫిబ్రవరి 16 పారిశ్రామిక/ సెక్టోరల్ సమ్మె గ్రామీణ బంద్‌ను భారీగా, ఉత్సాహంగా, విజయవంతమయ్యేలా చేయాలి" అని పిలునిచ్చింది.

కేసీఆర్ హయాంలో తెలంగాణ వ్యతిరేకులకు రెడ్ కార్పెట్

- మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తన ప్రభుత్వ హయాంలో కేసీఆర్ తెలంగాణ వ్యతిరేకులకు రెడ్ కార్పెట్ పరిచారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. అసెంబ్లీలో కృష్ణాజలాలపై సోమవారం జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే కేసీఆర్ ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. తెలంగాణకు సంబంధించిన నీళ్ల హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రాజెక్టులు ఏటీఎమ్‌లుగా మారాయని ఆరోపించారు. తెలంగాణ కోసం కేసీఆర్ ఒక్కరే పోరాడలేదన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లుపై చర్చ జరిగిన సమయంలో తానూ, రాజగోపాల్‌రెడ్డి ముందువరుసలో ఉన్నామన్నారు. అప్పుడు కేసీఆర్ ఎక్కడ పోయారని నిలదీశారు. ఇక్కడ ప్రాజెక్టులను వదిలిపెట్టి రాయలసీమలో రత్నాల సీమ చేస్తామని కేసీఆర్ ఎలా అన్నారని ప్రశ్నించారు. కృష్ణా నదీజలాల్లో జరిగిన అన్యాయంపై అడుగుతుంటే గోదావరి నీళ్ల అంటున్నారనీ, కృష్ణా అయినా, గోదావరి అయినా మన వాటా మనకు దక్కాల్సిందేనని నొక్కి చెప్పారు.

జలదోపిడీని అడ్డుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించే ప్రసక్తే లేదు..రాష్ట్ర ప్రజలకు అపోహలు కలిగేలా కొందరు మాట్లాడుతున్నారని ' అని వ్యాఖ్యానించారు.

కేసీఆర్‌ను జగన్ పొగిడారు

బచావత్ ట్రిబ్యునల్ ఎలాంటి నీటి కేటాయింపులు చేయలేదు. రాష్ట్ర నీటిహక్కుల సాధనలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైంది. గులాబీ పాలకులదీ అసమర్థతతో..అవగాహనా లోపమో అర్థంకాదు..ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలకు కేసీఆర్ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఢిల్లీ వెళ్లి 512:299 టీఎంసీలకు ఒప్పుకున్నారు. ఆ కేటాయింపును ఏపీ ప్రభుత్వం శాశ్వతం చేస్తున్నది. కృష్ణాజలాల్లో 70 శాతం హక్కులు పొందేందుకు తెలంగాణకు అర్హత ఉంది. పదేండ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అవినీతి స్వతంత్ర భారతంలో ఎప్పుడూ జరగలేదు..జగన్, కేసీఆర్ గంటలతరబడి ఏకాంత చర్చలుచేశారు. రోజుకు మూడు టీఎంసీల నీటిని తరలించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. 797 అడుగుల వద్ద నీటి తరలింపు జీవో నెంబరు 203ను జగన్ సర్కారు ఇచ్చింది. ఈ సందర్భంగా కేసీఆర్‌కు దన్యవాదాలు చెబుతూ ఏపీ శాసనసభలో సీఎం జగన్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌ను పవర్ పాయింట్ ప్రజేంటేషన్ సందర్భంగా ప్రదర్శించారు.

అపెక్స్ కౌన్సిల్‌కు కావాలనే గైర్హాజరు

'రాయలసీమ లిఫ్ట్ పూర్తయితే రోజుకు ఎనిమిది టీఎంసీల నీటిని ఏపీ తరలిస్తుంది.ఆ లిఫ్ట్ టెండర్లు పూర్తయ్యాకే కేసీఆర్ కేంద్రానికి లేఖ రాశారు. పరోక్షంగా సహకరించారు. కావాలనే కేసీఆర్ అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి వెళ్లలేదు. సమావేశానికి వెళ్లి అభ్యంతరం చెబితే రాయలసీమ లిఫ్ట్ నిర్మాణం ఆగి ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల అప్పగింతపై ఏ నిర్ణయం తీసుకోలేదు. నల్లగొండ వెళ్లే మందు తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ సర్కారు, కేసీఆర్ క్షమాపణ కోరాలి' అని ఉత్తమ్ డిమాండ్ చేశారు. ఈనేపథ్యంలో వాస్తవాలకు ప్రజలకు, శాసనసభ్యులకు తెలియజేసేందుకు ప్రభుత్వ ఖర్చుతో మేడిగడ్డకు తీసుకెళు తున్నామన్నారు. అధికార, విపక్షాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు లేఖలు రాశామని, అందరికి ఇదే ఆహ్వానమని అన్నారు. అసెంబ్లీ నుంచి బస్సుల్లో వెళదామని వివరించారు.

అసెంబ్లీ తీర్మానం

తెలంగాణకు చారిత్రక అన్యాయం జరిగిందనీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో షరతులకు అంగీకరించకపోతే ఉమ్మడి ప్రాజెక్టులకు అప్పగించబోమని అసెంబ్లీ తీర్మానం చేసింది. రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ,పరివాహక ప్రాంతం, కరువు ప్రాంతం,బేసిన్‌లోని జనాభా, సాగు ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని చేయాల్సి పేర్కొంది. ఈ వివాదం ట్రిబ్యునల్ ప్రకారం బేసిన్‌లోని అవసరాలకే మొదటి ఇవ్వాలని చెప్పింది. 1962లో శ్రీశైలం ప్రాజెక్టులను జలవిద్యుత్ కేంద్రంగా మంజూరు చేసిన ప్రణాళిక సంఘం, నాగార్జునసాగర్‌కు 264 టీఎంసీలు విడుదల చేయాలని చెప్పినట్టు గుర్తు చేసింది. దీంతోపాటు శ్రీశైలంలో కనీస నీటి వినియోగ మట్టం 830 అడుగులుగా ఉండాలని చెప్పింది. శ్రీశైలం జలాశయం నుంచి బేసిన్ వెలుపలకు కేవలం 34 టీఎంసీలు మాత్రమే తరలించాలనీ, తాగునీటి అవసరాలను కేవలం 20 శాతంగానే పరిగణనలోకి తీసుకోవాలని వివరించింది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం రాష్ట్రాలకు క్యారీ ఓవర్ అవకాశం ఉండాలనీ, కృష్ణాజలాలు తరలించేలా బేసిన్ వెలుపల అనుతుల్లేని ప్రాజెక్టులు, విస్తరణ, పనులు చేపేట్టకుండా చూడాలని తీర్మానంలో పేర్కొంది.

పద్మారావుకు బాధ్యతలు అప్పగించాలి

కేసీఆర్‌కు రేవంత్ సలహా

కేసీఆర్ సభకు రాకపోవడంపై రేవంత్ స్పందిస్తూ 'తెలంగాణ సమాజానికి నీళ్ల ప్రాణప్రదాయిని.ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ, ఖమ్మం వరకు కృష్ణానదీ జలాల మీదనే ఆధారపడి జీవితాలు కొనసాగిస్తున్నాం. మహబూబ్‌నగర్ నుంచి 10 లక్షలకుపైగా తట్టపని, మట్టిపని,బొగ్గుపనులకోసం వలసలు వెళ్లారు. ఇందుకు కారణం ఒక వ్యక్తి అని అన్నారు. కృష్ణాజలాలపై చర్చ జరుగుతుంటే, ఆ హానుభావుడు ఒక్కడకు రాకుండా ఫామ్‌హౌస్‌లో ఉన్నాడు. తెలంగాణ సమాజాన్ని అవమానిస్తున్నాడు. ఇంతకంటే కీలకమైన అంశం ఈ తెలంగాణకు ఏమైనా ఉందా ? కృష్ణా నదీ పరివాహక ప్రాంతం ప్రకారం 68 శాతం శాటా నీళు తెలంగాణకు ఇవ్వాలని ప్రత్యేక తీర్మానం తీసుకొచ్చినప్పుడు హుందాగా ప్రధానప్రతిపక్ష నాయకులు వచ్చి ఇక్కడ కూర్చొని ఈ తీర్మానానికి మద్దతు పలికి తెలంగాణ హక్కుల మీద, నీళ్ల మీద ఒకే మాట మీద నిలబడ్డామని ఆంధ్రప్రదేశ్ నుంచి కేంద్ర ప్రభుత్వం వరకు ఒక సందేశాన్ని పంపాల్సిన సమయం, సందర్భంలో సభకు రాకుండా ఫామ్‌హౌస్‌లో దాక్కుని ప్రజలను తప్పుదోవ పట్టించడానికి మిగతావారిని పంపించి అబద్దాలు ఆడిస్తున్నారని అన్నారు. అయినా సభలో హరీశ్‌రావు, ఇతరులు మాట్లాడే మాటలకు విలువ లేదని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుడిగా పద్మారావుకు బాధ్యతలు ఇవ్వాలి. ఆయన నిజమైన తెలంగాణ ఉద్యమకారుడు. తెలంగాణ కోసం కొట్లాడేవారు. వారిలాంటివారికి నిర్వహణ బాధ్యతను ఇస్తే సమాజానికి మేలు జరుగుతుందని సీఎం అన్నారు.

సభకు రాకుండా..

నల్లగొండకు వెళ్తారా ? భట్టి

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చర్చలోకి వస్తూ కృష్ణా జలాలపై అసెంబ్లీలోచర్చ చేపట్టి, తీర్మానం చేసి ఢిల్లీకి పంపుదామంటే, ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ భకు రాలేదని అన్నారు. అసెంబ్లీకి రాని వ్యక్తి, మంగళవారం నల్లగొండ సభకు ఎలా వెళతారని ప్రశ్నించారు. ఈఎన్సీ మురళీధర్‌రావును బీఆర్ఎస్ తమకు అనుకూలంగా మాట్లాడించిందని ఆరోపించారు. ఆయన రిటైరైనా పదేండ్లు బీఆర్ఎస్ సర్కారు కొనసాగించిందన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు సభను తప్పుదోవపట్టిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వంలో బీఆర్ఎస్ ఏజెంట్లు చాలా మందే ఉన్నారనీ, వారిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని అన్నారు.

అడుగడుగునా నిర్బంధం

(మొదటిపేజీ తరువాయి)

ఉంటాయి. ప్రజా రవాణా వాహనాలను నగరంలోకి అనుమతించడం లేదు. ఎవరూ ఆయుధాలు ధరించి తిరగకూడదని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో ప్రమాదకరమైన వస్తువులతో తిరగడాన్ని కూడా నిషేధించారు. అనుమతి లేకుండా లౌడ్‌స్పీకర్లను వాడకూడదని చెప్పారు. రెచ్చగొట్టేలా సందేశాలను వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తప్పవని హుకుం జారీ చేశారు. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసే కార్యక్రమాలకు మాత్రం ఇవేవీ వర్తించవు. పోలీసులు జారీ చేసిన ఆదేశాల ప్రకారం...రోడ్లను దిగ్బంధించకూడదు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడకూడదు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదు. ప్రదర్శనలు నిర్వహించడం, వాటిలో పాల్గొనడం నేరం.

సరిహద్దు జిల్లాల నుండి రాజధానికి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కర్రలు, బ్యానర్లు వంటి వస్తువులతో సంచరించడాన్ని పూర్తిగా నిషేధించారు. వివాహాలు, అంత్యక్రియలు, ఇతర మతపరమైన కార్యక్రమాల కోసం సంబంధిత అధికారుల నుండి ముందుగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఢిల్లీకి తరలి వచ్చే రైతులను అడ్డుకునేందుకు తిక్రి సరిహద్దు మెట్రో స్టేషన్ సమీపంలో ఐదంచెల బారికేడ్లను ఏర్పాటు చేశారు. సింఘు, ఘాజీపూర్ సరిహద్దుల వద్ద కూడా పోలీసులు జాతీయ రహదారులను మూసేశారు. రాజధాని సరిహద్దుల వద్ద పెద్ద ఎత్తున పోలీసులు, పారా మిలటరీ దళాలను మోహరించారు. సరిహద్దుల వద్ద నిఘా కోసం డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. అనేక చోట్ల ట్రాఫిక్‌ను దారి మళ్లించారు.

ఢిల్లీ వెళుతున్న కర్నాటక రైతులను భోపాల్‌లో అరెస్ట్ చేయడాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఖండించారు. వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు. పలు రాష్ట్రాల నుండి రాజధాని వైపు వస్తున్న రైతులను పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధిస్తున్నట్లు వార్తలందుతున్నాయి. ఓ వైపు రైతులతో చర్చలు జరుపుతామని చెబుతూనే మరోవైపు వారిని అరెస్ట్ చేస్తున్నారని, అలాంటప్పుడు సంప్రదింపులు ఎలా సాధ్యమని రైతు సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. అంబాలా, జింద్, ఫతేహాబాద్, కురుక్షేత్ర వద్ద పంజాబ్‌తో ఉన్న సరిహద్దులను హర్యానా ఇప్పటికే మూసేసింది. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో 144వ సెక్షన్ విధించింది.

ఇదిలావుండగా ఢిల్లీ ఛలో కార్యక్రమంలో పాల్గొనేందుకు పంజాబ్ నుండి పెద్ద సంఖ్యలో ట్రాక్టర్ ట్రాలీలు బయలుదేరాయి. ఈ ఆందోళనలో 200కు పైగా రైతు సంఘాలు భాగస్వాములవుతున్నాయి. పంటలకు కనీస మద్దతు ధరలు కల్పిస్తామన్న హామీకి చట్టబద్ధత కల్పించాలని రైతులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు.

కార్పొరేట్ శక్తుల కోసమే సాగు నల్ల చట్టాలు

(మొదటిపేజీ తరువాయి)

వాయిదా వేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చెల్లించలేకపోయిందన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశంలో ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాశారన్నారు. పెంచిన ధరలను అరికట్టకుండా పేదలపైన భారాలు మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 16న జరిగే గ్రామీణ భారత్ బంద్‌లో పెద్దఎత్తున రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.శోభన్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య, మండల అధ్యక్షుడు కె.జంగయ్య నాయకులు బి.శ్రీశైలం, ఎస్.జంగారెడ్డి, లింగం తదితరులు పాల్గొన్నారు.

రాచకొండ కమిషనర్ ఆకస్మిక బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

కోసం ఎదురు చూస్తున్న ఎస్పీ మురళీధర్‌ను రాష్ట్ర పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించి.. ఇక్కడున్న డాక్టర్ బి. నవీన్ కుమార్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. రాజేంద్రనగర్ అదనపు డీసీపీ సాధన రశ్మీ పెరుమాల్‌ను బదిలీ చేసి నగర టాస్క్‌ఫోర్స్ డీసీపీగా నియమించారు.

బల పరీక్ష నెగ్గిన నితీశ్ సర్కాం

(మొదటిపేజీ తరువాయి)

అనుకూలంగా తుది స్కోర్ 129-0గా మారింది. జేడీయూకి 45మంది ఎంఎల్‌ఎలు వుండగా, బీజేపీకి 79, హెచ్‌ఎఎంకి నలుగురు వున్నారు. అంటే మొత్తం 128మంది వున్నారు. ముగ్గురు ఆర్జేడీ ఎంఎల్‌ఎలు పాలక ఎన్డీఏ వైపునకు ఫిరాయించి, అనుకూలంగా ఓటు వేసినట్లు వార్తలందాయి. జేడీయూకి చెందిన ఒక ఎంఎల్‌ఎ బలపరీక్షకు గైర్హాజరయ్యారు. మరో ఎంఎల్‌ఎ హజారి డిప్యూటీ స్పీకర్‌గా సమావేశానికి అధ్యక్షత వహిస్తున్నందున ఆయన ఓటు వేయలేరు. అందువల్ల ఎన్డీఏకి 126మందే సభ్యులు వున్నారు. ముగ్గురు ఆర్జేడీ సభ్యులు కూడా ఓటు వేయడంతో 129మంది మద్దతిచ్చినట్లైంది.

భారతరత్న అవార్డులపై ఒప్పందం కుదుర్చుకున్నారు : తేజస్వి యాదవ్

భారతరత్న అవార్డులపై బీజేపీ ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుందని బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ కేంద్రంపై విరుచుకుపడ్డారు. సోమవారం ఆయన విధాన సభలో మాట్లాడుతూ.. 'కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న అవార్డు లభించినందుకు నేను సంతోషిస్తున్నాను. అయితే బీజేపీ వాళ్లు మాతో ఒప్పందం కుదుర్చుకుంటే.. మీకు భారతరత్న అవార్డును ఇస్తాం అనే విధంగా వారు ఒప్పందం కుదుర్చుకున్నారు.' అని తేజస్వియాదవ్ విమర్శించారు.

రేషన్ షాపుల్లో మోడీ పోస్టర్లు, బ్యానర్లు పెట్టం

(మొదటిపేజీ తరువాయి)

లేని విధంగా మోడీ ప్రభుత్వం నూతన ప్రచార పోకడను చేపట్టడం అభ్యంతరకరమని పేర్కొన్నారు. జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఎ) కింద పనిచేస్తున్న రేషన్ పంపిణీ వ్యవస్థను ఎన్నికల ప్రచారానికి వాడుకోవడం సరైంది కాదని విజయన్ కేరళ అసెంబ్లీ వేదికగా కేంద్ర ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. ప్రచారం కోసమే మోడీ ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందనేది సుస్పష్టమని, ఈ తరహా ప్రచారం సరైంది కాదని తమ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తుందని, ఇలా చేయడం కష్టమని కూడా వివరిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలా, లేదా అనే నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

రేషన్ షాపుల్లో 14 వేలకుపైగా ప్రధాని మోడీ పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని, ఆహారోత్పత్తులతో కూడిన క్యారీ బ్యాగ్‌లపై కేంద్ర ప్రభుత్వం లోగోలను ముద్రించాలని కూడా ఎఫ్‌సీఐతోపాటు కేరళ ఆహార శాఖకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి జీఆర్ అనిల్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 550 రేషన్ షాపుల్లో ప్రధాన మంత్రి సెల్ఫీ పాయింట్లను నెలకొల్పాలని కూడా కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందని మంత్రి తెలిపారు.

కెఎల్ రాహుల్ అవుట్

• గాయంతో మూడో టెస్టుకు దూరం • పడిక్కల్‌కు సెలక్టర్ల పిలుపు



ముంబయి : ఇంగ్లాండ్‌తో మూడో టెస్టు ముంగిట టీమ్ ఇండియాకు మరో ఎదురుదెబ్బ. ఇప్పటికే విరాట్ కోహ్లి గైర్హాజరీతో బ్యాటింగ్ లైనప్ సతమతం అవుతుండగా ఫామ్‌లో ఉన్న మిడిల్ ఆర్డర్ బ్యాటర్ కెఎల్ రాహుల్ వరుసగా రెండో టెస్టుకు దూరమయ్యాడు. కండరాల గాయంతో విశాఖ టెస్టుకు దూరమైన రాహుల్ తాజాగా మోకాలి నొప్పితో గురువారం నుంచి ఆరంభం కానున్న రాజ్‌కోట్ టెస్టుకు అందుబాటులో ఉండటం లేదు. 'కెఎల్ రాహుల్ 90 శాతం మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాడు. బెంగళూర్‌లోని ఎన్‌సీఏలో రాహుల్ కోలుకునే ప్రక్రియ కొనసాగుతుంది. రాంచి, ధర్మశాల టెస్టులకు రాహుల్ పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడని ఆశాభావంతో ఉన్నామని' బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. మిడిల్ ఆర్డర్‌లో శ్రేయస్ అయ్యర్‌పై సెలక్టర్లు వేటు వేయటంతో మూడో టెస్టుకు ఆతిథ్య భారత్ బ్యాటింగ్ కష్టాలు కాస్త పెరగనున్నాయి. కెఎల్ రాహుల్ స్థానంలో యువ ఆటగాడు దేవదత్ పడిక్కల్ (కర్ణాటక) జట్టులోకి ఎంపికయ్యాడు. తాజా రంజీ ట్రోఫీ సీజన్లో 92.66 సగటుతో 556 పరుగులు చేసిన దేవదత్ పడిక్కల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. దేశవాళీలో నాణ్యమైన స్పిన్‌పై పరుగుల వరద పారించిన పడిక్కల్ రాజ్‌కోట్ టెస్టులో ఇంగ్లాండ్ స్పిన్నర్లపై పైచేయి సాధించే అవకాశాలు ఉన్నాయి. గాయంతో రెండో టెస్టుకు దూరమైన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా జట్టుతో కొనసాగనున్నాడు. సొంత మైదానంలో జరిగే టెస్టు మ్యాచ్‌కు టీమ్ సెలక్షన్‌కు జడేజా అందుబాటులో ఉండనున్నాడు.

టార్గెట్ రంజీ ట్రోఫీ

● హైదరాబాద్‌కు రంజీ టైటిల్ సాధించటమే లక్ష్యం
● రానున్న రెండు సీజన్లలో టైటిల్ కొడతాం
● నవతెలంగాణతో హైదరాబాద్ కెప్టెన్ తిలక్ వర్మ

భారత సీనియర్ జట్టు నుంచి జూనియర్ జట్ల వరకు అన్నింటా హైదరాబాద్ క్రికెటర్ల ప్రాతినిథ్యం కనిపిస్తుంది. ఏ స్థాయి క్రికెట్‌లో జాతీయ జట్టు బరిలో నిలిచినా.. అందులో ఓ హైదరాబాదీ ఆటగాడు మెరుస్తున్నాడు. జాతీయ జట్లకు ప్రతిభావంతులైన ఆటగాళ్లను అందిస్తున్నా.. ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీల్లో హైదరాబాద్ ఆశించిన ఫలితాలు సాధించటం లేదు. ఇటీవల హెచ్‌సీఏలో పరిపాలన పగ్గాలు మారినట్టే.. మైదానంలో ఆట సైతం మారుతున్నట్టే అనిపిస్తుంది!. రానున్న రెండు సీజన్లలో హైదరాబాద్‌ను రంజీ ట్రోఫీ చాంపియన్‌గా నిలుపటమే లక్ష్యమని కెప్టెన్ తిలక్ వర్మ అన్నారు. రంజీ ట్రోఫీ ప్లేట్ లీగ్‌లో హైదరాబాద్ ఫైనల్స్‌కు చేరుకున్న సందర్భంగా భారత స్టార్ క్రికెటర్ తిలక్ వర్మతో 'నవతెలంగాణ'తో ప్రత్యేక ఇంటర్వ్యూ..

నవతెలంగాణ-హైదరాబాద్



నిరాశకు లోనయ్యాం!

రంజీ ట్రోఫీ ఐదుసార్లు ఫైనలిస్ట్ హైదరాబాద్ ప్లేట్ లీగ్‌కు పడిపోవటంతో జట్టంతా నిరాశకు లోనయ్యాం. ఈ సీజన్ ప్లేట్ లీగ్‌లో ఏం చేయాలనే అంశాన్ని అందరం ఒక సవాల్‌గా తీసుకున్నాం. ప్లేట్ లీగ్‌లో జట్లపై విజయాలు మా లక్ష్యం కాదు. గ్రూప్ దశలో ప్రతి మ్యాచ్‌ను వీలైనంత వేగంగా ముగించటమే మా ప్రణాళిక. ఐదు మ్యాచుల్లోనూ అదే ఫార్ములా అమలు చేశాం. రెండు రోజుల్లోనే విజయాలు నమోదు చేశాం. ఇప్పుడు ఎలైట్ గ్రూప్‌లోకి అడుగుపెడుతున్నాం. ఇక్కడ్నుంచి కథ మారుతుంది.

బ్యాటింగ్ మెరుగుపడాలి

రంజీ ట్రోఫీలో ఎలైట్, ప్లేట్ లీగ్‌లకు ఎంతో వ్యత్యాసం. క్రికెట్ ఆడే స్థాయి, నాణ్యత పూర్తి భిన్నం. ప్లేట్ లీగ్ జట్లు చాలా పురోగతి సాధించాల్సి ఉంది. బౌలింగ్ పరంగా చూసినప్పుడు ప్లేట్ లీగ్ జట్లు మంచి పోటీ ఇవ్వగలుగుతున్నాయి. బౌలర్లు అంచనాలను అందుకుంటున్నారు. కానీ బ్యాటింగ్ పరంగా ఎంతో మెరుగుపడాలి.

ఆ అవకాశం కోసం చూస్తున్నా

ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మంచి ప్రదర్శన చేయటంతోనే నాకు భారత టీ20, వన్డే జట్లలో అవకాశాలు లభించాయి. నేను బాగా ఆడేది రెడ్ బాల్ ఫార్మాటే. ప్రస్తుతం బాగా ఆడుతున్నాను. మంచి స్కోర్లు సాధిస్తున్నాను. రానున్న సీజన్‌లోనూ ఇలాగే నిలకడగా పరుగులు చేస్తూ ఉంటే కచ్చితంగా టెస్టు జట్టులోనూ అవకాశం వస్తుందని అనుకుంటున్నాను. అందుకోసం నేను చేయాల్సిన పని చేస్తూంటే ఉంటాను.

డ్రెస్సింగ్‌రూమ్‌లో గౌరవం

హైదరాబాద్ డ్రెస్సింగ్‌రూమ్‌లో నా కంటే సీనియర్లు ఉన్నారు. అయినా, కెప్టెన్‌గా నాకు అన్ని విధాలుగా మద్దతుగా నిలిచారు. ఓ సోదరుడిగా భావించటంతో పాటు భారత్, ఐపీఎల్‌కు ఆడిన ఆటగాడిగా గౌరవం ఇస్తున్నారు. మ్యాచ్‌లో కొన్ని సందర్భాల్లో కాస్త కఠినంగా ఉండాల్సి వస్తుంటుంది. ఆ సమయంలోనూ సీనియర్లు అర్థం చేసుకుంటూ సహకారం అందిస్తున్నారు. డ్రెస్సింగ్‌రూమ్ వాతావరణం బాగుంది. అందుకు సహచర క్రికెటర్లకు, సహాయక సిబ్బంది, అడ్మినిస్ట్రేటర్స్‌కు ధన్యవాదాలు.

అదే అత్యంత కీలకం

ఐపీఎల్ భిన్నమైన అనుభూతి. అశేష అభిమానుల నడుమ ఎంతో ఒత్తిడి ఉంటుంది. ఆ సమయంలో ప్రశాంతంగా ఉండటం ప్రధానం. ముంబయి ఇండియన్స్ డ్రెస్సింగ్‌రూమ్‌లో నేర్చుకున్న విషయాలను ఇక్కడ హైదరాబాద్ జట్టులో సహచరులతో పంచుకుంటాను. ప్రత్యేకించి టీ20 ఫార్మాట్‌లో ఆడుతున్నప్పుడు ప్రశాంతంగా ఉండటం అత్యంత కీలకం. ఈ ఏడాది సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో హైదరాబాద్ అద్భుతంగా ఆడింది.

టైటిల్ కొడతాం

హైదరాబాద్ చివరగా 1987లో రంజీ ట్రోఫీ టైటిల్ సాధించింది. ఇన్నేండ్ల నిరీక్షణకు తెరదించాలనే పట్టుదలతో ఉన్నాం. రానున్న రెండేండ్లలో హైదరాబాద్‌ను రంజీ విజేతగా నిలుపుతాం. రంజీ ట్రోఫీ టైటిల్ సాధించటమే నా లక్ష్యం. హెచ్‌సీఏ అడ్మినిస్ట్రేషన్, సెలక్షన్ కమిటీ, సహాయక సిబ్బంది నుంచి గొప్ప సహకారం ఉంది. ఇది ఇలాగే కొనసాగితే హైదరాబాద్‌ను రంజీ చాంపియన్‌గా చూసేందుకు ఎంతో సమయం పట్టదు.

హైదరాబాద్‌లో ఎఫ్ఐఎం వరల్డ్‌కప్ ఫైనల్

నవంబర్ 29 నుంచి తుది రేసుకు ఆతిథ్యం

హైదరాబాద్ : మరో ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ ఈవెంట్‌కు హైదరాబాద్ వేదిక కానుంది. ఎఫ్ఐఎం ఈ ఎక్స్‌ప్లోరర్ వరల్డ్‌కప్ సీజన్ 2 ఫైనల్స్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ మోటార్‌సైకిల్ (ఎఫ్ఐఎం) ఈ మేరకు 2034 సీజన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఎనిమిది జట్లు పోటీపడుతున్న వరల్డ్‌కప్‌లో ఈ ఏడాది ఐదు రౌండ్ల రేసులు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 16-17న ఒసాక (జపాన్) తొలి రేసు జరుగనుండగా, నవంబర్ 29-డిసెంబర్ 1 వరకు హైదరాబాద్‌లో ఫైనల్స్ జరుగుతాయి. నార్వే, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్‌లు వరుసగా 2, 3, 4 రౌండ్ల రేసులకు వేదిక కానున్నాయి.



ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్స్‌తో జరిగే ఈ రేసులో ప్రతి జట్టు నుంచి ఇద్దరు రేసర్లు బరిలోకి దిగుతారు. ప్రతి జట్టు నుంచి ఒక పురుష, ఒక మహిళా రేసర్ పోటీ పడాల్సి ఉంటుంది. మెన్, ఉమెన్ కలిసి ఒకే రేసులో పోటీపడటం ఎఫ్ఐఎం ఈ ఎక్స్‌ప్లోరర్ ప్రత్యేకత. భారత్ నుంచి కంకణాల స్పోర్ట్స్ గ్రూప్ 'ఇండీ రేసింగ్' పోటీపడనుంది. స్టార్ రేసర్లు శాంద్రా గోమెజ్, స్పెన్సర్ విల్టన్‌లు ఇండీ రేసింగ్ జట్టు తరఫున రయ్ రయ్ అనిపించనున్నారు.

చాలెంజర్స్‌కు ఏటీపీ నిధులు!

చెన్నై : 2015 తర్వాత భారత్ తొలిసారి ఓ ఏడాదిలో నాలుగు చాలెంజర్ (100) టూర్ టోర్నీలను నిర్వహించనుంది. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ఈ నాలుగు ఈవెంట్లకు ఆర్థికంగా సహకారం అందిస్తున్నట్టు తమిళనాడు టెన్నిస్ సంఘం అధ్యక్షుడు, మాజీ ఆటగాడు విజయ్ అమృత్‌రాజ్ తెలిపారు. చెన్నై చాలెంజర్ టోర్నీ ఆదివారంతో ముగియగా.. బెంగళూర్, పుణె, న్యూఢిల్లీలు వరుస వారాల్లో జరుగుతాయి. 'నాలుగు చాలెంజర్ టోర్నీలకు ఏటీపీ ఆర్థిక సహకారం ఉంది. అందుకే చాలెంజర్ టీవీని ప్రవేశపెట్టారు. మ్యాచుల ప్రసారం ద్వారా లభించిన ఆదాయాన్ని ఏటీపీ టోర్నీల ఖర్చులకు కేటాయిస్తుంది. అన్ని చాలెంజర్ టోర్నీలకు ప్రొడక్షన్ ఖర్చును ఏటీపీ భరిస్తుంది. చాలెంజర్ టోర్నీలకు ఏటీపీ నిధులు కేటాయించటం ఇదే తొలిసారి' అని అమృత్‌రాజ్ తెలిపారు. ఇక చెన్నై చాలెంజర్ టోర్నీలో విజేతగా నిలిచిన సుమిత్ నాగల్ ఏటీపీ ర్యాంకింగ్స్‌లో టాప్-100లోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే.

లగడపాటి శ్రీధర్‌కు టెన్నిస్ టైటిల్

• మెన్స్ డబుల్స్ చాంప్స్ అనిరుధ్, సిద్దార్థ్ జోడి
• ముగిసిన హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్





హైదరాబాద్ : 16వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ జూబ్లిహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ (జెహెచ్ఐసి) స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం ఘనంగా ముగిసింది. మెన్స్ 50 ప్లస్ సింగిల్స్‌లో లగడపాటి శ్రీధర్ 10-8తో వహీద్‌పై విజయం సాధించి టైటిల్ సాధించగా.. 30 ప్లస్ డబుల్స్‌లో అనిరుధ్, సిద్దార్థ్ జోడి 10-8తో విజయ్, ఈశ్వర్‌లను ఓడించి విజేతలుగా నిలిచారు. నంద్యాల నర్సింహారెడ్డి, వహీద్‌లు పురుషుల డబుల్స్ విజేతలుగా నిలిచారు. మెన్స్ 50 ప్లస్ డబుల్స్‌లో నంద్యాల, వహీద్‌లు 10-6తో సుధాకర్ రెడ్డి, దినకర్‌లపై విజయం సాధించారు. పురుషుల సింగిల్స్‌లో సూర్య పవన్ (30 ప్లస్), రాజ (40 ప్లస్), రామ్‌రెడ్డి (60 ప్లస్), సేతు (70 ప్లస్) టైటిల్స్ సాధించగా.. డబుల్స్ విభాగంలో సేతు, రాంబాబు (70 ప్లస్), పాల్ మనోహర్, జోజి రెడ్డి (60 ప్లస్), విజయ్ వర్మ వెంకట శివకుమార్ (40 ప్లస్) విజేతలుగా నిలిచారు. తెలంగాణ ఏసీబీ అదనపు డైరెక్టర్ ఏఆర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ (హెచ్ఓటీఏ) అధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డి, ఆఫీస్ బేరర్లు వాసుదేవరెడ్డి, ఏఆర్ రావు, ఎల్ శ్రీనివాస్, అనిరుధ్, సందీప్, సుబ్రమణ్యం, సదాశివ రెడ్డి సహా జూబ్లిహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, కార్యదర్శి రాజేశ్వర్ రావు, స్పోర్ట్స్ కన్వీనర్ ప్రవీణ్ రెడ్డి, ప్రసాదరావు, వర్మ తదితరులు టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో పాల్గొన్నారు.

అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా

సందీప్ కిషన్ నటించిన ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'ఊరు పేరు భైరవకోన'. విఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నారు. కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ కథానాయికలుగా నటించారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై అనిల్ సుంకర సమర్పిస్తున్నారు. బాలాజీ గుత్తా ఈ చిత్రానికి సహ నిర్మాత. ఈ చిత్రం ఈనెల 16న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు విఐ ఆనంద్ ఈ చిత్ర విశేషాలని విలేకరుల సమావేశంలో పంచుకున్నారు.



విఐ ఆనంద్

● సందీప్ 'ఊరు పేరు భైరవకోన' కథకు చాలా ఎగ్జైట్ అయ్యారు. నాకు కూడా ఈ కథ చేస్తే చాలా కొత్త ఉంటుంది. ఒక ట్రెండ్ సెట్ చేసేలా ఉంటుదని ఫిక్స్ చేశాం. ఇప్పటివరకూ సందీప్ కూడా సూపర్ నేచురల్ ఫాంటసీ జోనర్ చేయలేదు. ఆయనకి కూడా ఇది చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. బిగ్ స్క్రీన్ పై విజువల్, సౌండ్ పరంగా ఒక గొప్ప ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది. హాస్య మూవీస్‌లో ప్రొడక్షన్ నెం.1 ఈ సినిమా. మా మంచి కోరే వ్యక్తి అనిల్ సుంకర. ఆయన ఈ ప్రాజెక్ట్‌లోకి వస్తే బావుంటుందని కోరుకున్నాం. అలా ఆయన జాయిన్ అవ్వడంతో ఈసినిమా జర్నీ స్టార్ట్ అయ్యింది.

● ఈ కథకి 'ఊరు పేరు భైరవకోన' యాప్ట్ అనిపించి ఫిక్స్ చేశాం. టైటిల్‌లో మైథాలజీ టచ్ వుంది. ఈ కథలో కూడా కర్మ సిద్ధాంతం, గరుడపురాణం, శివదండం లాంటి నేపథ్యాలు ఉన్నాయి కాబట్టి ఈ టైటిల్ సరిగ్గా నప్పుతుంది. కర్మ సిద్ధాంతం నియమంలోనే ఈ కథ ఉంటుంది. మనం చేసిన కర్మ వేరే విధంగా తిరిగివస్తుంది. స్టోరీ లైన్‌లోనే ఈ ఫిలాసఫీ ఉంది. లైఫ్, డెత్ గురించి నాకు చాలా ఆసక్తి. చనిపోయిన తర్వాత ఆత్మ ప్రయాణం గరుడపురాణంలో వివరంగా ఉంది. ఈ జర్నీ చాలా ఆసక్తిని కలిగించింది. ఈ సినిమాని ఎక్కడా రాజీపడకుండా చాలా గ్రాండ్‌గా రూపొందించాం. అనిల్, రాజేష్ కథని చాలా బలంగా నమ్మి కావాల్సిన ప్రతీదీ సమకూర్చారు. ఇది యూత్, ఫ్యామిలీతో పాటు అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది.

● ఇందులో వెన్నెల కిషోర్ ట్రాక్ భలే వర్క్ అవుట్ అయ్యింది. డాక్టర్ నారప్ప అనే హిలేరియస్ క్యారెక్టర్ చేశారు. అలాగే వైవా హర్ష పాత్రలో కూడా ఫన్ ఎలిమెంట్ బాగా వచ్చింది. కావ్య థాపర్ పాత్రలో కూడా చాలా ఫన్నీగా ఇంట్రెస్టింగ్ ఉంది. ఆడియన్స్ ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. సినిమా ఫన్ రైడ్‌లా ఉంటుంది.

● అలాగే ఇందులో రెండు పెద్ద ట్విస్ట్‌లు ఉన్నాయి. వీటితో పాటు చిన్న చిన్న ట్విస్ట్‌లు కూడా అంటే ప్రతి పదినిమిషాలకు ప్రేక్షకులు ఊహించని మలుపులు చోటు చేసుకుంటాయి. స్క్రీన్ ప్లే చాలా ఎంగేజింగ్‌గా ఉంటుంది. థియేటర్‌లో ఎంజాయ్ చేసి చూసే సినిమా ఇది. సందీప్‌లో ఫైర్, ప్యాషన్ బాగా ఉంది. ప్రతి సినిమాని మొదటి సినిమాలా నమ్మి పని చేస్తున్నారు. నటన పరంగా చాలా పరిణతి సాధించారు.

● ఈ సినిమా కచ్చితంగా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. నిఖిల్ తో ఓ సినిమా చర్చల్లో ఉంది. దీంతోపాటు అలాగే ఓ పెద్ద హీరోకి కథ రాస్తున్నాను. వాటి వివరాలు త్వరలోనే తెలియజేస్తాను.

నవచిత్రం

ఈగల్‌కు విశేష ప్రేక్షకాదరణ



రవితేజ నటించిన స్టయిలీష్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించగా, వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈనెల 9న విడుదలై అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి పబ్లిక్ బ్లాక్ బస్టర్ సక్సెస్‌ని అందుకుంది. ఈ నేపథ్యంలో ఈగల్ మేకర్స్ పబ్లిక్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్ ని నిర్వహించారు.
రవితేజ మాట్లాడుతూ,'ప్రేక్షకుల నుంచి వస్తున్న రెస్పాన్స్‌కు చాలా ఆనందంగా ఉంది. నా పాత్ర మేకోవర్‌కి చాలా మంచి ప్రశంసలు వస్తున్నాయి. కార్తిక్ ఈ కథ చెప్పినప్పుడే ఆ క్యారెక్టర్‌కి చాలా ఎగ్జైట్ అయ్యాను. పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి అభినందనలు. హరీష్ శంకర్‌తో వచ్చే 'మిస్టర్ బచ్చన్'తో హ్యాట్రిక్ కొడుతున్నాం. దేవ్ జాండ్ సౌండ్ ఇరగదీశాడు. తనకి చాలా మంచి భవిష్యత్ ఉంటుంది. అలాగే మణి చాలా పవర్ ఫుల్ మాటలు రాశాడు. తన పద ప్రయోగం చాలా బావుంది. కావ్య థాపర్ పవర్ ఫుల్ క్యారెక్టర్ చేసింది. తనకి బ్రైట్ ఫ్యూచర్ ఉంటుంది. కాళికాదేవి ఎపిసోడ్ అయితే నన్ను నేను నమ్మలేకపోయాను. ఎవరినో చూస్తున్న అనుభూతి కలిగింది. చాలా అద్భుతమైన ప్రశంసలు వస్తున్నాయి. కార్తిక్ అద్భుతమైన విజన్ కలిగిన దర్శకుడు. చెప్పినదాని కంటే అద్భుతంగా తీశాడు. తను టాప్ డైరెక్టర్ అవుతాడు. అనుపమ, అజయ్ ఘోస్, వినయ్ రాయ్ అందరూ తమ పాత్రలని పర్ఫెక్ట్ గా చేశారు' అని తెలిపారు.

తండ్రీ కొడుకుల అనుబంధంతో లవ్ యువర్ ఫాదర్



మనీషా ఆర్ట్స్ అండ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, అన్నపరెడ్డి స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'లైఫ్ లవ్ యువర్ ఫాదర్'. శ్రీ హర్ష, కషిక కపూర్ హీరో హీరోయిన్లుగా పవన్ కేతరాజు దర్శకత్వంలో కిషోర్ రాఠీ, మహేష్ రాఠీ నిర్మిస్తున్న ఈ మూవీ పూజా కార్యక్రమం మల్లారెడ్డి కాలేజీలో ఘనంగా జరిగింది.
ఎస్‌పిచరణ్, శ్రీహర్ష పై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నెంబర్ ఆఫ్ మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ కామకూర శాలిని కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సిఎంఆర్ గ్రూప్ చైర్మన్ గోపాల్ రెడ్డి క్లాప్ కొట్టారు. గోపాల్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, శ్రీశైలం రెడ్డి, సంతోష్ రెడ్డి చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ని అందించారు. ఈ సందర్భంగా నిర్మాత మహేష్ రాఠీ మాట్లాడుతూ, 'ఈ సినిమా ఒక మంచి తండ్రీ కొడుకుల మధ్యనున్న ఎమోషన్‌ని, బాండింగ్‌ని చూపించే విధంగా ఉంటుంది. మణి శర్మ మ్యూజిక్ అందిస్తున్నారు' అని తెలిపారు. 'ఇది నా మొదటి సినిమా. 100% కష్టపడి అందరికీ నచ్చే విధంగా చేస్తాను' అని హీరో శ్రీహర్ష అన్నారు. ఏ రామస్వామి రెడ్డి మాట్లాడుతూ, 'మా అబ్బాయి శ్రీహర్షాన్ని లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాలో అన్ని ఎలిమెంట్స్ ఉంటాయి. శివుడి పై మంచి పాట కూడా ప్లాన్ చేసాం' అని తెలిపారు. దర్శకుడు పవన్ కేతరాజు మాట్లాడుతూ, 'గతంలో కో డైరెక్టర్‌గా చాలా సినిమాలకు వర్క్ చేశాను. కిషోర్ రాఠీ నన్ను పిలిచి ఈ సినిమా ఇచ్చారు'అని చెప్పారు.

ఆద్యంతం నవ్వించే చారి..



వెన్నెల కిశోర్

చారి... బ్రహ్మచారి... రుద్రనేత్ర సీక్రెట్ సర్వీస్ ఏజెంట్. సైలెంట్‌గా హ్యాండిల్ చేయాల్సిన కేసును వయలెంట్‌గా హ్యాండిల్ చేయడం అతని నైజం. అతడిని 'ఏజెంట్ 111' అని పిలుస్తారు. 'బాండ్... జేమ్స్ బాండ్' టైపులో తనను తాను 'చారి... బ్రహ్మచారి' అని పరిచయం చేసుకోవడం చారికి అలవాటు. ఒక సీరియస్ ఆపరేషన్‌ను కామెడీగా మార్చేస్తాడు అతడు. ఆ తర్వాత ఏమైందనేది సిల్వర్ స్క్రీన్ మీద చూడాలి. 'వెన్నెల' కిశోర్ హీరోగా నటించిన సినిమా 'చారి 111'. సంయుక్తా విశ్వనాథన్ హీరోయిన్. టీజీ కీర్తి కుమార్ దర్శకుడు. బర్కత్ స్టూడియోస్ పతాకంపై అదితి సోనీ నిర్మిస్తున్నారు. మార్చి 1న థియేటర్లలో విడుదల కానుంది. సోమవారం ట్రైలర్ విడుదల చేశారు. ట్రైలర్ జస్ట్ శాంపిల్ మాత్రమేనని, సినిమాలో దీనికి మరింత వినోదం ఉంటుందని దర్శకుడు టీజీ కీర్తి కుమార్, నిర్మాత అదితి సోనీ తెలిపారు. ప్రేక్షకుల్ని 'చారి 111' కడుపుబ్బా నవ్విస్తుందని చెప్పారు. ఆదిత్య మ్యూజిక్ ద్వారా ఈ చిత్రంలోని పాటలు విడుదల కానున్నాయి. మురళీ శర్మ, బ్రహ్మాజీ, సత్య, రాహుల్ రవీంద్రన్, పావని రెడ్డి, 'తాగుబోతు' రమేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

23న తెలుగులో సైరన్ రిలీజ్

'తని ఒరువన్', 'కోమాలి' 'పొన్నియిన్ సెల్వన్' లాంటి చిత్రాలతో తెలుగులో మంచి ఆదరణ పొందిన హీరో జయం రవి. ఆయన తాజాగా 'సైరన్' అనే మాస్ ఎంటర్టైనర్‌తో రానున్నారు. ఆంథోని భాగ్యరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని తెలుగులో గంగ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై మహేశ్వర్ రెడ్డి మూలి ఈనెల 23న విడుదల చేయనున్నారు. కీర్తి సురేష్, అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్లుగా కనిపించనున్న ఈ చిత్ర తెలుగు టీజర్ ఇటీవల విడుదలై మంచి స్పందన రాబట్టుకుంది.
చిత్ర నిర్మాత సుజాత విజయకుమార్ మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో ఫ్యామిలీ, కమర్షియల్ ఎలిమెంట్స్ కుదిరేలా తెరకెక్కించాం. జయం రవి మును పెన్నడూ కనిపించని లుక్, పాత్రలో కనిపించనున్నారు. కీర్తి, అనుపమ మొదటి సారి ఆయనతో కలిసి నటించారు' అని అన్నారు. 'ఈ చిత్రం నాకొక కలలా జరిగిపోయింది. ఒక కొత్త దర్శకుడి మొదటి చిత్రం అదీ పెద్ద హీరోతో అయినప్పుడు, కచ్చితంగా హిట్ అవ్వాలనుకుంటారు. తెలుగు ప్రేక్షకులకి నచ్చుతుందని ఆశిస్తున్నాం' అని దర్శకుడు ఆంథోని భాగ్యరాజ్ అన్నారు. హీరో జయం రవి మాట్లాడుతూ, 'ఈ చిత్రంలో ఎమోషన్స్ చాలా ముఖ్య పాత్రలు వహిస్తాయి. మా 'సైరన్' తమిళ - తెలుగు ప్రేక్షకులని ఆద్యంతం ఆకట్టుకుంటుందనే నమ్మకం పూర్తిగా ఉంది' అని అన్నారు



జయం రవి

ఎయిర్‌ఫోర్స్ పైలట్ తాన్య శర్మ

వరుణ్ తేజ్ బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తూ నటిస్తున్న ప్రాజెక్ట్ 'ఆపరేషన్ వాలెంటైన్'. ఎడ్జ్ ఆఫ్ ది సీట్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా ఇప్పటికే గ్రిప్పింగ్ టీజర్, వందేమాతరం, గగనాల చార్ట్ బస్టర్ సాంగ్స్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది.
ఈ చిత్రంలో వరుణ్ తేజ్ ఐఎఎఫ్ ఆఫీసర్‌గా నటిస్తుండగా, మానుషి చిల్లర్ రాడార్ ఆఫీసర్‌గా కనిపించనుంది. రుహాని శర్మ కూడా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తోంది. తాజాగా మేకర్స్ రుహాని శర్మను తాన్య శర్మగా పరిచయం చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఎయిర్ ఫోర్స్ పైలెట్ యూని ఫాంలో డైనమిక్‌గా కనిపించింది రుహాని శర్మ. ఈ చిత్రం దేశంలోని వైమానిక దళ వీరుల అలుపెరగని పోరాటాన్ని, దేశాన్ని రక్షించడంలో వారు ఎదుర్కొనే సవాళ్లను అద్భుతంగా చూపించ బోతుంది. ఈ చిత్రానికి శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వం వహించారు. వరుణ్‌తేజ్ కెరీర్‌లోనే ది బెస్ట్ మూవీగా ఇది నిలుస్తుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేశారు. దేశభక్తి స్ఫూర్తిని కలిగించే ఈసినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుందంటున్నారు. ఇందులోని ప్రతి పాత్ర ప్రేక్షకుల మనసుల్ని తాకుతుందని, మంచి కంటెంట్‌తో ఉన్న ఇలాంటి సినిమాని నిర్మించడం గర్వంగా ఉందన్నారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్దా రినైసన్స్ పిక్చర్స్ నిర్మించారు, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్ (వకీల్ ఖాన్), నందకుమార్ అబ్బినేని సహ నిర్మాతలు. మార్చి 1న తెలుగు, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.



రుహాని శర్మ

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.